అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 28-03-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 | సంచిక : 86 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



ముగింపు రోజూ మాటల యుద్ధం..

విధానాలపై మొదలెట్టి వ్యక్తిగత విమర్శల దాకా...

ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్, మాజీ మంత్రి కేటీఆర్ వాగ్వాదం

మీరు 'కుటుంబ కారుణ్య నియామకాలు' చేపట్టారు : సీఎం

పసి పిల్లలని కూడా చూడకుండా తిట్టిపోశారు : కేటీఆర్

పరస్పరం సెటైర్లు.. వ్యంగ్యాస్త్రాలు

మధ్యలో జోక్యం చేసుకున్న మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి

వాడివేడిగా అసెంబ్లీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విమర్శలు, ప్రతి విమర్శలు, వాగ్బాణాలు, దూషణ భాషణలతో మొదలైన శాసనసభ బడ్జెట్ సమావేశాలు... చివరి రోజైన గురువారం కూడా అదే రకంగా ముగిశాయి. అధికార, ప్రతిపక్ష సభ్యుల వాదోపవాదాలు తీవ్ర రూపం దాల్చగా... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ సభ్యుడు కేటీఆర్ మధ్య మాటల తూటాలు పేలాయి. 'తగ్గేదేలే...' అంటూ వారిరువురూ ఒకరిపై మరొకరు సెటైర్లు విసురుకున్నారు. రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా నిరుద్యోగుల జీవితాలతో మాజీ సీఎం కేసీఆర్ ఆటలాడుకున్నారంటూ ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. అదే ...6లో

డీలిమిటేషన్‌తో నష్టం

వ్యతిరేకంగా అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం

రాజకీయ ప్రయోజనం లేనందునే సీట్లు పెంచలేదు

అవసరమైతే కేంద్రంపై పోరాడుతాం : సీఎం రేవంత్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. రాజకీయ ప్రయోజనాలు లేకపోవడం వల్లే తెలుగు రాష్ట్రాల్లో శాసనసభా నియోజకవర్గాల సంఖ్యను కేంద్ర ప్రభుత్వం పెంచలేదని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. గురువారం శాసనసభలో డీలిమిటేషన్‌కు వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో సీఎం తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం సీఎం మాట్లాడుతూ 'డీలిమిటేషన్‌లో జనాభాను నియంత్రించిన రాష్ట్రాలు నష్టపోకూడదు. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలనే కొనసాగించాలి. రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాలు 119 నుంచి 153కు పెంచాలి. ప్రస్తుత జనాభాకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ సీట్లను అధికం చేయాలి. మహిళలకు కేటాయించాలి. జనాభా నియంత్రణపై కేంద్రం ఆదేశాలను దక్షిణాది రాష్ట్రాలు పాటించాయి. ఉత్తరాది రాష్ట్రాలు జనాభాను నియంత్రించడంలో విఫలమయ్యాయి. ప్రస్తుతం డీలిమిటేషన్ జనాభా ప్రాతిపదికన జరుగుతున్నదని' సీఎం చెప్పారు. 1971లో రాజ్యాంగ సవరణ ద్వారా డీలిమిటేషన్‌ను 25ఏండ్ల వరకు నిలిపేశారు. అప్పట్లో గందరగోళం నెలకొంది. ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ డీలిమిటేషన్‌పై సమావేశం ఏర్పాటు చేశారు. జనాభా ఆధారంగా చేసే నియోజకవర్గాల పునర్విభజనను అంగీకరించబోమని అందులో తీర్మానం చేశాం. జనాభా ఆధారంగా చేసే డీలిమిటేషన్‌ను మాజీ ప్రధాని వాజ్‌పేయి కూడా వ్యతిరేకించారు. దీనిపై కేంద్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదని కొందరు అంటున్నారు. దక్షిణాది రాష్ట్రాలకు ప్రస్తుతం లోక్‌సభలో 24 శాతం ప్రాతినిధ్యం ఉంది. డీలిమిటేషన్ జరిగితే ఇది 19 శాతానికి పడిపోతుందని' సీఎం చెప్పారు. దీనికి వ్యతిరేకంగా అందరూ ఒకేమాటపై ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం పెట్టే తీర్మానానికి పార్టీలు, రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇవ్వాలి. ఏపీ, తెలంగాణ శాసనసభ నియోజకవర్గాలు ...5లో

శభాష్..

చెప్పిన మాటలను చేతల్లో చూపించిన రేవంత్ రెడ్డి

హైదరాబాద్ బాటలో మరిన్ని రాష్ట్రాలు

తెలంగాణ అసెంబ్లీ తీర్మానంపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ 5లో..



వక్ఫ్ చట్టసవరణలతో మైనార్టీల హక్కులకు ముప్పు

కేంద్ర ప్రభుత్వ తీరుపై సీఎం ఎంకె స్టాలిన్ విమర్శలు

బిల్లును వ్యతిరేకిస్తూ తమిళనాడు శాసనసభ తీర్మానం 13లో



ట్రంప్ దెబ్బకు..

అమెరికా ఒత్తిడేం లేదు.. సుంకాలు తగ్గిస్తాం : కేంద్రం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరినుంచి పలు దేశాలపై టారిఫ్‌లు విధిస్తున్నారు. ఏప్రిల్ 2 నుంచి అమలయ్యే ప్రతీకార సుంకాలను తప్పించుకునేందుకు అమెరికా దిగుమతులపై టారిఫ్ కోతల వైపు ...13లో

మానవ హక్కుల ఉల్లంఘనలకు దారి

ఇమ్మిగ్రేషన్, విదేశీయుల బిల్లుపై సీపీఐ(ఎం) ఎంపీ కె. రాధాకృష్ణన్

ఇండియా ధర్మశాల కాదు : అమిత్ షా

మూజువాణి ఓటుతో ఇమ్మిగ్రేషన్, విదేశీయుల బిల్లు ఆమోదం

అమిత్ షాకు వ్యతిరేకంగా ప్రివిలేజ్ మోషన్ తిరస్కరణ

వివరాలు 5లో

మోయలేని భారంగా అప్పులు



వడ్డీలు కట్టేందుకే తిరిగి అప్పులు చేయాల్సిన పరిస్థితి

2023-24 బడ్జెట్ అంచనా రూ.2,77,690 కోట్లు

చేసిన వ్యయం రూ.2,19,307 కోట్లు

145 సార్లు ఓవర్ డ్రాఫ్ట్‌కు వెళ్లిన సర్కార్

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)నివేదిక వెల్లడి

వివరాలు 14లో

సీఎంది కక్ష సాధింపు చర్యలు



స్వరాష్ట్ర ఉద్యమంలో ప్రజలపై తుపాకి ఎక్కుపెట్టిందెవరు?

పాత కాంగ్రెసోళ్లను ఖతం చేసి పదవి లాక్కుందెవరు?

వంద శాతం రుణమాఫీ జరిగితే రాజకీయాలనుంచి తప్పుకుంటా

తెలంగాణ జాతిపిత కేసీఆర్... బూతుపిత మాత్రం రేవంత్‌రెడ్డే

పరిపాలనంటే పంచ్ డైలాగులు చెప్పడం కాదు

అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్ 6లో..

అది మా విధానం కాదు

అలా అనుకుంటే....కేటీఆర్ చంచల్‌గూడ జైల్లో ఉండేవారు

డ్రోన్ ఎగిరేసానని నన్ను జైల్లో పెట్టి హింసించారు

కేసీఆర్ కుర్చీ మీద కుటుంబ సభ్యులు కన్నేశారు

పెద్దాయనను ఖతం చేసే స్కీం నడుస్తోంది

నాలుగు ఇంగ్లీషు ముక్కలు మాట్లాడితేనే జ్ఞానమా?

నేను ప్రజా క్షేత్రం నుంచి వచ్చినవాడిని : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 6లో..

ముదురుతున్న ఎండలు

వచ్చే మూడ్రోజులు 3 డిగ్రీల మేర పెరిగే అవకాశం

- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ
- 41 నుంచి 44 డిగ్రీలు నమోదయ్యే సూచనలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎండలు ముదిరి పోతున్నాయి. వచ్చే మూడ్రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు రెండు, మూడు డిగ్రీల మేర పెరిగే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న ప్రకటించారు. శుక్ర, శనివారాల్లో ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, ఖమ్మం, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, ములుగు, పెద్దపల్లి, వనపర్తి జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 44 డిగ్రీల మేరకు నమోదయ్యే సూచనలున్నాయని ...6లో

న్యాయవాదుల సంఘాలతో సీజేఐ భేటీ

జస్టిస్ వర్మ బదిలీపై సమాలోచనలు



న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా గురువారం వివిధ బార్ అసోసియేషన్ల నాయకులతో సమావేశమయ్యారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలన్న ప్రతిపాదనపై ...6లో

ఆరోగ్యబీమా లేదు

80 శాతం మందికి పైగా వికలాంగులది ఇదే పరిస్థితి

భారత్‌లోని వికలాంగులకు ఆరోగ్య బీమా అందని ద్రాక్షగానే మారుతున్నది. వికలాంగులు, ముఖ్యంగా, హిమోఫిలియా, బహుళ వైకల్యాలు ఉన్నవారిలో 80 శాతం మందికి పైగా హెల్త్ ఇన్సూరెన్స్ లేదు. ఇక కేంద్ర ప్రభుత్వ ప్రధాన కార్యక్రమమైన ఆయుష్మాన్ -ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ-పీఎంజేఏవై) గురించి కనీసం వినలేదని 42 శాతం మంది చెప్పారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన తాజా సర్వే ఈ విషయాన్ని వెల్లడించింది.



'ఆయుష్మాన్ భారత్' గురించి విననేలేదన్న 42 శాతం మంది

ఎన్‌సీపీఈడీపీ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ : నేషనల్ సెంటర్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ ఫర్ డిజేబుల్డ్ పీపుల్ (ఎన్‌సీపీఈడీపీ) ఈ సర్వేను నిర్వహించింది. 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో వైకల్యంతో ఉన్న వేల మంది నుంచి ఈ సర్వేలో భాగంగా అభిప్రాయాలు సేకరించారు. వైకల్యం ఉన్న వ్యక్తులు వ్యవస్థాగత అడ్డంకులు, ఆరోగ్య బీమాకు అందకపోవటం, ప్రాతినిధ్యంలో లోతైన అసమానతలు ఎదుర్కొంటున్నట్టు ఈ సర్వేలో చెప్పారు.

మహిళలపై లింగ వివక్ష


వికలాంగులు ఆరోగ్య ప్రయోజనాలను సార్వత్రికంగా పొందేలా తక్షణ శ్రద్ధ, విధాన మార్పులకు సర్వే పిలుపునిచ్చింది. ఆదాయం, వయో పరిమితులు లేకుండా వికలాంగులందరినీ పీఎం-జేఏవై కింద చేర్చాలని సూచించింది. మహిళలపై లింగ వివక్షను సర్వే గుర్తించింది. చాలా మంది ఆరోగ్య బీమా కవరేజ్ బయట ఉన్నారని కనుగొన్నది. అటు ప్రయివేటు బీమాను కానీ, ఇటు ప్రభుత్వ బీమాను కానీ కలిగి లేమని 80.5 శాతం మంది తెలిపారు. వికలాంగుల్లో గణనీయమైన భాగంగా, ముఖ్యంగా తలసేమియా, లోకోమోటర్ వైకల్యాలున్నవారు ఆరోగ్య బీమా నుంచి మినహాయించబడటం లేదా దానిని భరించలేకపోతున్నారని డేటా చూపిస్తున్నది.

ఆరోగ్య బీమా పాలసీకి దరఖాస్తు చేసుకోని 71 శాతం మంది

ఏబీ-పీఎంజేఏవై పథకం గురించి మోడీ సర్కారు చాలా గొప్పలు చెప్పుకున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద పథకంగా దీనిని ప్రచారం చేసుకున్నది. సర్వేలో 58.8 శాతం మంది మాత్రమే ఈ పథకం గురించి తెలుసని చెప్పారు. ఇక 41.2 శాతం మంది వికలాంగులు దాని గురించి తెలియదన్నారు. 71 శాతం మంది ఎలాంటి ఆరోగ్య బీమా పాలసీల కోసం దరఖాస్తు చేసుకోలేదని చెప్పారు. "ఆరోగ్య బీమా వైకల్యం ఉన్నవారికి ఒక ప్రత్యేక హక్కు కాదు. ఇది మనుగడకు అవసరం" అని ఎన్‌సీపీఈడీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్మాన్ అలీ ...13లో

అవయవదానానికి నేను రెడీ

ప్రజాప్రతినిధులు అవయవదానంపై ప్రజల్లో చైతన్యం తేవాలి



- సభ్యులు ముందుకొస్తే అసెంబ్లీలో తానే మొదటి సంతకం చేస్తా : బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్
- తానూ చేస్తానని ప్రకటించిన కాంగ్రెస్ సభ్యులు ఆదినారాయణ
- అవయవదాన మార్పిడి బిల్లును ప్రవేశపెట్టిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా
- పలు కీలక సూచనలు చేసిన హరీశ్‌రావు
- ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన శాసనసభ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తాను అవయవ దానానికి సిద్ధమని బీఆర్ఎస్ సభ్యులు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు(కేటీఆర్) ప్రకటించారు. సభ్యులందరూ ముందుకొచ్చి అసెంబ్లీలో కార్యక్రమం పెడితే తానే మొదటి సంతకం చేస్తానని నొక్కి చెప్పారు. అవయవదానం తానూ చేస్తానని కాంగ్రెస్ సభ్యులు ఆదినారాయణ ప్రకటించారు. అవయవదాన మార్పిడి బిల్లును గురువారం శాసనసభలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా ప్రవేశపెట్టారు. ఆ బిల్లు అన్ని పార్టీల సభ్యులు మద్దతు ప్రకటించారు. దీంతో ఆ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. బిల్లుపై మొదట బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు మాట్లాడుతూ అవయవదానంపై పెట్టిన ఈ బిల్లు ఈరోజు వరకు 3724 మంది అవయవదానం కోసం దరఖాస్తు చేసుకొని ఎదురు చూస్తున్న వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. స్వాప్ ద్వారా పరస్పరం అవయవాదనం చేసుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. అవయవాల మార్పిడి దందా చేసే ముఠాలపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఇప్పటివరకు బ్రెయిన్ డెడ్ అయిన విషయాన్ని న్యూరో ఫిజిషియన్లు మాత్రమే నిర్ధారించే వారనీ, ఈ బిల్లు ద్వార డాక్టర్లందరూ నిర్ధారణ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 2013 వరకు కేవలం 189 అవయవ మార్పిళ్లు జరిగితే..జీవన్‌దాన్ ద్వారా తమ పదేండ్ల ప్రభుత్వ హయాంలో 5245 అవయవ దానాలు జరిగాయని సంవత్సరాల వారీగా గణాంకాలను వివరించారు. అవయవ దానాల్లో తెలంగాణ రాష్ట్రం అనేక అవార్డులను పొందిందనీ, దేశంలోనే తొలి స్థానంలో ఉందని కొనియాడారు. నిమ్స్, ఉస్మానియా, గాంధీ లాంటి ప్రభుత్వాస్పత్రుల్లోనే 609 అవయవమార్పిడి చికిత్సలు జరిగాయనీ, 20 లక్షలకుపైగా అయ్యేదన్నా ఖర్చు లేకుండా 577 మందికి ఆరోగ్యశ్రీకింద ఉచితంగా అవయవదాన మార్పిడి విజయవంతం చేశామని తెలిపారు. అవయవదానం చేసిన డెడ్ బాడీకి ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని సూచించారు. ఆ కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు, వారి పిల్లలకు గురుకుల పాఠశాలలో సీటు ఇవ్వాలనీ, ఉచితంగా ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. ఇలాంటి ప్రత్యేకతలు కల్పిస్తే అవయవదానాలను మరింత ప్రోత్సహించినట్టవుతుందని చెప్పారు.

బీఆర్ఎస్ సభ్యులు డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ...బ్రెయిన్ డెడ్ డిక్లరేషన్‌లో గైడ్‌లైన్స్‌ను కఠినంగా రూపొందించాలని సూచించారు. బీజేపీ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ..అవయవదాన బిల్లుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అవయవ దానంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదే సమయంలో ఆర్గాన్ ట్రేడింగ్ అరికట్టాలని సూచించారు. అవయవాల మార్పిడి అనే సుదర్ఘీమైన ప్రక్రియ అనీ, 8, 10 గంటల పాటు డాక్టర్లు శ్రమతో కూడుకున్న ఆపరేషన్‌చేస్తారని తెలిపారు. నిమ్స్‌లో అవయవాల మార్పిడి ప్రక్రియ విజయవంతంగా సాగుతున్నదని చెప్పారు. కాంగ్రెస్ సభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ..ఉస్మానియా ఆస్పత్రిలో గ్యాస్ట్రో ఎంటరాలజీ హెచ్‌ఓడి డా. మధుసూదన్ అనేకమంది పేదలకు ఉచితంగా లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ సర్జరీలు చేసి ప్రాణాలు కాపాడారు. ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు. అలాంటి వైద్యులుంటే పేదలకు సరైన వైద్య సేవలు అందే అవకాశముంటుందని చెప్పారు. గొప్పగొప్ప డాక్టర్లు డాక్టర్ మధుసూదన్‌ని స్ఫూర్తిగా తీసుకుంటే ప్రభుత్వాస్పత్రులపై ప్రజలకు మరింత నమ్మకం పెరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్ సభ్యులు రామచంద్రనాయక్ మాట్లాడుతూ...నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో అవయవ మార్పిడి విభాగాలను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్ఎస్ సభ్యులు దానం నాగేందర్ మాట్లాడుతూ..డోనర్స్‌కు ప్రభుత్వ పరంగా సహకారాలు అందించాలని సూచించారు. ఎంఐఎం సభ్యులు మాజిద్ హుస్సేన్ మాట్లాడుతూ...అవయవదాన బిల్లుకు మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ సభ్యులు లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ..తమ కజిన్ బ్రెయిన్‌డెడ్ అయి చనిపోతే కుటుంబ సభ్యులు అవయవదానం చేశారని గుర్తుచేశారు. ప్రయివేటు ఆస్పత్రుల చికిత్స పొందుతూ మరణించిన వ్యక్తి అవయవ దానం చేస్తే అతని కుటుంబ సభ్యులకు ప్రభుత్వం సహకరించాలనీ, ప్రయివేటు ఆస్పత్రుల్లోని అప్పటి వరకు అయిన బిల్లులను క్లియర్ చేయాలని కోరారు.

అవయవదానానికి తాను సిద్ధం : కేటీఆర్

అవయవ దానానికి తాను సిద్ధమని బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్ ప్రకటించారు. రెండు, రెండున్నర లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలం కాబట్టి ఆదర్శంగా ఉండాలనీ, నియోజకవర్గాల్లోనూ అవయవదానంపై చైతన్యం తేవాలని పిలుపునిచ్చారు. సభ్యులు ముందుకు వస్తే అసెంబ్లీలోనే సంతకాలు చేద్దామన్నారు. అవయవదానంపై మొదటి సంతకం తానే చేస్తానని ప్రకటించారు. అవయవదానం గొప్ప మానవీయ చర్యఅనీ, ఎంతో మందికి జీవితాన్నిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ సభ్యులు ఆదినారాయణ మాట్లాడుతూ..తమ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మిత్రసేన అంటే తనకు అమితమైన గౌరవమనీ, ఆయన డయాలసిస్‌తో బాధపడుతుంటే కిడ్నీ డొనేట్ చేయడానికి సిద్ధపడ్డానని తెలిపారు. తీరా ఆస్పత్రికెళ్లాక కుటుంబ సభ్యుడిని కాదనే కారణంతో డాక్టర్లు నిరాకరించారనీ, ఆ సమయంలో చాలా బాధ పడ్డాడని చెప్పారు. అవయవ దానంపై తాను సంతకం చేస్తానని ప్రకటించారు.

తాజామార్పులతో అవయవదానం మరింత సులువు : మంత్రి దామోదర రాజనర్సింహ్మా

1994లో కేంద్ర ప్రభుత్వం మానవ అవయవాల మార్పిడి చట్టం తెచ్చిందనీ, 2011లో సవరించారని మంత్రి దామోదర రాజనర్సింహ్మా గుర్తుచేశారు. ఈ చట్టంతో జీవన్‌దాన్ బాగా పెరిగిందని చెప్పారు. ఈ అవయవ మార్పిడిని పర్యవేక్షిస్తున్నదనీ, నిబంధనలకు విరుద్ధంగా జరిగే అవయవ మార్పిడిలను అడ్డుకుంటామని నొక్కి చెప్పారు. మెడికల్ టూరిజాన్ని పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నామనీ, ఈ చట్టంలో తాజా మార్పులతో అవయవ మార్పిడి మరింత సులభం కానున్నదని చెప్పారు. మార్గదర్శకాలకు అనుగుణంగానే అవయవ మార్పిడిని చేపడతామని వివరించారు. ఈ చట్టాన్ని పక్కాగా అమలు చేస్తామని చెప్పారు.

ద్రవ్యవినిమయ బిల్లుకు ఉభయ సభల ఆమోదం

- 11 రోజులపాటు అసెంబ్లీ
- శాసనసభ, శాసనమండలి నిరవధిక వాయిదా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

శాసనసభ, శాసనమండలి నిరవధిక వాయిదా పడ్డాయి. ఈనెల 12న ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు 11 రోజులపాటు కొనసాగాయి. గురువారంతో ముగిశాయి. తెలంగాణ ద్రవ్య వినిమయ బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందింది. దీంతోపాటు మరో 12 బిల్లులకు ఆమోదం లభించింది. మొత్తంగా శాసనసభ 11 రోజుల్లో 97 గంటల 32 నిమిషాలపాటు కొనసాగింది. ప్రశ్నోత్తరాలు, జీరో అవర్‌లో పలువురు సభ్యులు తమ నియోజకవర్గాలకు సంబంధించిన ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టుకున్నారు. 22 అనుబంధ ప్రశ్నలను అడిగారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మూడు తీర్మానాలు ఉభయ సభల్లో ఆమోదం పొందాయి. శాసన సభలో ప్రస్తుతం కాంగ్రెస్‌కు 65 మంది, బీఆర్ఎస్‌కు 38, బీజేపీకి 8, ఎంఐఎంకు 7, సీపీఐకి ఒక్కసభ్యుడు ఉన్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.

రుణమాఫీ చేసేందుకు బీఆర్ఎస్‌కు ఐదేండ్లు పట్టింది

రెండోసారి అధికారంలోకి వచ్చి అసలే చేయలేదు



- మేం వచ్చాక రూ. 20,615 కోట్లు మాఫీ చేశాం
- అప్పులకే ప్రతి నెలా రూ.10 వేల కోట్ల వడ్డీ చెల్లిస్తున్నాం : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామంటూ తొలిసారి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్‌కు ఆ పని చేసేందుకు ఐదేండ్లు పట్టిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. రెండోసారి రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చి నాలుగేండ్లపాటు ఆ సంగతే మరచిపోయారని విమర్శించారు. గురువారం శాసనసభలో ద్రవ్యవినియమ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేండ్లలో 21 లక్షల మంది రైతులకు రూ.16,908 కోట్లు రుణమాఫీ చేసిందని తెలిపారు. పదేండ్లలో బీఆర్ఎస్ చేసిన దానికంటే తాము పది నెలల్లోనే ఎక్కువ చేశామన్నారు. ఎన్నికల సమయంలో వాళ్లు ఎగ్గొట్టిన రైతు బంధు కూడా తామే ఇచ్చామన్నారు. ఏక కాలంలో కాకుండా నాలుగు విడతల్లో రూ. 16,908 కోట్లు మాఫీ చేసిందని తెలిపారు. దీంతో రైతులపై వడ్డీ భారం పడిందన్నారు. రెండోసారి కూడా రుణమాఫీ హామీ ఇచ్చి పూర్తి చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన రెండు లక్షల హామీమేరకు ఏకకాలంలో 25,35,964 మంది రైతులకు రూ. 20,615 కోట్లు మాఫీ చేశామని తెలిపారు. అయితే బీఆర్ఎస్ చేసిన అప్పుల కుప్పను తీర్చేందుకు ప్రతి నెలా రూ. 10వేల కోట్ల వడ్డీ చెల్లిస్తున్నామని వివరించారు. 'ఎన్నికల కోడ్ అడ్డంపెట్టుకుని రైతుబంధు కూడా వేయలేదు. వరి వేస్తే ఉరే అని పేద రైతులను బెదిరించారు. కానీ వారి ఫామ్‌హౌస్‌లో మాత్రం వరి పండించి అమ్ముకున్నారు. కావేరి కంపెనీకి క్వింటా రూ. 4,500లకు అమ్ముకున్నారు' అని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చామని తెలిపారు. రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చామంటూ బీఆర్ఎస్ గొప్పలు చెబుతున్నారని విమర్శించారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్ అన్నారు. కాంగ్రెస్ అంటేనే కరెంట్ అని తెలిపారు. అసలు బీఆర్ఎస్‌కు ఉచిత కరెంట్‌తో ఎలాంటి సంబంధమూ లేదని ఎద్దేవా చేశారు.

తాము రైతుల ఉచిత కరెంట్ కోసం రూ.33వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. తెలంగాణ ఏర్పడినప్పుడు రాష్ట్ర అప్పు రూ.72వేల కోట్లు. కార్పొరేషన్ అప్పులు కూడా కలిపితే రూ.90 వేల కోట్లు. ఈ పదేండ్లలో బీఆర్ఎస్ అప్పులే రూ.3.50లక్షల కోట్లు దాటింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి అప్పు రూ.6.69 లక్షల కోట్లు. ఇతర బకాయిలతో కలిపి రూ.7.05 లక్షల కోట్లు. పెండింగ్ బిల్లులే రూ.40వేల కోట్లు ఉన్నాయి. మేం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో రూ.1.58లక్షల కోట్ల అప్పు చేశాం. కొత్తగా చేసిన అప్పులో వేల కోట్లు పాత అప్పులకే చెల్లించాం. కాళేశ్వరంపై రూ.70,490 కోట్లు అప్పు చేశాం. కూలిపోయిన ఆ ప్రాజెక్టుకు రూ.5వేల కోట్లకు పైగా చెల్లించాం. గత సీఎం డాక్టర్, ఇంజనీర్, డిజైనర్ తానేనంటూ కాళేశ్వరం కట్టారు. ఇంజనీర్లు చెప్పినా వినకుండా.. మేడిగడ్డ దగ్గర ప్రాజెక్ట్ కట్టారు. ఏడో వింత అంటే మూడేండ్లకే అది పనికిరాకుండా పోయింది. ఇప్పుడు నీళ్లు నిలిపితే కూలుతుందని నిపుణులు చెబుతున్నారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టుల వల్లే.. తెలంగాణలో వరి దిగుబడి పెరిగింది'అని ఈ సందర్భంగా సీఎం వివరించారు. రాష్ట్ర అప్పులకు, మిత్తిలు చెల్లించేందుకే మళ్లీ అప్పు తేవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు, తప్పులకు రాష్ట్రం శిక్ష అనుభవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్లలో ఆ ప్రభుత్వం చేయలేని పనులను 10 నెలల్లోనే తాము చేస్తే ఓర్వలేక కండ్లలో నిప్పులు పోసుకుంటున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

హైడ్రా పంజా

- బడంగ్‌పేటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత.. ఉద్రిక్తత
- అల్మాస్‌గూడ బోయపల్లి కాలనీకి రోడ్లు, పార్క్ స్థలం ఏర్పాటు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో మరోసారి హైడ్రా అధికారులు పంజా విసిరారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ 4వ డివిజన్ పరిధిలోని ఉన్న బోయపల్లి ఎంక్లేవ్ కాలనీలో అక్రమ నిర్మాణాలను గురువారం హైడ్రా అధికారులు కూల్చేశారు. హైడ్రా అధికారి తిరుమల్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమ నిర్మాణాలపై కాలనీ వాసులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దాంతో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సరస్వతి సహకారంతో హైడ్రా అధికారి తిరుమల్ 45మంది సిబ్బందితో గురువారం ఉదయం బోయపల్లి ఎంక్లేవ్ కాలనీకి చేరుకున్నారు. 2008, 09లో కొంత, 2014 సంవత్సరంలో సర్వే నెంబర్ 39, 40, 41, 42, 44లోని 5.7 గుంటల భూమిలో పాత గ్రామ పంచాయితీ లే అవుట్ మేరకు భూ యజమానులు ప్లాట్లు చేసి విక్రయించారు. అయితే, ఇప్పుడు అది వ్యవసాయ భూమి అని, దానికి పాసు పుస్తకాలు ఉన్నాయని భూ యజమానులు చెబుతున్నారు. లేఔట్ చేసి, సగం అమ్మాక.. ఇప్పుడు పాస్ పుస్తకాలు ఉన్నాయని ఎలా చెబుతారని హైడ్రా అధికారి భూయజమానులను ప్రశ్నించారు. వ్యవసాయ భూమి అంటూ రైతుబంధు తీసుకుంటున్నామని, ఉచిత కరెంటు వస్తోందని భూ యజమాని చెప్పారు. అలా అయితే, కమర్షియల్ స్టేడియం నిర్మాణం ఎలా చేపడుతున్నారని హైడ్రా అధికారి తిరుమల్ వారిని ప్రశ్నించారు. లేఔట్ ప్రకారం భూమి యజమానులే కాలనీ వాసులకు మూడు రోడ్ల సౌకర్యం, పార్క్ స్థలం కల్పించాలని కోరినప్పటికి నిర్లక్ష్యం చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న అధికారి అవి అక్రమ నిర్మాణాలేనని నిర్ధారణకు వచ్చారు. ఈ క్రమంలో హైడ్రా అధికారులు వాటిని కూల్చేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కబ్జాదారులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. కూల్చివేతలు జరగకుండా అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అధికార, ప్రతిపక్ష పార్టీల ముఖ్య నేతలకు ఫోన్ చేసి, ఆపేయించాలని ప్రయత్నించారు. అన్నీ పరిశీలించిన అనంతరం మున్సిపల్, ఇతర అధికారులతో మాట్లాడిన తర్వాతే హైడ్రా రంగంలోకి దిగిందన్న సమాచారంతో ఆయా పార్టీల ముఖ్య నేతలు చేతులెత్తేసినట్టు తెలిసింది. కాలనీలో రహదారులకు అడ్డంగా నిర్మించిన ప్రహరీలను అధికారులు తొలగించారు.

అధికారులకు సమాచారం ఇచ్చే కూల్చేశాం : తిరుమల్


అక్రమ నిర్మాణాలను కూల్చేసి కాలనీ వాసులకు లే అవుట్ ప్రకారం రోడ్లు, పార్కు స్థలాలను గుర్తించి అందులో బోర్డు ఏర్పాటు చేసినట్టు హైడ్రా అధికారి తిరుమల్ తెలిపారు. తాము అక్రమ నిర్మాణాలను కూల్చేసే ముందు మున్సిపల్, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి రాకపోవటంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. కూల్చివేతల సమయంలో అడ్డుగా వచ్చిన భూ యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీఎం రేవంత్ రెడ్డి, హైడ్రా అధికారి చిత్ర పటానికి పాలాభిషేకం

తమ కాలనీ సమస్యలను హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు విన్నవించగానే చర్యలు తీసుకోవడంతో తమకు న్యాయం జరిగిందని కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. కాలనీకి భూ యజమానులు అడ్డంగా నిర్మించిన గోడలను కూల్చివేసి తమకు రోడ్లు, పార్కు స్థలం ఏర్పాటు చేసినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మున్సిపల్ కమిషనర్ సరస్వతికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

వేసవి సెలవుల్లో టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని నూతన ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం అసెంబ్లీలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ పాఠశాలలతోసహా మోడల్ స్కూళ్లు, గురుకుల ఉపాధ్యాయులందరికీ మేలో బదిలీలు, పదోన్నతులు కల్పించాలని కోరారు. పాఠశాల పనిదినాలకు ఇబ్బంది కలగకుండా, విద్యార్థులకు నష్టం జరగకుండా షెడ్యూల్‌ను రూపొందించి వేసవి సెలవుల్లోనే నిర్వహించాలని సూచించారు. తగు చర్యలు తీసుకోవాలంటూ సీఎంవో కార్యదర్శి మాణిక్‌రాజ్‌ను రేవంత్‌రెడ్డి ఆదేశించారని తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేయాలనీ, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57/4, 57/5 అమలు చేసి 2003 కంటే ముందు నియామకం అయిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను వర్తింపజేయాలని సూచించారు. ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డులు, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు మినిమం టైంస్కేల్, గురుకుల పాఠశాలల సమయపాలనను మార్చాలని తెలిపారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలను చెల్లించాలని పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి త్వరలోనే సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులకు టైంస్కేల్ ఇవ్వాలి

- మండలిలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు మినిమం టైం స్కేల్‌ను ఇవ్వాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. శాసనమండలిలో గురువారం ప్రత్యేక ప్రస్తావన కింద ఆయన మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక సమానత్వానికి కట్టుబడి ఉన్నామంటూ ప్రభుత్వం చెప్తున్నదని గుర్తు చేశారు. వర్సిటీల్లో ఏండ్ల తరబడి కాంట్రాక్టు పద్ధతిలో అధ్యాపకులు పనిచేస్తున్నారని వివరించారు. రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల వేతనానికి, వారి వేతనానికి ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. వారికి మినిమం టైంస్కేల్‌ను ఇవ్వాలనీ, జీతాలను పెంచాలని కోరారు. కేజీబీవీ టీచర్లు, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులున్నారనీ, వారికి కనీస వేతనం చెల్లించాలని సూచించారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అప్పటి వరకు మినిమం టైంస్కేల్‌ను వర్తింపజేయాలని సూచించారు. కాంగ్రెస్ సభ్యులు టి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ గడువును పొడిగించాలని బీఆర్ఎస్ సభ్యులు తక్కళ్లపల్లి రవీందర్‌రావు కోరారు. బీఆర్ఎస్ సభ్యులు చల్లా వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని సూచించారు. చిన్నోంపల్లి రిజర్వాయర్, నెట్టెంపాడు ప్రాజెక్టులను ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాకు నిధులు కేటాయించి పనులు చేపట్టాలని చెప్పారు. తెలంగాణ ఉద్యోగులు ఏపీలో పనిచేస్తున్నారనీ, వారిని సొంత రాష్ట్రానికి తేవాలని టీజేఎస్ సభ్యులు కోదండరామ్ సూచించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) గేటు వద్ద సిరిపురం యాదయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అన్నారు. తెలంగాణ ఉద్యమ కారులు, అమ రవీరుల కుటుంబాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలో కలపాలని శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాశ్ కోరారు. పసిపిల్లలను అమ్ముతున్న ముఠాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు డిమాండ్ చేశారు.

317 జీవో బాధితుల సమస్యలను పరిష్కరించాలి : తీన్మార్ మల్లన్న



రాష్ట్రంలో 317 జీవో బాధిత ఉద్యోగుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రభుత్వాన్ని కోరారు. శాసనమండలిలో గురువారం ఈ అంశంపై ఆయన పిటిషన్ ఇచ్చారు. పరస్పర బదిలీలు వ్యాపారంగా మారిందన్నారు. బీఆర్ఎస్ సభ్యులు చల్లా వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ సేవలను తెలంగాణ సరిహద్దు ప్రాంతాల ప్రజల కోసం కర్నూల్, విజయవాడలోనూ అందుబాటులోకి తేవాలని కోరారు. బీఆర్ఎస్ సభ్యులు తక్కళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు 12 విడతల్లో చెల్లిస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు. ఆయన మాటలపై నమ్మకం లేదనీ, తప్పకుండా అమలయ్యేలా చూడాలని అన్నారు. మధ్యాహ్న భోజనం కార్మికులకు ఎనిమిది నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని చెల్లించాలని బీఆర్ఎస్ సభ్యులు నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు.

అప్పుల్లో తెలంగాణ రైజింగ్

- బీఆర్ఎస్ మొదటి ముద్దాయి...కాంగ్రెస్ రెండో ముద్దాయి
- హామీలను ఎగ్గొట్టే కుట్ర : బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అప్పుల్లో తెలంగాణ రైజింగ్‌గా ఉందని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ మొదటి ముద్దాయి, కాంగ్రెస్ రెండో ముద్దాయి అని ఆరోపించారు. అప్పులు తీర్చేందుకు మళ్లీ అప్పులు చేయాల్సిన దుస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. గురువారం శాసనసభలో ద్రవ్యవినిమయ బిల్లుపై ఆయన మాట్లాడారు. "రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి అప్పుల అప్పారావులా, రొటేషన్ చక్రవర్తిలా ఉంది. 15 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం 1.63 లక్షల కోట్ల అప్పు చేసింది. గత ప్రభుత్వ దారిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తున్నది' అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలకు మంగళం పాడేలా ఉందని ప్రజల్లో చర్చ నడుస్తోందన్నారు. ప్రభుత్వ భూములు తనఖా పెట్టి 10వేల కోట్లు తీసుకుని రైతు భరోసాకు వెచ్చించకపోవడం బాధాకరమన్నారు. కాంట్రాక్టర్లకు, పంచాయతీ సర్పంచ్ లకు ఎన్ని బిల్లులు ఇచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్ పై నిర్ణయం తీసుకున్నప్పుడు చర్చిద్దామనీ, ఇప్పటి వరకు కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు.





సీపీఐ(ఎం) ప్రస్థానం

అరుణారుణ చేతనం

16వ మహాసభ

అక్టోబర్ 5-11, 1998 కలకత్తా, పశ్చిమబెంగాల్

1998లో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ 16వ మహాసభ జరిగింది. బీజేపీ వెనుక మతతత్వ ఫాసిస్ట్ ఆర్ఎస్ఎస్ ఉందని పార్టీ గుర్తించింది. ఇది దేశంపై ఒక మత రాజ్యాన్ని రుద్దాలని కోరు కుంది. రాజ్య సంస్థలపై నియం త్రణ సాధించడానికి ఆరెఎస్ఎస్ తీసుకున్న చర్యలు, దేశవ్యాప్తంగా మైనారిటీలపై దాడులు, భారతదేశ సాంప్రదాయిక అలీన విధానాన్ని కూల్చివేసి అణ్వస్త్ర యుద్ధాన్ని ఆశ్రయించడం వంటి వాటిని మహాసభ చర్చించింది.

1996 ఎన్నికల తర్వాత యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ ఏర్పాటు చుట్టూ ఉన్న రాజకీయ పరిణామాలను మహాసభ విశ్లేషించింది. పెరుగుతున్న ప్రజా అసంతృప్తిని ప్రజాస్వామ్య మార్గాల్లోకి సమీకరించడానికి దాని స్వతంత్ర కార్యకలాపాలను వేగవంతం చేయాలని నిర్ణయించింది. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి బయటి నుండి మద్దతు ఇచ్చింది. ప్రభుత్వాలలో, ముఖ్యంగా కేంద్రంలో భాగస్వామ్యం గురించి మహాసభ చర్చించింది. ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయడానికి వామపక్షాలకు తగినంత బలం లేని పరిస్థితిలో భాగస్వామ్యానికి వ్యతిరేకంగా వైఖరిని ఆమోదించింది. కాంగ్రెస్(ఐ),బీజేపీలకు వ్యతిరేకంగా మూడవ ప్రత్యామ్నాయ అవసరాన్ని 16వ మహాసభ నొక్కి చెప్పింది.

67 మందితో కేంద్ర కమిటీని, 13 మందితో పొలిట్ బ్యూరోను మహాసభ ఎన్నుకుంది. కామ్రేడ్ హరికిషన్ సింగ్ సుర్జీత్ ను వరుసగా మూడోసారి ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది.

పొలిట్ బ్యూరో

హరికిషన్ సింగ్ సుర్జీత్
జ్యోతి బసు
ఇ బాలనందన్
జెనోయ్ కృష్ణ చౌదరి
వి.ఎస్. అచ్యుతానందన్
ప్రకాష్ కారత్
సీతారాం ఏచూరి
ఎస్ రామచంద్రన్ పిళ్లై
పి.రామచంద్రన్
సైలెన్ దాస్‌గుప్తా
ఇ.కె.నాయనార్
ఆర్.ఉమానాథ్
ఎం.హనుమంత రావు

22వ మహాసభ

ఏప్రిల్ 18 - 22, 2018 హైదరాబాద్, తెలంగాణ

అప్పటికి గడిచిన నాలుగేండ్ల బీజేపీ పాలనను దృష్టిలో పెట్టుకుంటే బీజేపీని ఓడించటమే పార్టీ కీలక కర్తవ్యంగా ఉంటుంది. దాని ఆర్థిక విధానాలను తిప్పి కొట్టకపోతే ప్రజలపై సాగే దాడులు ఆగవు. అన్ని సెక్యులర్, ప్రజాతంత్ర పార్టీలను ఐక్యం చేయకుంటే బీజేపీని నిలువరించలేమని రాజకీయ తీర్మానం ఆమోదించింది.

పొలిట్ బ్యూరో

సీతారాం ఏచూరి	ఎం.ఎ.బేబీ
ప్రకాష్ కారత్	సూర్య కాంత మిశ్రా
ఎస్ రామచంద్రన్ పిళ్లై	మొహమ్మద్ సలీం
బిమన్ బసు	సుభాషిణి అలీ
మాణిక్ సర్కార్	బి.వి.రాఘవులు
బృందా కారత్	జి. రామకృష్ణన్
పినరయి విజయన్	తపన్ సేన్
హన్నన్ మొల్లా	నీలోత్పల్ బసు
కొడియేరి బాలకృష్ణన్	

17వ మహాసభ

మార్చి 19-24, 2002 హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్

17వ పార్టీ కాంగ్రెస్ సెప్టెంబర్ 11, 2001 దాడులు, 'ఉగ్రవాదంపై ప్రపంచ యుద్ధం'లో భాగంగా ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దాడి తర్వాత జరిగింది. బీజేపీ ప్రభుత్వం అమెరికాతో అంటకాగుతోంది. ఈ కాలంలో మైనారిటీలపై దాడులు తీవ్రం అయ్యాయి. ముఖ్యంగా గుజరాత్ లో అధికారాన్ని అడ్డం పెట్టుకొని గుజరాత్ అల్లర్లులకు వారు తెగ బడ్డారు. బీజేపీ సహాయంతో ఆర్ఎస్ఎస్ అన్ని రంగాలలో రాజ్య యంత్రాంగం లోకి చొచ్చుకుపోయింది. బీజేపీ ప్రభుత్వం విదేశీ పెట్టుబడుల కోసం ద్వారాలు తెరిచింది. ఇది కార్మిక వర్గంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఈ విధానాలు దళితులు,ఆదివాసీల దుస్థితి మరింత దిగజారిందని మహాసభ చర్చించింది. లౌకిక, ప్రజాస్వామ్య శక్తులన్నీ బీజేపీ-ఆర్ఎస్ఎస్ కూటమిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని నిర్ణయించింది. బిజెపియేతర, కాంగ్రెసేతర శక్తులతో కూడిన పీపుల్స్ ఫ్రంట్ ఏర్పాటుకు మహాసభ ఆమోదం తెలిపింది. బీజేపీ నేతత్వంలోని మతతత్వ కూటమిని ఓడించడం, కేంద్రంలో లౌకిక ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించడం, లోక్‌సభలో వామపక్ష బలాన్ని పెంచడం వంటి మూడు కీలకమైన కర్తవ్యాలను అఖిలభారత మహాసభ నిర్దేశించింది. కాంగ్రెస్ 79 మంది సభ్యుల కేంద్ర కమిటీని ఎన్నుకుంది. కొత్త కేంద్ర కమిటీ కామ్రేడ్ హరికిషన్ సింగ్ సుర్జీత్‌ను ప్రధాన కార్యదర్శిగా 17 మంది సభ్యుల పొలిట్ బ్యూరోను తిరిగి ఎన్నుకుంది.

పొలిట్ బ్యూరో

హరికిషన్ సింగ్ సుర్జీత్	పి.రామచంద్రన్
జ్యోతి బసు	ఆర్.ఉమానాథ్
ఇ.బాలానందన్	ఎం.కె. పాండే
ఇ.కె.నాయనార్	బిమన్ బసు
వి.ఎస్. అచ్యుతానందన్	అనిల్ బిస్వాస్
ప్రకాష్ కారత్	మాణిక్ సర్కార్
ఎస్. రామచంద్రన్ పిళ్లై	పినరయి విజయన్
సీతారాం ఏచూరి	బుద్ధదేవ్ భట్టాచార్య

18వ మహాసభ

ఏప్రిల్ 06-11, 2005-ఢిల్లీ

మతతత్వ శక్తులను అధికారానికి దూరం చేయడంలో జాతీయ స్థాయిలో వామపక్ష పార్టీల కీలక పాత్ర పోషించాయి. బీజేపీ నేతత్వంలోని మతతత్వ కూటమిని ఓడించడం, కేంద్రంలో లౌకిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, లోక్‌సభలో వామపక్షాల బలాన్ని పెంచడం అనే 17వ మహాసభ నిర్దేశించిన మూడు లక్ష్యాలను పార్టీ సాధించింది. లోక్‌సభలో వామపక్షాల బలం ఘననీయంగా పెరిగింది. నయా ఉదారవాదాన్ని, బీజేపీ తిరిగి అధికారంలోకి రావడాన్ని వ్యతిరేకిస్తూ విధానాలను జాగ్రత్తగా ప్రభావితం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న సీపీఐ(ఎం) కాంగ్రెస్ నేతత్వంలోని యూపీఏ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకుంది. సీపీఐ(ఎం), వామపక్ష పార్టీలు యూపీఏ ప్రభుత్వ ఉమ్మడి కనీస కార్యక్రమానికి మద్దతు ఇచ్చినప్పటికీ, వివిధ రంగాలలో ప్రయివేటీకరణ, సార్వత్రిక ప్రజా పంపిణీ వ్యవస్థను అమలు చేయడానికి నిరాకరించడం వంటి అంశాలపై కాంగ్రెస్‌తో సీపీఐ(ఎం) విభేదించింది. జాతీయ స్థాయిలో వామపక్షాల బలపడిన తరువాతే కార్యరూపం దాల్చే మూడవ ప్రత్యామ్నాయాన్ని సాధించాలని పార్టీ మహాసభ పిలుపునిచ్చింది. పార్టీని వివిధ స్థాయిలలో ప్రభావితం చేసే వర్గ ధోరణులను ఎదుర్కోవడానికి దిద్దుబాటు కార్యక్రమాన్ని చేపట్టాలని పార్టీ మహాసభ నిర్ణయించింది.

85 మందితో కేంద్ర కమిటీని, 17 మందితో పొలిట్ బ్యూరోను మహాసభ ఎన్నుకుంది. కామ్రేడ్ ప్రకాష్ కారత్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

పొలిట్ బ్యూరో

ప్రకాష్ కారత్
హరికిషన్ సింగ్ సుర్జీత్
జ్యోతి బసు
వి.ఎస్. అచ్యుతానందన్
ఎస్. రామచంద్రన్ పిళ్లై
సీతారాం ఏచూరి
ఆర్.ఉమానాథ్
ఎం.కే. పాంథే
బిమన్ బసు
అనిల్ బిస్వాస్
మాణిక్ సర్కార్
పినరయి విజయన్
బుద్ధదేవ్ భట్టాచార్య
చిత్తబ్రత మజుందార్
కె. వరదరాజన్
బి.వి.రాఘవులు
బృందా కారత్

19వ మహాసభ

మార్చి29 - ఏప్రిల్ 02, 2008 కోయంబత్తూర్, తమిళనాడు

ఫాసిస్టు శక్తులను అధికారానికి దూరంగా వుంచాల్సిన గురుతర బాధ్యత దష్ట్యా యుపిఏ ప్రభుత్వానికి బయట నుంచి మద్దతు ఇచ్చింది. ఉదారవాద, ప్రపంచీకరణ పునాదులపై నిలచిన యుపిఏ ప్రభుత్వం ప్రజానుకూల నిర్ణయాలు తీసుకునేలా ఒత్తిడి తేగలిగింది. ఈ ప్రత్యామ్నాయ విధానాలను, కార్యక్రమాలు పునాదిగా తృతీయ ప్రత్యామ్నాయ ఆవశ్యకతను మహాసభ గుర్తించింది. దేశంలో ఫాసిజం బలపడే ప్రమాదాన్ని చాలా స్పష్టంగా మహాసభ గమనించింది. ప్రపంచీకరణ, నయా ఉదారవాద విధానాలను ప్రతిఘటించాలని, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగానూ, ప్రజానుకూల అభివద్ధి పంథా కోసం, లౌకిక ప్రజాసామ్య పరిరక్షణ కోసం ప్రజాతంత్ర, ప్రగతిశీల శక్తులకు మహాసభ పిలుపునిచ్చింది.

86 మందితో కేంద్ర కమిటీని, 17 మందితో పొలిట్ బ్యూరోను మహాసభ ఎన్నుకుంది. కామ్రేడ్ ప్రకాష్ కారత్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

పొలిట్ బ్యూరో

ప్రకాష్ కారత్ , వి.ఎస్. అచ్యుతానందన్
ఎస్. రామచంద్రన్ పిళ్లై,
సీతారాం ఏచూరి
ఎం.కె. పాండే, బిమన్ బసు,
మాణిక్ సర్కార్
పినరయి విజయన్,
బుద్ధదేవ్ భట్టాచార్య
కె.వరదరాజన్, బి.వి.రాఘవులు
బృందా కారత్, మొహమ్మద్ అమీన్
నిరుపమ్ సేన్,
కొడియేరి బాలకృష్ణన్

23వ మహాసభ

ఏప్రిల్ 06 - 10, 2022 కన్నూర్, కేరళ

బీజేపీ తన స్థానాన్ని పదిలపర్చుకోవడాన్ని మహాసభ గుర్తించింది. ఇది ఫాసిస్ట్ ఆర్ఎస్ఎస్ యొక్క రాజకీయ విభాగం. తన హిందూత్వ, మతోన్మాద ఎజెండాను ప్రజల్లోకి తీసుకుపోతోంది. అలాగే, నయాఉదారవాద విధానాలను అమలు చేస్తోంది. నియంతృత్వ ధోరణులు పెరుగుతున్నాయి. నిరంతర వర్గ, ప్రజా పోరాటాల ద్వారా మన స్వతంత్ర శక్తిని పెంపొందించుకోవాలని పార్టీ 23వ మహాసభ భావించింది.

పొలిట్ బ్యూరో

సీతారాం ఏచూరి	సుభాషిణి అలీ
ప్రకాష్ కారత్	బి.వి.రాఘవులు
పినరయి విజయన్	జి. రామకృష్ణన్
బృందా కారత్	తపన్ సేన్
మాణిక్ సర్కార్	నీలోత్పల్ బసు
కొడియేరి బాలకృష్ణన్	రామచంద్ర గోపురం
ఎం.ఎ బేబీ	ఎ విజయరాఘవన్
సూర్య కాంత మిశ్రా	అశోక్ ధావలే
మొహమ్మద్ సలీం	

21వ మహాసభ

ఏప్రిల్ 14 - 19, 2015 విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్

బీజేపీ, మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం అనేది ప్రధాన కర్తవ్యంగా రాజకీయ పంథాను నిర్దేశించింది. నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా, ప్రజల జీవనోపాధిని కాపాడుకోవడానికి సమగ్ర పోరాటం అవసరమని మహాసభ పిలుపునిచ్చింది. దీనిని మతతత్వానికి వ్యతిరేకంగా, బీజేపీ- ఆర్ఎస్ఎస్ కూటమికి వ్యతిరేకంగా రాజకీయ - సైద్ధాంతిక పోరాటాలు చేయాలని నిర్ధారించింది. పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకోవడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, స్థానిక సమస్యలపై నిరంతర పోరాటాల రూపకల్పన చేయాలని, నవ-ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను కొనసాగించాలని మహాసభ నిర్ధారించింది. సుదీర్ఘకాలం బూర్జువాపార్టీలతో పొత్తులు పార్టీ పునాదిని దెబ్బతీశాయని మహాసభ సమీక్షించింది.

91 మందితో కేంద్ర కమిటీని, 16 మందితో పొలిట్ బ్యూరోను మహాసభ ఎన్నుకుంది. కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.



పొలిట్ బ్యూరో

సీతారాం ఏచూరి	బి.వి.రాఘవులు	ఎ.కె.పద్మనాభన్
ప్రకాష్ కారత్	బృందా కారత్	హన్నన్ మొల్లా
ఎస్.రామచంద్రన్ పిళ్లై	కొడియేరి బాలకృష్ణన్	మహ్మద్ సలీం
బిమన్ బసు	ఎం.ఎ. బేబీ	సుభాషిణి అలీ
మాణిక్ సర్కార్	సూర్య కాంత మిశ్రా	జి.రామకృష్ణన్
పినరయి విజయన్		

27వ తేదీ ప్రచురితమైన సీపీఐ(ఎం) ప్రస్థానంలో 9వ మహాసభ తేదీని జూన్, 27-జులై 2, 1972గా చదువుకోగలరు. పదవ మహాసభలో పొలిట్‌బ్యూరోలో సుందరయ్య లేరు ఈ పొరపాట్లకు చింతిస్తున్నాము. - సంపాదకుడు

20వ మహాసభ

ఏప్రిల్ 4 - 9, 2012 కోజికోడ్, కేరళ

పార్టీ అనుసరించే రాజకీయ ఎత్తుగడల విషయంలో ఈ మహాసభ ముఖ్యమైన మార్పును చేసింది. గత మహాసభలలో తృతీయ ప్రత్యామ్నాయ నిర్మాణం గురించి నొక్కి చెప్పింది. అయితే ప్రస్తుత పరిస్థితులు అందుకు సానుకూలంగా లేనందున తృతీయ ప్రత్యామయ నిర్మాణం సాధ్యం కాదని 20వ మహాసభ భావించింది. ఇందులో ముఖ్య భాగస్వాములు కావాల్సిన లౌకిక ప్రతిపక్ష ప్రాంతీయ పార్టీలు విధానపరమైన కార్యక్రమం ప్రాతిపదికన కలిసి వచ్చే పరిస్థితి లేదని మహాసభ నిర్ధారణకు వచ్చింది. ప్రాంతీయ పార్టీల పట్ల అనుసరించాల్సిన వైఖరిని కూడా మహాసభ స్పష్టం చేసింది. ఈ పార్టీలతో నిరంతరం కలిసి పనిచేసే ఎన్నికల పొత్తుండకూడదని 2002మహాసభల నిర్ధారణలను కోజికోడ్ మహాసభ మరోసారి నొక్కి చెప్పింది.

బడా బూర్జువా వర్గానికి ప్రాతినిధ్యం వహించే ప్రాంతీయ పార్టీలకూ మధ్యనున్న వ్యత్యాసాన్ని విస్మరించకూడదని, ఈ అవగాహనతోనే లౌకిక ప్రతిపక్ష పార్టీల పట్ల పార్టీ వైఖరిని మహాసభ నిర్ణయించింది. వామపక్ష - ప్రజాతంత్ర శక్తులను బలపర్చుకోవడం, ప్రజా సమస్యలపై పార్లమెంటు లోపలా, బయటా కలిసొచ్చే లౌకిక పార్టీలతో కలిసి కృషి చేయాలని మహాసభ నిర్దేశించింది. పార్టీ ప్రజాపునాది బలపడాలని, దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలను నిర్మించడం తోపాటు, సైద్ధాంతిక బలాన్ని పెంచుకుకోవాలని 20వ మహాసభ పిలుపునిచ్చింది.

88 మందితో కేంద్ర కమిటీని, 15 మందితో పొలిట్ బ్యూరోను మహాసభ ఎన్నుకుంది. కామ్రేడ్ ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్ కారత్ ఎన్నికయ్యారు.

పొలిట్ బ్యూరో

ప్రకాష్ కారత్	బి.వి.రాఘవులు
సీతారాం ఏచూరి	బృందా కారత్
ఎస్. రామచంద్రన్ పిళ్లై	నిరుపమ్ సేన్
బిమన్ బసు	కొడియేరి బాలకృష్ణన్
మాణిక్ సర్కార్	ఎం.ఎ.బేబి
పినరయి విజయన్	సూర్యక్రాంత్ మిశ్రా
బుద్ధదేవ్ భట్టాచార్య	ఎ.కె.పద్మనాభన్
కె. వరదరాజన్	

విద్యార్థి దశ నుంచే వామపక్షవాదిని

- ఆరేండ్లు కొనసాగడం ఎంతో సంతోషం
- నాకు క్రమశిక్షణ నేర్పింది యూటీఎఫ్
- అసమానతల్లేని తరగతి గది కావాలి
- ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి
- నాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు : మండలిలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'నేను విద్యార్థి దశ నుంచే వామపక్ష వాదిని. నా కుటుంబ నేపథ్యం కూడా వామపక్ష భావజాలమే. మా నాన్న, పెద్దనాన్న నిరక్షరాస్యులు. కానీ తెలివైన వారు. రాష్ట్రంలోనే అత్యున్నత చట్టసభ అయిన శాసనమండలిలో స్వతంత్ర సభ్యునిగా ఆరేండ్లు కొనసాగడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ కాలంలో విద్యారంగం, ఉపాధ్యాయులు, ఉద్యోగుల సంక్షేమం, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను సభ దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. వాటి పరిష్కారం కోసం నా వంతు కృషి చేశాను. ఈ ఆరేండ్ల కాలంలో నాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.'అని వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి చెప్పారు. ఈనెల 29న ఆయన పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో శాసనమండలిలో గురువారం ఆరేండ్లపాటు వారి అనుభవాలను చెప్పాలంటూ చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అవకాశమిచ్చారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తాను ఆరేండ్లపాటు క్రమశిక్షణతో కొనసాగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ క్రమశిక్షణ తనకు యూటీఎఫ్ నేర్పించిందని వివరించారు. శాసనమండలి సభ్యునిగా ఆరేండ్లలో అనేక అంశాలు రాజకీయ పరిస్థితులు, సామాజిక, సాంస్కృతిక అంశాలను అర్థం చేసుకోగలిగానని చెప్పారు. ప్రజా సమస్యలను ప్రభుత్వానికి నివేదించగలిగానని అన్నారు. అసమానతల్లేని తరగతి గది కావాలనీ, సమానత్వం ఉండాలని ఆకాంక్షిస్తున్నానని వివరించారు. సమాజంలోని అన్ని వర్గాల పిల్లలు ఒకే దగ్గర చదివే వాతావరణం ఉండాలనీ, దాని గురించే తాను ఎక్కువగా ప్రస్తావించానని అన్నారు. అయితే శాసనమండలిలో ప్రయివేటు బిల్లు ప్రవేశపెట్టే అంశంపై తాను వెనుకబడిపోయాయని చెప్పారు. ప్రయివేట్ బిల్లు ప్రవేశపెట్టడానికి శాసనమండలి కార్యాలయ ఉద్యోగుల సహకారాన్ని కోరితే తర్వాత చూద్దాం అంటూ వాయిదా వేస్తూ వచ్చారనీ, తీరా ఆరేండ్ల సమయం గడిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న కార్పొరేట్ రాజకీయ పరిస్థితుల్లో స్వతంత్ర సభ్యునిగా పోటీ చేసి గెలిచానని అన్నారు. తాను ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించి యూటీఎఫ్‌లో మండల, జిల్లా, రాష్ట్ర బాధ్యునిగా పనిచేశానని గుర్తు చేశారు. 2018 మార్చిలో ఉపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ పొందాననీ, 2019, మార్చిలో ఎమ్మెల్సీగా గెలిచానని అన్నారు. ఈ ఆరేండ్ల కాలంలో శాసనమండలిలో అనేక విషయాలపై మాట్లాడేందుకు అవకాశం కల్పించి తనకు సహకరించిన చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు. తన కోరికను మన్నించి విద్యారంగంపై ప్రత్యేకంగా చర్చించడం సంతోషకరమని అన్నారు. కొత్తగా ఎన్నికైన శాసనమండలి సభ్యులకు శిక్షణా తరగతులను నిర్వహించాలని కోరారు. రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలున్నా రాష్ట్రాభివృద్ధి కోసమేనని చెప్పారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని కోరారు. విద్యారంగానికి నిధుల కేటాయింపును పెంచాలని చెప్పారు.



400 ఎకరాల వేలం ప్రక్రియను ఉపసంహరించుకోవాలి

సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్థిక వనరుల సమీకరణ పేరిట తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలికసదుపాయాల సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయదలచిన రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమి వేలం ప్రక్రియను ఉపసంహరించుకోవాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. "ప్రభుత్వ భూములను అమ్మితే భవిష్యత్తులో ప్రజల అవసరం కోసం ఏదైనా నిర్మించాలన్నా, ప్రభుత్వాస్పత్రులుగానీ, విద్యాలయాలు కానీ, చివరకు చచ్చిపోతే శ్మశానాలకు కూడా భూమిదొరకదు.భవిష్యత్తు తరాలను, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ భూముల అమ్మకాన్ని వ్యతిరేకిస్తాను" అని పీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి అన్న మాటలను గుర్తుచేశారు. మష్రూమ్ రాక్‌తో ఉన్న ఆ 400 ఎకరాల భూమి 734 వృక్ష జాతులు, 220 పక్షి జాతులతో సహా నెమళ్లు, వలస పక్షులు, మచ్చల జింకలు, నాలుగు కొమ్ముల జింకలు, అడవి పందులు, కొండ చిలువలు, భారతీయ నక్షత్ర తాబేళ్ల వంటి వైవిధ్యభరితమైన జీవజాతులకు నిలయమని పేర్కొన్నారు. ఆ భూమి కాంక్రీట్ నిర్మాణాలతో నింపేస్తే పర్యావరణం దెబ్బతింటుందని హెచ్చరించారు. నక్షత్ర తాబేళ్లు 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్టం కిందకు వస్తాయనీ, వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ 400 ఎకరాలతో పాటు దాన్ని ఆనుకుని ఉన్న మరో 800 ఎకరాల భూమిని కలిపి జాతీయ ఉద్యానవనంగా ప్రకటించే ఆలోచన చేయాలని సూచించారు. ఒకప్పుడు కొండలు, పచ్చదనంతో ఉండే జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ కాంక్రీట్ జంగిల్‌గా మారాయని ప్రస్తావించారు. ఆ భూమికి పక్కనే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులకు, పర్యావరణ ప్రేమికులకు నష్టదాయకమని పేర్కొన్నారు.

284 మంది.. రూ.98 లక్షల కోట్ల సంపద

- పెరుగుతున్న భారత కుబేరులు
- కొత్తగా 45 మంది సంపన్నుల చేరిక
- ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఎలన్ మస్క్
- టాప్-10లో చోటు కోల్పోయిన ముకేశ్ అంబానీ
- భారీగా పెరిగిన అదానీ సంపద
- హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ 2025 నివేదిక వెల్లడి



ముంబయి : దేశంలోని అధిక ధరలకు తోడు ఆదాయాలు లేక పేదలు, సామాన్యుల సంపద హరించుకుపోతుంటే.. మరోవైపు కుబేరులు, వారి సంపద మాత్రం అమాంతం పెరుగుతోంది. కేవలం 284 మంది సంపన్నుల వద్ద రూ.98 లక్షల కోట్ల సంపద పోగు పడిందని హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ 2025 నివేదిక వెల్లడించింది. ఇది భారత జీడీపీలో దాదాపు మూడింట ఒక వంతు. అంతేకాకుండా సౌదీ అరేబియా మొత్తం జీడీపీ కంటే ఎక్కువ కావడం గమనార్హం. హురున్ గ్లోబల్ గురువారం విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం.. గతేడాదితో పోల్చితే భారత్‌లో కొత్తగా 45 మంది సంపన్నులు పెరిగి 284కు చేరారు. ఒక్క ముంబయి నుంచే అత్యధికంగా 90 మంది బిలియనీర్లు ఉన్నారు. కాగా.. ముకేశ్ అంబానీ గ్లోబల్ టాప్-10లో స్థానాన్ని కోల్పోయారు. గతేడాది అప్పులు పెరగడంతో ఆయన సంపద రూ.లక్ష కోట్లు తగ్గింది. అయినప్పటికీ ఆసియాలోనే అత్యంత సంపన్నుడి హోదాలో ఉన్నారు. మరోవైపు గౌతం అదానీ సంపద 13 శాతం లేదా రూ.1 లక్ష కోట్లు పెరిగింది. దీంతో దేశంలో అత్యధిక సంపదను పోగు చేసుకున్న వ్యక్తిగా అదానీ నిలిచారు.

ప్రపంచ జాబితాలో టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ సంపద 82శాతం పెరిగి 420 బిలియన్ డాలర్లకు చేరడంతో ఆయన అగ్రస్థానంలో ఉన్నారు. అమెజాన్ అధిపతి జెఫ్‌బెజోస్ 266 బిలియన్ డాలర్లతో రెండో స్థానంలో నిలిచారు. మెటా సీఈఓ జుకర్‌బర్గ్ 242 బిలియన్ డాలర్లతో మూడో స్థానంలో ఉన్నారు. ఆ తర్వాత ఒరాకిల్ సీఈఓ లారీ ఎల్లిసన్, ఇన్వెస్టర్ వారెన్ బఫెట్, గూగుల్ సహ వ్యవస్థాపకుడు లారీ పేజ్ ఉన్నారు.

భారత్‌లో ముకేశ్ అంబానీ కుటుంబ సంపద 13 శాతం తగ్గినప్పటికీ రూ.8.6 లక్షల కోట్లుగా ఉంది. గౌతమ్ అదానీ కుటుంబం సంపద 13 శాతం పెరిగి రూ.8.4 లక్షల కోట్లకు చేరింది. ఆ తర్వాత స్థానాల్లో రోష్ని నాడార్ కుటుంబం (రూ.3.5లక్షల కోట్లు), దిలీప్ సంఘ్వీ కుటుంబం (రూ.2.5 లక్షల కోట్లు), అజీమ్ ప్రేమ్‌జీ కుటుంబం (రూ.2.2 లక్షల కోట్లు), కుమార మంగళం బిర్లా కుటుంబం (రూ.2.0లక్షల కోట్లు), సైరస్ పూనావాలా కుటుంబం (రూ.2.0లక్షల కోట్లు), నీరజ్ బజాజ్ ఫ్యామిలీ (రూ.1.6 లక్షల కోట్లు), రవి జైపురియా కుటుంబం (రూ.1.4 లక్షల కోట్లు), రాధా కిషన్ దమానీ కుటుంబం (రూ.1.4లక్షల కోట్లు)తో టాప్‌లో ఉన్నారు.

ఒకే ఒక మహిళ.. రోష్నీ నాడార్..

హెచ్‌సీఎల్ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్ రూ.3.5 లక్షల కోట్ల సంపదతో మూడో స్థానంలో నిలిచారు. తండ్రి శివ్‌నాడార్ నుంచి వారసత్వంగా హెచ్‌సిఎల్ సంస్థలో 47 శాతం వాటా బదిలీ కారణంగా ఆమె భారత టాప్-10 జాబితాలో చోటు దక్కించుకున్న ఒకే ఒక మహిళగా నిలిచారు. అదే విధంగా ప్రపంచంలోనే టాప్-10 సంపన్న మహిళల జాబితాలోనూ ఐదో స్థానంలో ఉన్నారు.

సంపాదకీయం

'వ్యంగ్యాన్నీ' వదలరా?



మన సామాజిక జీవితంలో వ్యంగ్యం అనేది ఓ స్ఫూర్తిదాయకమైన ఉపకరణం. వాక్ స్వాతంత్ర్యానికి ప్రతీకగా నిలిచే ఒక ప్రజాస్వామిక హక్కు..ఇది ప్రభుత్వాలు, పాలకుల తీరును విమర్శించడానికి ప్రజలకు అవకాశం కల్పించే శక్తివంతమైన సాధనం. ప్రత్యేకించి మన కళా సాహిత్య ప్రక్రియల్లో ఓ అద్భుతమైన వ్యక్తీకరణ. అందుకే అనాదిగా జన సామాన్యంలో వ్యంగ్యానికి ఎనలేని ఆదరణ. కానీ వర్తమానంలో మన రాజకీయ నాయకులు మాత్రం వ్యంగాన్ని తట్టుకోలేకపోతున్నారు. అందుకే కునాల్ క్రమాపై అసహనంతో బుసలు కొడుతున్నారు. ఈ దేశంలో భిన్నాభిప్రాయాలపై అణచివేతకు ఇదో తాజా ఉదాహరణ.

కునాల్ క్రమా, తన దైన శైలితో సమకాలీన రాజకీయాలను విమర్శించే ప్రఖ్యాత స్టాండ్-అప్ కమెడియన్. ముంబైలోని హ్యాబిటాట్ కామెడీక్లబ్‌లో ఇటీవల జరిగిన ఒక ప్రదర్శనలో ఈ స్టాండ్-అప్ కమెడియన్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ఆయన షిండేపై "గద్దార్" (ద్రోహి) అన్న పదాన్ని ఉపయోగించి, 2022లో జరిగిన రాజకీయ పరిణామాలపై సెటైర్ వేశారు. ఇది తీవ్రమైన వివాదానికి, ఏలినవారి అసహనానానికీ దారితీయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. క్రమా వ్యాఖ్యలు ప్రధానంగా ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలోని శివసేన విభజనను ప్రస్తావించాయి. 2022లో షిండే శివసేనను చీల్చి బీజేపీతో జతకట్టి మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఈ రాజకీయ పరిణామాన్ని వివరిస్తూ క్రమా చేసిన కామెడీ సెటైర్ షిండే అనుచరులకు ఆగ్రహానికి కారణమైంది. అరాచకం మొదలైంది. ప్రదర్శనా వేదికైన హ్యాబిటాట్ క్లబ్‌పై దాడులకు పూనుకున్నారు. క్రమాపై తీవ్రమైన బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఓ భయోత్పాతాన్ని సృష్టిస్తున్నారు. క్రమా వ్యాఖ్యలు వారికి అభ్యంతకరమైతే ఖండించవచ్చు. నిరసన తెలుపొచ్చు. తిరిగి విమర్శలు చేయొచ్చు. ఆ వ్యాఖ్యలను ఓ రాజకీయ అభిప్రాయంగానే చూడాలి గానీ... ఇలా విధ్వంసాలకు దిగజారడం సమంజసమా? కేవలం వ్యాఖ్యలకే భయపడి, ఓ కామెడీ క్లబ్‌పై దాడికి పూనుకోవడం, వ్యాపార సంస్థలపై ప్రతీకారానికి పాల్పడటం, ప్రాణహాని బెదిరింపులకు దిగడం ప్రజాస్వామ్య విలువలను ప్రశ్నించే చర్యలు.

వ్యంగ్యం, హాస్యం ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛాయుతమైన భావప్రకటనా సాధనాలు. పొలిటికల్ సెటైర్ అనేది ప్రపంచ వ్యాప్తంగా ఓ కళాత్మకమైన అభివ్యక్తిలో విడదీయలేని భాగం. ప్రత్యేకించి కామెడీ షోల్లో సర్వసాధారణం. దీనికి రాజకీయ నాయకులేమీ అతీతులు కారు. అయితే, ఇందుకు భిన్నంగా భారతదేశంలో మాత్రం ఇది తరచూ రాజకీయ పార్టీల, నాయకుల ఆగ్రహానికి గురవుతోంది. ప్రస్తుత సందర్భం దానికి ఓ కొనసాగింపు. షిండే, అయన అనుచరుల తీరే కాదు, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తీరు కూడా ఇదే అభిప్రాయాన్ని కలిగిస్తోంది. కునాల్ క్రమా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేయడం వెనుక ఉద్దేశమేమిటి? ఇది పరోక్షంగా శివసేన అనుచరుల హింసాత్మక చర్యలను సమర్థించడమే కదా? ఇది చాలదన్నట్టు ఒకవైపు ముంబై పోలీసులు, భారతీయ న్యాయ సంహిత(బిఎన్ఎస్) ప్రకారం, సామాజిక విభేదాలను రెచ్చగొట్టడం, ప్రజా గందరగోళం కలిగించడం, పరువునష్టం వంటి అభియోగాలపై కామ్రాపై కేసులు నమోదు చేశారు. మరోవైపు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్(బిఎంసి) అధికారులు 'హాబిటాట్' వద్ద అక్రమ నిర్మాణాలను హఠాత్తుగా గుర్తించి వాటిని కూల్చివేశారు. ఓ స్టాండ్-అప్ కామెడియన్‌పై ఇంతటి రాజకీయ ఒత్తిడి పెంచడం, ఒక హాస్యనటుడిని ఇన్ని రాజకీయ సవాళ్లకు గురి చేయడం..ఇవన్నీ దేన్ని సూచిస్తున్నాయి? పెచ్చరిల్లుతున్న అసహనాన్నే కదా? అభిప్రాయాలపై అణచివేతనే కదా? ఈ వివాదంపై మీడియా సంస్థల మౌనం సైతం మీడియా స్వేచ్ఛపై ఉన్న ఒత్తిళ్లను బహిరంగంగా ఎత్తిచూపుతోంది.

ఇది చాలదన్నట్టు ఒకవైపు ముంబై పోలీసులు, భారతీయ న్యాయ సంహిత(బిఎన్ఎస్) ప్రకారం, సామాజిక విభేదాలను రెచ్చగొట్టడం, ప్రజా గందరగోళం కలిగించడం, పరువునష్టం వంటి అభియోగాలపై కామ్రాపై కేసులు నమోదు చేశారు. మరోవైపు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్(బిఎంసి) అధికారులు 'హాబిటాట్' వద్ద అక్రమ నిర్మాణాలను హఠాత్తుగా గుర్తించి వాటిని కూల్చివేశారు. ఓ స్టాండ్-అప్ కామెడియన్‌పై ఇంతటి రాజకీయ ఒత్తిడి పెంచడం, ఒక హాస్యనటుడిని ఇన్ని రాజకీయ సవాళ్లకు గురి చేయడం..ఇవన్నీ దేన్ని సూచిస్తున్నాయి? పెచ్చరిల్లుతున్న అసహనాన్నే కదా? అభిప్రాయాలపై అణచివేతనే కదా? ఈ వివాదంపై మీడియా సంస్థల మౌనం సైతం మీడియా స్వేచ్ఛపై ఉన్న ఒత్తిళ్లను బహిరంగంగా ఎత్తిచూపుతోంది.

ప్రజాస్వామ్యంలో విమర్శలు అత్యంత విలువైనవి. విమర్శను అణచి వేయచూడటం, భౌతిక దాడులకు తెగబడటం ఆ విలువలకు వ్యతిరేకమైనవి. ఒక నాయకుడిపై సెటైర్ వేసే హక్కు కూడా లేకపోతే, ఇక ఆ ప్రజాస్వామ్యంలో ఎలాంటి స్వేచ్ఛ ఉన్నట్టు? వ్యంగ్యాన్ని కూడా భరించలేని రాజకీయ నాయకులు ఆ ప్రజాస్వామ్యాన్ని ఎలా గౌరవిస్తున్నట్టు? క్రమా ఘటన కలిగించిన అలజడి నుంచి ఉత్పన్నమవుతున్న ప్రశ్నలివి. క్రమా ఉదంతం మనకు ఇచ్చే పాఠం ఏమిటంటే, అభిప్రాయాలను అణచివేయడం వలన ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనమవుతుంది. రాజకీయ నాయకులు ప్రజల నుంచి విమర్శలను స్వీకరించలేని స్థితికి చేరుకుంటే, అది నియంతృత్వానికి దారితీస్తుంది. కేవలం అధికారానికి వ్యతిరేకంగా మాట్లాడినందుకు కళాకారులను, రచయితలను, వ్యంగ్యకారులను భయపెట్టడమంటే అది రాజ్యాంగ స్ఫూర్తిని అవమానించడమే. ప్రజాస్వామ్య వ్యవస్థలో, నాయకులు ప్రజల నుండి ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఆ సహనం దేశంలో కొరవడుతోంది. విమర్శలను స్వీకరించగలిగే సంస్కృతి నశిస్తే, భారత రాజకీయాలు అసహనం, అణచివేతలమయం కావడానికి ఎంతో సమయం పట్టదు.

ఇప్పుడు హాస్యం
రసరాజు అయింది
అదీ పదహారణాల
నిఖార్సయిన
రాజకీయ వ్యంగ్యంతో
బుల్డోజర్‌లతో
అధికారపీఠం
దాడులెన్నయినా చేయవచ్చు..
శిథిలాల మధ్య నుంచే
చిరునవ్వుతో గడ్డిపూవు
నిటారుగా నిలబడుతున్నది
చర్యకు ప్రతిచర్య
ఉంటుదిగా...
అంటుంది పీఠం
కళాకారులదెప్పుడూ ప్రతిచర్యే
ఆ పీఠాలదే
ప్రతీకార చర్య.
కూసాలు కదులుతున్నాయని
పీఠాలకు వెన్నులో వణుకు

గుణశక్తి




సత్యం ఎప్పుడూ
స్వేచ్ఛగా హాయిగా
విహరిస్తుంది,
తలవంచదు.
విజృంభించడమే తరువాయిక
తుపాకిరాముళ్లు
వేషం గట్టాలి బహురూపులు
సంధించాలి వాలకాలు
కిష్కిందకాండలా
సత్యాహాస్యం ఎంతటి అద్భుతశక్తి!
అదే గుణశక్తి! అదే గణశక్తి!

(బొంబాయిలో కమెడియన్ కునాల్ కమ్రాపై జరిగిన దాడిని ఖండిస్తూ)

కె.శాంతారావు,
9959745723

భవానీ ప్రత్యక్షమై శివాజీకి ఖడ్గమివ్వడం- అబద్ధం!



డాక్టర్ దేవరాజు మహారాజు

కాళికాదేవి ఛత్రపతి శివాజీకి ఖడ్గం ప్రసాదిస్తున్న చిత్రపటం అందరూ చూసే ఉంటారు. కొందరు ఆ పటాన్ని తమ ఇండ్లలో కూడా పెట్టుకునే ఉంటారు. వాస్తవంలో ఎక్కడా లేని 'భవాని' శివాజీకి ప్రత్యక్షమైందా? మరి, ఆయనకు ఆ కత్తి ఎక్కడిదీ? దానికి సంబంధించిన చారిత్రక సత్యాలేమిటీ? తెలుసు కోవాలంటే, కొంచెం వివరాల్లోకి పోవాలి. మరి, భవానీ ప్రత్యక్షమైందన్న కల్పిత కథకు సృష్టికర్తలెవరూ? అందరూ తెలుసుకోవాల్సిందే! ఇంగిత జ్ఞానం ఉపయోగించి ఆలోచించాల్సిందే!!

భవానీ ప్రసాదించిందని చెప్పుకునే ఖడ్గానికి సంబంధించిన వాస్తవాలు ఇలా ఉన్నాయి -

1659లో కొంకణితీర ప్రాంతంలో పోర్చుగీసు వారి నౌక ఒకటి మునిగిపోయింది. శివాజీ సైన్యంలో ఒకడైన అంబాజీ సావంత్, మాళవజాతి సైనికుడు ఆనౌకను కొల్లగొట్టాడు. అప్పుడు నౌకలో అతనికి ఒక ఖడ్గం లభించింది. దాన్ని అతను భద్రపరుచుకున్నాడు. కొంతకాలం తర్వాత, అంబాజీ సావంత్ కొడుకు కృష్ణా సావంత్ పెద్దవాడయ్యాడు. ఆ ప్రాంతానికి ఒకసారి శివాజీ పర్యటనకు వచ్చినపుడు తన తండ్రి భద్రపరిచిన ఆ ఖడ్గాన్ని కృష్ణాజీ సావంత్, శివాజీకి చూపించాడు. శివాజీ ముచ్చట పడి అతనికి 300 హొన్నులిచ్చి తీసుకున్నాడు. శివాజీ ఖడ్గం గురించి మరొక వాదన కూడా ఉంది- పోర్చుగీస్ గవర్నర్ అల్ఫాన్సో అబ్బాకర్క్ 1510లో గోవాని స్వాధీనం చేసు కోవడానికి వచ్చాడు. అప్పుడు అతని సేనాని ఫెర్నాండిస్, శివాజీ సేనాని అంబాజీ సావంత్ చేతిలో ఓడిపోయాడు. అప్పుడు అంబాజీ సావంత్ పోర్చుగీసు వారి నుండి స్వాధీనం చేసుకున్నది అదే ఖడ్గమని చెపుతారు. ఏది ఏమైనా ఏ విధంగా ఎలా అందినా, శివాజీకి అందిన ఒక ఖడ్గం పోర్చుగీసు వారిదన్నది నిజం! కాళికాదేవి లేదా భవానీ ప్రత్యక్షమై శివాజీకి ఖడ్గం బహూకరించిందని చెప్పేది మనువాదులు కల్పించిన కట్టుకథ మాత్రమే అందులో నిజం ఎంత మాత్రమూ లేదు.

పోర్చుగీసు వారి నుండి తనకు అందిన పొడవాటి కత్తి అంటే శివాజీకి ఇష్టంగా ఉండేది. అలాంటి కత్తే తన సైనికుల కోసం తయారు చేయించాలని డచ్ వారిని, ఇంగ్లాండ్ వారిని, ఫ్రాన్స్ వంటి కొన్ని దేశాల వారినీ శివాజీ సంప్రదించాడు. అయితే ఆయా దేశాల వారెవరూ ముందుకు రాలేదు చివరకు స్పెయిన్ దేశం ముందుకొచ్చింది. వేలాది కత్తులు తయారు చేసి పంపింది. ఇతర దేశాల వారికి కాకుండా, కత్తులు తయారు చేసి ఇచ్చే అవకాశం తమకే ఇచ్చినందుకు స్పెయిన్ రాజు సంతోషపడి, మంచి పొడవూ, వెడల్పులతో నిటారుగా ఉండే ఒక ఖడ్గాన్ని ప్రత్యేకంగా తయారు చేయించి- శివాజీకి బహుమతిగా పంపించాడు. దానిలో పది వజ్రాలు, పది వైడూర్యాలు నలభై నాలుగు మరకతాలు పొదిగి తయారు చేసిన ఖడ్గం అది! ఈ రకంగా శివాజీ దగ్గర రెండు ప్రత్యేకమైన కత్తులుండేవని తెలు స్తోంది. ఇవి అలంకరణకు తప్ప, యుద్ధానికి పనికి వచ్చేవి కావు. శివాజీ కత్తులకు సంబంధించిన వాస్తవాలు ఇలా ఉంటే, హిందూ మనువాదుల కల్పిత కథలు వేరే విధంగా ఉన్నాయి.



ఈ దేశంలో మనువాదులు చేసిన ఘోరాలు ఎంత దుర్మార్గంగా ఉన్నాయంటే- బౌద్ధా రామాలన్నీ దేవాల యాలుగా మార్చుకున్నారు. బౌద్ధశిల్పాల్ని హిందూ దేవీదేవతల శిల్పాలుగా చలామణిలోకి తెచ్చుకుని, తమ జీవనా ధారం వెతుకున్నారు. పైగా బుదుణ్ణి విష్ణు అవతారంగా ప్రకటించారు. మనువాదుల పనులు ఇలాగే ఉంటాయనడానికి శివాజీ- శంభాజీలను కూడా ఉదాహరణగా చూపొచ్చు. వారిని కుట్ర పూరితంగా చంపించింది వారే. మళ్లీ వారి ఔన్నత్యాన్ని చాటి చెపుతూ, వారు తమ హిందూ మతోద్ధారకులని ప్రచారం చేసుకున్నదీ, ఇంకా చేసుకుంటున్నదీ వారే! హేతుబద్ధంగా ఆలోచించే వారికి విషయం అర్థమౌతుంది. సమాజంలో ఏది బలంగా ఉంటే, దాన్ని తమలో కలుపుకుని అది తమదే- అని గొప్పలు చెప్పుకోవడం - క్రమంగా దాన్ని నాశనం చేయడం- ఆ రకంగా లబ్ధి పొందడం మనువాదుల పద్ధతి.

ఇక తుల్జాకత్తి విషయానికి వద్దాం. 1875లో వేల్స్ రాకుమారుడు ఏడవ ఎడ్వర్డ్ భారత దేశానికి వచ్చినపుడు శివాజీ వంశానికి చెందిన కొల్హార్ సంస్థానాధీశుడు ప్రతాప్ సింగ్ భోంస్లే ఆయనకు తుల్జా కత్తిని బహూకరించాడు. ఈ దేశంలోని రాజ కుటుంబాలలో అత్యంత విలువైన వస్తువులు కొన్ని ఉండేవి. ఉదాహరణకు

షాజహాన్ నెమలి సింహాసనం,
కోహినూర్ వజ్రం
టిప్పూసుల్తాన్ కత్తి

అలాగే, ఆ జాబితాలో శివాజీ ఖడ్గం కూడా చెప్పుకోవాలి.

ప్రస్తుతం ఆ ఖడ్గం లండన్‌లోని ఆల్బర్ట్ మ్యూజియంలో ఉంది. ఆ మ్యూజియం నుండి - అదే విషయం గూర్చి అంబేద్కర్ బుద్ధసంఘం అధికారిక ధృవీకరణ పొందింది. శివాజీ ఖడ్గం మీద ఐహెచ్ఎస్ అనే ఇంగ్లీషు అక్షరాలు కనబడుతున్నాయి. ఆ అక్షరాలను బట్టి, అది స్పెయిన్‌లో తయారయ్యిందని పరిశోధకులు నిర్ధారించారు.

ఇంక భవానీ దేవెక్కడ? ప్రత్యక్షం కావడం ఎక్కడా? ఆలోచించుకునే బాధ్యత మనదే కదా?

ఆ తర్వాత చాలాకాలానికి, చిత్పవన్ వంశానికి చెందిన పీష్వాల వారసుడు బాల గంగాధర్ తిలక్. ఈయనా బ్రాహ్మణుడే. శివాజీ వ్యక్తిత్వాన్ని స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా ప్రచారం చేశాడు. 1894లో శివాజీ ఉత్సవాలు,ఆ తర్వాత వినాయక చవితి ఉత్సవాలు జరిపాడు.స్వాతంత్ర్య పోరాట సమయంలో శివాజీని ఒక హిందూ మతోద్ధారకుడిగా ప్రచారం చేశాడు. శివాజీకి భవానీ ప్రత్యక్షమై ఖడ్గం ప్రసాదించిందని కట్టు కథలు ప్రచారం చేశాడు. శివాజీ శౌర్యాన్ని, కష్టాన్ని బుగ్గిపాలు చేసి, అంతా ఆ భవానీ కృప అన్నట్లు - అబద్ధాలు పుట్టించింది తిలకే. శివాజీ వారసుల్లో ఒకడైన సాహూ మహారాజు తన సంస్థానంలో మొదటిసారి రిజర్వేషన్లు అమలు చేసిన విషయం మన మిక్కడ గుర్తుంచుకోవాలి. చాలాకాలం తర్వాత, జ్యోతిబాఫూలే శివాజీ సమాధిని వెతికించి, వెలికితీయించాడు. కావ్యాలు రాశాడు.

ఈ దేశంలో మనువాదులు చేసిన ఘోరాలు ఎంత దుర్మార్గంగా ఉన్నాయంటే- బౌద్ధా రామాలన్నీ దేవాల యాలుగా మార్చుకున్నారు. బౌద్ధశిల్పాల్ని హిందూ దేవీదేవతల శిల్పాలుగా చలామణిలోకి తెచ్చుకుని, తమ జీవనా ధారం వెతుకున్నారు. పైగా బుదుణ్ణి విష్ణు అవతారంగా ప్రకటించారు. మనువాదుల పనులు ఇలాగే ఉంటాయనడానికి శివాజీ- శంభాజీలను కూడా ఉదాహరణగా చూపొచ్చు. వారిని కుట్ర పూరితంగా చంపించింది వారే. మళ్లీ వారి ఔన్నత్యాన్ని చాటి చెపుతూ, వారు తమ హిందూ మతోద్ధారకులని ప్రచారం చేసుకున్నదీ, ఇంకా చేసుకుంటున్నదీ వారే! హేతుబద్ధంగా ఆలోచించే వారికి విషయం అర్థమౌతుంది. సమాజంలో ఏది బలంగా ఉంటే, దాన్ని తమలో కలుపుకుని అది తమదే- అని గొప్పలు చెప్పుకోవడం - క్రమంగా దాన్ని నాశనం చేయడం- ఆ రకంగా లబ్ధి పొందడం మనువాదుల పద్ధతి. బౌద్ధం స్వతంత్రంగా ఎదిగిన ఒక జీవన విధానమైతే, అది తమ వైదిక మతంలో ఒక భాగమని ప్రచారం చేసుకున్నారు. దేశ వ్యాప్తంగా వీటి ఆనవాళ్లు బయట పడుతూనే ఉన్నాయి.

దేశంలో ఉన్న ప్రాచీన హిందూ దేవాలయాలేవీ హిందూ దేవాలయాలుగా నిర్మించబడలేదు. అవన్నీ మార్చిన బౌద్ధారామాలో లేక జైన మందిరాలో అయి ఉంటాయని చరిత్ర పరిశోధకులు, వైజ్ఞానిక పరిశీలకులు రుజువు చేశారు. అదే పద్ధతిలో శివాజీ, శంభాజీలనే కాదు, వివేకానందుణ్ణి కూడా తమ హిందూ మతోద్ధారకుడిగా చెప్పు కున్నారు. వివేకానందుడు హేతుబద్ధంగా చెప్పిన విషయాలు, సంధించిన ప్రశ్నల జోలికి మాత్రంపోరు. ఎక్కడ ఏ మంచి కనిపించినా, దాన్ని తమలో కలుపుకోవడం మంచిదే. కాని, దాన్ని అలాగే కొనసాగనివ్వాలి కదా? తమ పైత్య మంతా వాటికి రుద్ది, వాటిని ధ్వంసం చేస్తే గాని వారికి తృప్తి కలగదు. ఈ దేశ చరిత్ర పొడవునా ఇవే అంశాలు పున రావృతమౌతున్నాయి. అసలు 'అఖండ భారత్' అనేది చరిత్రలో ఎక్కడా ఎప్పుడూ లేదు. దాన్ని పునరుద్ధరిస్తామని నేటి ఆరెస్సెస్ -బీజేపీలు చెప్పడం హాస్యాస్పదంగా తోస్తుంది. ఈ దేశం ఎదగక పోవడానికి బ్రాహ్మణిజమే పెద్ద అడ్డంకి. దాన్ని తొలగించుకుని, ఎంత త్వరగా బయటపడితే అంత మంచిది. విచారించవల్సిన విషయమేమంటే తమ స్వార్థ పూరిత వ్యక్తిగత ప్రయోజనాల కోసం బహుజన నాయకులే అధికారంలో ఉన్నవారికి భజన చేస్తూ తిరుగుతున్నారు.

దురలవాట్లున్న శంభాజీని గొప్ప హిందూరాజుగా, మొఘల్ పాలకుల్ని విలన్లుగా చూసే మనస్తత్వం నేటి మన పాలకులది. శివాజీదయినా, ఔరంగజేబుదయినా రాజులుగా తమ తమ రాజ్యాలు విస్తరించుకోవాలని చేసిన ప్రయత్నాలే తప్ప వారి మధ్య మత పరమైన విభేదాలూ, విద్వేషాలు, ఘర్షణలూ లేవు. ఎందుకంటే ఔరంగజేబును సమర్థించే హిందూ రాజులు ఉన్నారు. ఇక్కడ శివాజీ అంగరక్షకులుగా, సైన్యాధ్యక్షులుగా ముస్లింలున్నారు. అయినా- వందల ఏండ్ల నాటి విషయాల్ని అప్పటి విషయాలుగా మాత్రమే చూడాలి. అప్పటి విషయాల ఆధారంగా ఇప్పటి ముస్లింలను ద్వేషించమని చెప్పడం వివేకమనిపించుకోదు. అలాగే మనుస్మృతిలో శూద్రులను ఎలా శిక్షించాలో వివరంగా రాసి ఉందని సమకాలీనంలో ఉన్న మన బ్రాహ్మణ సోదరసోదరీమణులను ద్వేషించలేము కదా?

దురలవాట్లున్న శంభాజీని గొప్ప హిందూరాజుగా, మొఘల్ పాలకుల్ని విలన్లుగా చూసే మనస్తత్వం నేటి మన పాలకులది. శివాజీదయినా, ఔరంగజేబుదయినా రాజులుగా తమ తమ రాజ్యాలు విస్తరించుకోవాలని చేసిన ప్రయత్నాలే తప్ప వారి మధ్య మత పరమైన విభేదాలూ, విద్వేషాలు, ఘర్షణలూ లేవు. ఎందుకంటే ఔరంగజేబును సమర్థించే హిందూ రాజులు ఉన్నారు. ఇక్కడ శివాజీ అంగరక్షకులుగా, సైన్యాధ్యక్షులుగా ముస్లింలున్నారు. అయినా- వందల ఏండ్ల నాటి విషయాల్ని అప్పటి విషయాలుగా మాత్రమే చూడాలి. అప్పటి విషయాల ఆధారంగా ఇప్పటి ముస్లింలను ద్వేషించమని చెప్పడం వివేకమనిపించుకోదు. అలాగే మనుస్మృతిలో శూద్రులను ఎలా శిక్షించాలో వివరంగా రాసి ఉందని సమకాలీనంలో ఉన్న మన బ్రాహ్మణ సోదరసోదరీమణులను ద్వేషించలేము కదా? మానవ వాదులుగా మనమంతా మనుషులం గనక, మనుషులుగా, సమానులుగా ప్రవర్తించాలని, ఒకరి నొకరు గౌరవించు కోవాలని- పనులన్నీ 'మనిషి కేంద్రంగా' జరుపుకుంటూ ఉండాలని మాత్రం తప్పకుండా అంటాం!

ఛావా, కశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీ, పద్మావత్ వంటి సినిమాలు తీసి, చరిత్రను వక్రీకరించి, సమకాలీనంలో దేశంలో ఉన్న ముస్లింలను హిందువులంతా ద్వేషిస్తూ ఉండాలని కోరుకుంటున్న అధికార పార్టీ కుట్రను సామాన్య ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. మరోవైపు దేశంలో కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ఆలోచించే జనాభా పెరుగుతోంది. మరీ ముఖ్యంగా దేశంలోని యువత, వైజ్ఞానిక దృక్పథం -మానవవాదం వైపు మొగ్గుచూపుతూ ఉంది. సినిమా అనగానే కల్పనలూ, అభూత కల్పనలుంటాయని వారికి తెలుసు. సినిమాహాలు ఎప్పటికీ క్లాసు రూం కాదు. మేధావులు హేతుబద్ధంగా చర్చించుకునే సెమినార్ హాలు కూడా కాదు. అయినా ఇలాంటి విషయాలు చదువుకున్న వారికీ, వివేచన గలవారికి మాత్రమే అర్థం అవుతాయి. కేవలం రాజకీయంగా మాత్రమే ఎదిగిన 'గౌరవ నీయులైన మూర్ఖు'లకు అర్థం కావుకదా? భారతీయత అంటే సమైక్యత, సంఘీభావం, సమానస్థాయి!- అంతేగానీ, నేటి పాలకులు ప్రోత్సహిస్తున్నట్లుగా ద్వేషం ఎన్నటికీ కాదు - సమైక్య భావనే భారతీయుల మూల సిద్ధాంతం!!

వ్యాసకర్త: త్రిపురనేని రామస్వామి జాతీయ పురస్కార తొలి గ్రహీత

భారత విద్యార్థులు అమెరికాకు భారమా? బలమా?



ఎం.వి.ఎస్.శర్మ

అమెరికాలో ఉన్నత చదువులు చదవాలనుకోవడం చాలామంది భారతీయ విద్యార్థుల కల. విద్యార్థుల తల్లిదండ్రులకూ అది కలే. దాన్ని నిజం చేసుకోడానికి పిల్లల్ని చిన్నప్పటి నుంచీ ఖర్చుకు వెనుకాడకుండా ఖరీదైన స్కూళ్లలో చేర్పిస్తారు. వారి దృష్టి చదువు నుండి పక్కకు మళ్లకుండా చూసుకుంటారు. అబ్బాయి లేదా అమ్మాయి అమెరికాలో చదవడానికి సీటు సంపాదించి, వీసా తెచ్చుకుని విమానం ఎక్కగానే హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంటారు.

మరి మన భారతీయ విద్యార్థుల పట్ల అమెరికన్ ప్రభుత్వ వైఖరి ఎలా ఉంది? ముఖ్యంగా ట్రంప్ రెండోసారి అధ్యక్షుడయ్యాక భారతీయులు, ఇతర ఆసియా దేశస్తులు అమెరికాకు గుదిబండగా తయారయ్యారంటూ ట్రంప్ ప్రకటిస్తున్నాడు. అమెరికాలో పనుల కోసం చట్టవిరుద్ధంగా ప్రవేశించినవారిని వెనక్కి పంపడం, అందునా, కాళ్లకు, చేతులకు సంకెళ్లు వేసి అత్యంత అవమానకరంగా వ్యవహరించడం, దాని పట్ల మోడీ ప్రభుత్వం నోరు మెదపలేని అశక్తతను ప్రదర్శించడం-ఇదంతా అందరికీ తెలిసినదే. అనుమతులు లేకుండా వెళ్లారు గనుక వెనక్కి వారిని తిప్పి పంపవద్దని మనం అనలేం. కనీస మానవత్వ విలువల్ని అయినా పాటించలేదని, అంతర్జాతీయ మర్యాదలను గౌరవించలేదని మాత్రం విమర్శించగలం.

కానీ అన్ని అనుమతులతో అక్కడికి చదువు కోసం, రిసెర్చి కోసం వెళ్లిన విద్యార్థుల విషయంలో సైతం ట్రంప్ ప్రభుత్వం చాలా దుర్మార్గంగా, వివక్షాపూరితంగా ప్రవర్తిస్తోంది. కొలంబియా యూనివర్సిటీలో రిసెర్చి కోసం చేరిన రంజని శ్రీనివాసన్ అమెరికన్ అధికారుల నిర్బంధాన్ని తప్పించుకుని కెనడాకు పారిపోవలసిన పరిస్థితి ఎందుకొచ్చింది? ఆమె చేసిన నేరం ఏమిటి? అమెరికన్ చట్టాలను వేటిని ఆమె ఉల్లంఘించింది? కేవలం పాలస్తీనా అనుకూల నిరసన ప్రదర్శనలను బలపరచడమే రంజని చేసిన నేరం. అదేమీ చట్ట విరుద్ధం కాదే? కాని అమెరికన్ ప్రభుత్వం ఆమె వీసాను రద్దు చేసి నిర్బంధించి వెనక్కి పంపాలని నిర్ణయించింది.

రెండు రోజులు గడిచాయో లేదో బాదర్‌ఖాన్ సూరి అనే మరొక భారతీయ విద్యార్థి హమాస్‌కు అనుకూలంగా ప్రచారం చేస్తున్నాడంటూ నిర్బంధించారు. అతడికి ఏ నేర చరిత్రా లేదు. ఫలానా నేరం చేశాడన్న ఆరోపణ కూడా ఏదీ లేదు. కాని నిర్బంధించారు. బహుశా అతడి భార్య పాలస్తీనా పౌరురాలు కావడమే కారణం అయివుండొచ్చునని కొన్ని పత్రికలు వ్యాఖ్యానించాయి. అంటే అమెరికా వెళ్లి అక్కడ ఇతర దేశాల నుండి వచ్చిన వారిలో ఎవరినైనా జీవిత భాగస్వామిగా చేసుకోవడం కూడా నేరమేనా? పాలస్తీనా దేశాన్ని నాశనం చేయడానికి ఇజ్రా యిల్‌కి సహాయం చేయడమేగాక, అన్ని సందర్భాలలోనూ ఇజ్రాయిల్ చేస్తున్న దారుణమైన నేరాలను సమర్థించడమే గాక ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా పాలస్తీనా దేశస్తులైతే వారు నేరస్తులన్న భావనతో వ్యవహరించడం, వారిని పెళ్ళాడినవారు కూడా నేరస్తులేనని పరిగణించడం ఎంత ఘోరం!



రంజని శ్రీనివాసన్

బదార్‌ఖాన్ సూరి

ఇదేదో ట్రంప్ ఒక్కరికే పట్టుకున్న మానసిక జాడ్యం కాదు. అమెరికన్ పాలకులందరికీ ప్రకోపిస్తున్న వికారం. చేజారిపోతున్న ప్రపంచాధిపత్యాన్ని ఎలాగైనా నిలబెట్టుకోవాలన్న యావ. ఏక ధృవ ప్రపంచం అంటూ అమెరికా చెలాయించిన దాదాగిరికి కాలం చెల్లిపోతోంది. డాలర్ ఆధిపత్యం తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోంది. అత్యధిక రుణగ్రస్త దేశంగా అమెరికా మిగిలిపోయే ప్రమాదం దాపురించింది. ఈ దశలో తమ ఓటర్లకు ఏదో విధంగా భరోసా కల్పించడానికి ట్రంప్ 'అమెరికాను మళ్లీ గొప్ప రాజ్యంగా చేద్దాం' అన్న నినాదాన్ని ఇచ్చాడు. ఆ నినాదమే అమెరికా ఆధిపత్యం చేజారిపోతోందని ఒప్పుకుంటోంది. అయితే ఇక్కడ చూడాల్సింది దాని వెనుక అమెరికన్ పాలకులకు పట్టుకున్న భయాన్ని. ఆ భయాన్ని కప్పిపుచ్చడానికి ఎవరు తేరగా దొరికితే వారిని బలిపశువుల్ని చేసి అమెరికన్ పౌరుల ముందు తమ బింకాన్ని ప్రదర్శిస్తున్నారు. అమెరికా ఆంతరంగిక భద్రతా కార్యదర్శి (అంటే మన హోం మంత్రి పదవి లాంటిది), "అమెరికాకు వీసా పొందడం, ఇక్కడ చదువుకోవడం, ఇక్కడ జీవించడం ఒక గొప్ప ప్రత్యేక సదుపాయం" అంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టాడు.

మన దేశంలో కూడా చాలా మందికి ఇటువంటి అభిప్రాయమే ఉన్నట్టుంది. అక్కడ చదువుకోడానికి అనుమతి లభించడం అంటే మనకి ఏదో పెద్ద ఉపకారం జరిగినట్టు భావిస్తున్నారు. కాని వాస్తవం వేరుగా ఉంది. గతేడాది అమెరికాలో ఉన్న విదేశీ విద్యార్థుల సంఖ్య 11,26,690. వీరంతా 200కు పైగా దేశాల నుండి వచ్చినవారు. వీరిలో 3,31,602 మంది భారతీయ విద్యార్థులే. అంటే నాలుగో వంతుకు పైబడి ఉన్నారు. మొత్తం విదేశీ విద్యార్థుల నుండి గతేడాది అమెరికా వసూలు చేసిన సొమ్ము 43.8 బిలియన్ల డాలర్లు (రూ.3,76,680 కోట్లు!). ఇందులో భారతీయ విద్యార్థుల నుండి సుమారు లక్ష కోట్ల రూపాయలు వసూలు చేసి వుండాలి. అమెరికాలో సగటు వేతనం ఏడాదికి 48వేల డాలర్లు. ఒక విదేశీ విద్యార్థి సగటున చేస్తున్న ఖర్చు 40వేల డాలర్లు. అంటే భారతీయ విద్యార్థులు అమెరికాలో చదువుకోవడం అమెరికాకు భారం కాదు సరిగదా, ఆ దేశానికి చాలా లాభసాటి వ్యవహారం అన్నమాట. పైగా ఇంతమంది అక్కడ చదువుతున్నందువల్ల అమెరికాలో 3,78,000 ఉద్యోగాలు సృష్టించబడ్డాయని టైమ్స్ ఆఫ్ ఇండియా వ్యాఖ్యానించింది.

అంతే కాదు. సైన్సు, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సులు (స్టెమ్ కోర్సులు) చదివే విద్యార్థులు అమెరికాలో చాలా తక్కువ మంది ఉన్నారు. అందువలన అక్కడ ఈ రంగాలలో ఉద్యోగాలు చేయడానికి కూడా విదేశీ విద్యార్థులు అవసరమే. భారతీయ విద్యార్థులు చదువు ముగించుకుని అక్కడే స్థిరపడిన కారణంగానే సిలికాన్ వ్యాలీ వైభవాన్ని సాధించగలిగింది. ఇటువంటి ఉదాహరణలు చాలానే ఉన్నాయి. అంటే భారతీయ విద్యార్థులకు అమెరికా ప్రత్యేకంగా ఒరగబెట్టినది ఏమీ లేదు. మనవాళ్లే అమెరికాకు ఎంతో ఉపయోగపడుతున్నారు. అటువంటప్పుడు మన మోడీ ప్రభుత్వం ఎంత బలంగా వ్యవహరించాలి? మన వాళ్లకి అవమానాలు ఎదురౌతూంటే ఎంత గట్టిగా స్పందించాలి?

మన దేశంలో కూడా చాలా మందికి ఇటువంటి అభిప్రాయమే ఉన్నట్టుంది. అక్కడ చదువుకోడానికి అనుమతి లభించడం అంటే మనకి ఏదో పెద్ద ఉపకారం జరిగినట్టు భావిస్తున్నారు. కాని వాస్తవం వేరుగా ఉంది. గతేడాది అమెరికాలో ఉన్న విదేశీ విద్యార్థుల సంఖ్య 11,26,690. వీరంతా 200కు పైగా దేశాల నుండి వచ్చినవారు. వీరిలో 3,31,602 మంది భారతీయ విద్యార్థులే. అంటే నాలుగో వంతుకు పైబడి ఉన్నారు. మొత్తం విదేశీ విద్యార్థుల నుండి గతేడాది అమెరికా వసూలు చేసిన సొమ్ము 43.8 బిలియన్ల దాలర్లు (రూ.3,76,680 కోట్లు!). ఇందులో భారతీయ విద్యార్థుల నుండి సుమారు లక్ష కోట్ల రూపాయలు వసూలు చేసి వుండాలి. అమెరికాలో సగటు వేతనం ఏడాదికి 48వేల డాలర్లు. ఒక విదేశీ విద్యార్థి సగటున చేస్తున్న ఖర్చు 40వేల దాలర్లు. అంటే భారతీయ విద్యార్థులు అమెరికాలో చదువుకోవడం అమెరికాకు భారం కాదు సరిగదా, ఆ దేశానికి చాలా లాభసాటి వ్యవహారం అన్నమాట.

మానవ హక్కుల రక్షణకు, ప్రజాస్వామ్యానికి, స్వేచ్ఛకు ట్రంప్ ఎంత వ్యతిరేకమో, ఇక్కడ మోడీ కూడా అంతే వ్యతిరేకం. పాలస్తీనా విషయంలోనూ మోడీది ట్రంప్ బాటే. అందుకే అక్కడా, ఇక్కడా భారతీయుల్ని భయభ్రాంతుల్ని చేసి నోరెత్తకుండా ఉండేలా చూడాలని వారిద్దరూ భావిస్తున్నారు. అమెరికా నుండి ఎన్నారైలు పంపే విదేశీ మారక ద్రవ్యం మోడీ ప్రభుత్వానికి కావాలి. కాని అక్కడ ఉంటున్న భార తీయుల హక్కులకు భంగం కలిగితే మాత్రం నోరు మెదపరు. అమెరికన్ ఏలికలకు అంతగా లొంగిపోయి వంగివంగి దండాలు పెడుతూ మన దేశ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నాడు మోడీ. దానికి వంత పాడుతున్నారు చాలామంది నేతలు. ఇక ఇప్పుడు నోరు విప్పి బలంగా ప్రజా స్వామ్య విలువలను, దేశ ఆత్మగౌరవాన్ని కాపాడుకోడానికి నడుం బిగించాల్సింది సాధారణ ప్రజానీకమే. వారికి ఎప్పుడూ వామపక్షాలు, అభ్యు దయ వాదులు అండగా ఉంటారు. సో, మూవ్ ఆన్!

పదవీ కాలం ముగిసిన ఎమ్మెల్సీలకు

సీఎం ఘన సన్మానం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసన మండలిలో పదవీకాలం ముగిసిన 9 మంది ఎమ్మెల్సీలకు సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. గురువారం శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శాసనమండలి ప్రాంగణంలో సమావేశం జరిగింది. సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. సీఎం చేతుల మీదుగా ఎమ్మెల్సీలకు షీల్డ్ అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ తొమ్మిది మంది ఎమ్మెల్సీ పదవీ కాలం ముగుస్తుందని గురువారం అఖరి రోజుగా సమావేశాలలో పాల్గొన్నారని వారికి ఘనంగా వీడ్కోలు పలుకుతున్నట్టు తెలిపారు. సభ్యుల్లో మంత్రులుగా చేసిన వారు ఉన్నారని వారి అనుభవాలను నూతన సభ్యులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. సభ్యులు అనుభవాలను పంచుకోవాలని తెలిపారు. వీడ్కోలు సభకు నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలను ఆహ్వానించారు. ముల్క కోమరయ్య, శ్రీపాల్ రెడ్డి, సత్యం, అద్దంకి దయాకర్, అంజిరెడ్డిలను ఆహ్వానించారు.

ఎమ్మెల్సీ ఎం.ఎస్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఎమ్మెల్సీగా సుదీర్ఘకాలం పని చేసినట్టు తెలిపారు. 15 సంవత్సరాలు ఎమ్మెల్సీగా ఉన్నాననీ, తన తండ్రి శ్యామలరావు కూడా ఇదే సభలో 10 సంవత్సరాలు ఉన్నారని చెప్పారు. శాసన మండలితో మా కుటుంబానికి అత్యంత అత్మీయ అనుబంధం ఉందని తెలిపారు. గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లడుతూ 6 సార్లు శాసన సభలో ఉన్నాననీ మూడు సార్లు ప్రతిపక్షంలో, మూడు సార్లు అధికార పక్షంలో ఉన్నానని తెలిపారు. కాని శాసనమండలిలో ఎమ్మెల్సీగా చేయడం సంతృప్తినిచ్చిందని చెప్పారు. మాజీ డిప్యూటీ సీఎం, మాజీ హౌం మంత్రి, మాజీ రెవెన్యూ మంత్రి మహబూబ్ అలీ, యెగ్గ మల్లేశం, అలుగుబెల్లి నర్సిరెడ్డి (టీచర్స్ ఎమ్మెల్సీ), శేరి సుభాష్ రెడ్డి, కూర రఘోత్తమ రెడ్డి (టీచర్స్ ఎమ్మెల్సీ), మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మిర్జా రియాజుల్ హసన్ ఎఫెండీ తమ అనుభవాలను పంచుకున్నారు.

డీలిమిటేషన్‌తో నష్టం

(మొదటిపేజీ తరువాయి)

పెంచాలని పునర్విభజన చట్టంలో ఉంది. ఇప్పటివరకు వాటిని పెంచలేదు. కేంద్రం వివక్ష చూపుతున్నది. జమ్మూకాశ్మీర్‌లో రాజ్యాంగాన్ని సవరించి 2011 జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాలను 83 నుంచి 90కి పెంచారన్నారు. సిక్కింలో 2018లో అప్పటి క్యాబినెట్ తీర్మానం చేస్తే, ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ కొనసాగిస్తున్నారు. రాజకీయ ప్రయోజనం లేకపోవడంతోనే తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ సీట్ల పెంపును కేంద్రం పట్టించుకోలేదు. 24 శాతం ప్రాతినిథ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి 36 శాతం పన్నులు కడుతున్నాయి. కేంద్రం నుంచి దక్షిణాది రాష్ట్రాలకు వాటా తక్కువ వస్తున్నది. ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్‌కు మాత్రం కేంద్రం పన్నుల్లో ఎక్కువ వాటా ఉంది' సీఎం రేవంత్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వంద్వ విధానాలను ప్రజల ముందు ఉంచేందుకే సభలోఈ తీర్మానం ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ఈ విషయంలో అవసరమైతే పోరుబాట పడతామని ప్రకటించారు. త్వరలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మాజీ కుందూరు జానారెడ్డి ఆధ్వర్యంలో అన్ని పార్టీలతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశానికి అందరూ రావాలని విజ్ఞప్తి చేశారు. సీఎం ప్రసంగం అనంతరం స్పీకర్ ప్రసాద్‌కుమార్ తీర్మానాన్ని సభ ఆమోదానికి ఉంచారు. ఆయా పార్టీలన్నీ ఏకగ్రీవంగా మద్దతు ఇచ్చాయి.

నాసిరకం విత్తనంతో నష్టపోయిన మక్కజొన్న రైతులకు పరిహారం ఇప్పించాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి సాగర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ములుగు జిల్లా వెంకటాపురం, వాజేడు, కన్నాయ గూడెం మండలాల్లో నకిలీ మొక్కజొన్న ఫౌండేషన్ విత్తనం వల్ల నష్టపోయిన రైతులకు ఆయా కార్పొరేట్ విత్తన కంపెనీల నుంచి పరిహారం ఇప్పించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. సంబంధిత విత్తన కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మక్కజొన్న పంట చేతికి రాకపోవడంతో నకిలీ విత్తనాలుగా తేలడంతో మధు అనే రైతు మనస్తాపానికి గురై పురుగుల మందు తీసుకుని మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా మండలాల్లో బహుళజాతి కంపెనీల ఏజెంట్లు నకిలీ మొక్కజొన్న విత్తనాలను రైతులకు ఇస్తున్నారని అన్నారు. దీనివల్ల దాదాపు ఐదువేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని తెలిపారు. పంట ఏపుగా పెరిగిందే తప్ప కంకలు రాలేదని చెప్పారు. దీని కారణంగా మరణించిన రైతుకు ఆ కంపెనీ నుంచి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట నష్టం రైతులకు ఎకరాకు రెండు లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు. సమావేశంలో సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, బొంతల చంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు పి.జంగారెడ్డి, మాదినేని రమేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులు మూడ్ శోభన్, మాటూరి బాల్‌రాజ్‌గౌడ్, అన్నవరపు సత్యనారాయణ, పల్లపు వెంకటేష్ తదితరులు ఉన్నారు.

శిథిలాల కింద చితికిన కూలీల బతుకులు

30 గంటల పాటు శ్రమించిన రెస్క్యూ టీమ్

మృతుల కుటుంబాల ఆందోళన

అండగా ఉన్న సీపీఐ(ఎం) బృందం

భద్రాచలంలో భవనం కూలిన ఘటనలో ఇద్దరి మృతి







(ఫైల్)

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఆరంతస్తుల భవనం కూలిన ఘటనలో శిథిలాల కింద ఉన్న ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. శిథిలాల కింద నుంచి రక్షించండి అంటూ అర్తనాదాలు వినిపించడంతో జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు పోలీసులు, రెస్క్యూ టీమ్ బుధవారం అర్ధరాత్రి నుంచి సహాయకచర్యలు చేపట్టారు. సిబ్బంది 8 గంటలు శ్రమించి ఎట్టకేలకు ఒకరిని సజీవంగా బయటకు తీసుకొచ్చారు. కానీ ప్రాణాలు మాత్రం కాపాడలేకపోయారు. బయటకు వచ్చిన 10 నిమిషాల్లో మృతి చెందారు. శిథిలాల కింద ఉన్న మరొకరు మృతి చెందినట్టు అధికారులు నిర్ధారించారు.

భద్రాచలం పట్టణానికి చెందిన చల్లా కామేష్(45), ఉపేంద్ర(47) ఇద్దరూ తాపీ మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పనిలో భాగంగా పట్టణానికి చెందిన శ్రీపతి ఆరంతస్తుల భవనంలో ఏడాది కాలంగా సిమెంట్ పని చేస్తున్నారు. బుధవారం కూడా మధ్యాహ్నం వరకు పని చేశారు. అనంతరం ఆరో అంతస్తు నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు వచ్చి భోజనం చేసి కాసేపు సేదతీరుతుండగా ఒక్కసారిగా భవనం కూలింది. దాంతో ఇద్దరూ శిథిలాల కింద చిక్కుకున్నారు. బుధవారం రాత్రి చల్లా కామేష్ ఆర్తనాదాలు పోలీసులకు వినిపించాయి. అప్రమత్తమైన రెస్క్యూ టీమ్ సభ్యులు బుధవారం అర్ధరాత్రి 2 గంటలకు అతన్ని బయటికి తీయగా.. 10 నిమిషాల్లోనే ప్రాణాలొదిరారు. మరో కార్మికుడు ఉపేంద్ర(47) మృతదేహం శిథిలాలు తొలగించే క్రమంలో గురువారం సాయంత్రం వెలికితీశారు. కామేష్ అవివాహితుడు. ఉపేందర్‌కి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తె, కుమారుడు హైదరాబాద్‌లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. మరో నాలుగు రోజుల్లో పిల్లలు వస్తారన్న ఆనందంలో బుధవారం పనికి వెళ్లి తిరిగి రాని లోకాలకు వెళ్లారని భార్య రమాదేవి విలపించడం స్థానికులను కంటతడి పెట్టించింది. కాగా, సహాయక చర్యల్లో జరుగుతున్న జాప్యంపై ఉపేంద్ర కుటుంబ సభ్యులు పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీస్ సీఆర్పీఎఫ్ సిబ్బంది ఉపేంద్ర కుటుంబాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కి తరలించగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి హుటాహుటిన పోలీస్ స్టేషన్‌కి చేరుకొని బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. పోలీసులతో మాట్లాడి కుటుంబ సభ్యులను స్టేషన్ నుంచి సంఘటనా స్థలానికి తీసుకువచ్చారు.

శిథిలాల కింద భారీగా డబ్బు, బంగారం

కుప్పకూలిన భవనం శిథిలాల కింద ఐదడుగుల బీరువాను ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది వెలికి తీశారు. బీరువాలో భారీగా నగదుతో పాటు బంగారపు ఆభరణాలు, పూజా సామగ్రి, దీపపు కుందులు లభించడంతో కట్టుదిట్టమైన భద్రత నడుమ వాటిని ఏఎస్పీ కార్యాలయానికి తరలించారు.

మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలి : కోటం రాజు



భద్రాచలం పట్టణంలో భవనం కూలిన ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారాన్ని అందించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటం రాజు డిమాండ్ చేశారు. గురువారం యూనియన్ నాయకత్వ బృందం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఉపేందర్, కామేశ్వరరావు కుటుంబాలను పరామర్శించి భవన నిర్మాణ కార్మికులతో కలిసి భద్రాచలం ఆర్డీవో దామోదరరావుకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కోటం రాజు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ముదాం శ్రీనులు మాట్లాడుతూ.. నాసిరకంగా ఆరు అంతస్తులు నిర్మించి కార్మికుల చావుకు కారణమైన సంబంధిత యజమాని శ్రీపతిపై హత్య కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గడిచిన 24 గంటల నుంచి బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పెద్దల నుంచి గాని, అధికారుల నుండి గాని ఎటువంటి సహాయం అందలేదని అన్నారు. కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఎంబీ నర్సారెడ్డి, నాయకులు వైవీ రామారావు, పారిల్లి సంతోష్ కుమార్, సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, సీఐటీయూ పట్టణ నాయకులు అప్పారి రాము, ఏ.రత్నం, చాట్ల శ్రీనివాసరావు, భూపేందర్‌తోపాటు బాధిత కుటుంబ సభ్యులు వీరస్వామి, రాంబాబు, రాము, తోపాటు కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యపై ఖర్చు అంతంత మాత్రమే



- సార్క్ దేశాల కంటే తక్కువే
- పార్లమెంటరీ కమిటీ పెదవి విరుపు
- జీడీపీలో 6 శాతానికి పెంచాలని సూచన

న్యూఢిల్లీ : భూటాన్, మాల్దీవులు వంటి ఇతర సార్క్ దేశాలలో కంటే భారత్‌లో విద్యపై చేస్తున్న ఖర్చు తక్కువగా ఉంటోందని పార్లమెంటరీ కమిటీ అభిప్రాయపడింది. 2020వ సంవత్సరపు జాతీయ విద్యా విధానం సిఫార్సు చేసిన విధంగా జీడీపీలో విద్యకు ఆరు శాతం నిధులు కేటాయించాలని సిఫార్సు చేసింది. విద్య, మహిళలు, చిన్నారులు, యువత, క్రీడలపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బుధవారం తన నివేదికను పార్లమెంటుకు సమర్పించింది. ఈ కమిటీకి రాజ్యసభకు చెందిన కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ సింగ్ నేతృత్వం వహించారు. 2021-22లో కేంద్రం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కలిపి విద్యకు జీడీపీలో కేవలం 4.12 శాతం మాత్రమే ఖర్చు చేశాయని కమిటీ ఎత్తిచూపింది. దీనిని గణనీయంగా పెంచి కనీసం ఆరు శాతానికి చేర్చాలని సూచించింది.

2022లో భూటాన్ తన జీడీపీలో విద్యపై 7.47 శాతం, మాల్దీవులు 4.67 శాతం ఖర్చు చేశాయని కమిటీ గుర్తు చేసింది. ఆ సంవత్సరం మన దేశం కేవలం 4.12 శాతమే ఖర్చు చేసిందని తెలిపింది. వ్యయాన్ని పెంచే విషయంలో విద్యా శాఖ చిత్తశుద్ధితో ప్రయత్నించాలని కోరింది. 'ఆర్థిక శాఖ నుండి అదనపు నిధులు రాబట్టాలి. జీడీపీలో విద్య కోసం ఆరు శాతం ఖర్చు చేస్తే పాఠశాల నుండి ఉన్నత స్థాయి వరకూ ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్టవంతం చేయయవచ్చు. అంతర్జాతీయ స్థాయిలో విద్యను అందించవచ్చు. సమాజంలోని అన్ని వర్గాల వారికీ విద్యను అందుబాటులోకి తేవచ్చు' అని వివరించింది.

గత కొన్ని సంవత్సరాలుగా విద్యపై చేస్తున్న ఖర్చులో నిలకడ లోపించిందని కమిటీ గుర్తించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి జీడీపీలో విద్యపై 2014-15లో 4.07 శాతం, 2015-16లో 4.2 శాతం, 2016-17లో 4.24 శాతం ఖర్చు చేశాయి. అయితే ఆ తర్వాతి సంవత్సరాలలో ఖర్చు తగ్గుతూ వచ్చింది. 2017-18లో 3.87 శాతం, 2018-19లో 3.9 శాతం, 2019-20లో 4.04 శాతం మాత్రమే ఖర్చు చేశారు. 2020-21లో జీడీపీలో విద్యపై చేసిన వ్యయం 4.36 శాతానికి పెరిగినప్పటికీ 2021-22లో 4.12 శాతానికి తగ్గిపోయింది.

కాగా గత సంవత్సరం డిసెంబర్ నాటికి దేశంలోని 10 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు రెగ్యులర్ వైస్ ఛాన్సలర్లు లేకుండానే నడుస్తున్నాయని కమిటీ గుర్తించింది. విశ్వవిద్యాలయాలు సరిగా పనిచేయాలంటే రెగ్యులర్, పూర్తి స్థాయి వీసీలను నియమించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ ఫ్యాకల్టీ, నాన్-ఫ్యాకల్టీ సభ్యుల నియామకంలో వీసీలు కీలక పాత్ర పోషిస్తారని గుర్తు చేసింది. అభివృద్ధి ప్రణాళికలను కూడా వారే పర్యవేక్షిస్తారని కమిటీ తెలిపింది.

జాన్‌వెస్లీ, పార్టీ నాయకుల అరెస్టులపై.. రంగారెడ్డి జిల్లాలో సీపీఐ(ఎం) నిరసనలు

- రామోజీ ఆక్రమించిన భూములు తిరిగి ఇచ్చేయాలని డిమాండ్
- ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి యాదయ్య హౌస్ అరెస్ట్



నవతెలంగాణ-విలేకరులు

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, పార్టీ నాయకులు, కార్యకర్తల అరెస్టులను ఖండిస్తూ రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సీపీఐ(ఎం) నాయకులు గురువారం ఆందోళనలు చేపట్టారు. రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం ఆక్రమించిన భూములు పేదలకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన 'ఛలో రామోజీ ఫిల్మ్ సిటీ' కార్యక్రమంలో జాన్‌వెస్లీ, ఆ పార్టీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. దీన్ని నిరసిస్తూ గురువారం సీపీఐ(ఎం) శ్రేణులు ఆందోళనలు చేపట్టారు. కందుకూరు మండల కేంద్రంలోని శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన జాతీయ రహదారిపై గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. మంచాలలో నిరసన చేపట్టారు. రాజేందర్‌నగర్ చౌరస్తాలో భారీ ధర్నా నిర్వహించారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి యాదయ్య హౌస్ అరెస్ట్



మంచాల మండల పరిధిలోని చెన్నారెడ్డిగూడ గ్రామంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్యను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఉదయమే పోలీసులు ఆయన ఇంటికి చేరుకుని, ఆయన్ను బయటకు రాకుండా అడ్డుకున్నారు. దీనిపై పార్టీ శ్రేణులు చెన్నగూడ గ్రామంలో నిరసన చేపట్టారు. రామోజీ యాజమాన్యం ఆధీనంలో ఉన్న పేదల ఇండ్ల స్థలాలను రాష్ట్రప్రభుత్వం విడిపించి పేదలకు పంపిణీ చేయకపోతే వారం రోజుల్లో మరో పోరాటానికి సిద్ధమవుతామని పగడాల యాదయ్య హెచ్చరించారు.

శభాష్..

- పునర్విభజనపై తెలంగాణ అసెంబ్లీ తీర్మానంపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్



(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నియోజకవర్గాల పునర్విభజనపై తెలంగాణ శాసనసభలో ఒక ముఖ్యమైన మైలురాయిలా నిలిచిపోయే తీర్మానం చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మాటలను చేతల్లో నిరూపించారని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కొనియాడారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజనను వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన తెలంగాణ శాసనసభ గురువారం తీర్మానం చేసిన నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. న్యాయం, సమానత్వం, సమాఖ్య స్ఫూర్తిని సమర్థిస్తూ సరైన రీతిలో పునర్విభజన కోరుతూ సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ శాసనసభలో తీర్మానం చేశారని తమిళనాడు సీఎం పేర్కొన్నారు. చెన్నైలో ప్రతిపాదించిన అంశాలు హైదరాబాద్‌లో నెరవేరాయనీ, ఇది ఆరంభం మాత్రమేననీ, హైదరాబాద్‌లో ఐక్యకార్యాచరణ సమితి రెండో సమావేశం నేపథ్యంలో మరిన్ని రాష్ట్రాలు అదే బాటలో నడుస్తాయని తమిళనాడు సీఎం అభిప్రాయపడ్డారు. పునర్విభజన విషయంలో తమిళనాడును అనుసరిస్తూ, ఈ చర్య మన ప్రజాస్వామ్య సమతుల్యతను దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నైనా ప్రతిఘటించే సమష్టితత్వాన్ని బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. భారతదేశ భవిష్యత్తును అధర్మ మార్గాన ఒక ప్రాంతానికి అన్యాయం చేసే రీతిన రాసేందుకు ప్రయత్నించే ఎవరినీ అనుమతించబోమని స్టాలిన్ స్పష్టం చేశారు.

సెస్, సర్‌చార్జీలను రాష్ట్రాలతో పంచుకోలేం


- రాజ్యసభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభ ఆర్థిక బిల్లు, ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించడంతో పార్లమెంటు 2025-2026 కేంద్ర బడ్జెట్‌కు సంబంధించిన కార్యకలాపాలను పూర్తి చేసింది. గురువారం రాజ్యసభలో ఆర్థిక బిల్లు, ద్రవ్య వినిమయ బిల్లుకు సంబంధించిన చర్చలు జరిగాయి. దక్షిణ భారత రాష్ట్రాల సభ్యులు కేంద్ర ప్రభుత్వం తమపై చూపుతున్న ఆర్థిక వివక్షను బయటపెట్టారు. సెస్, సర్‌చార్జీలను రాష్ట్రాలతో పంచుకోలేమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన సమాధానంలో తెలిపారు. సెస్, సర్‌చార్జి ద్వారా పొందిన డబ్బును కేంద్ర ప్రాయోజిత పథకాలకు అందిస్తారు. కాబట్టి, సెస్, సర్‌చార్జి రాష్ట్రాలకు ప్రయోజనం చేకూర్చవని వాదన నిరాధారమైనది. సెస్, సర్‌ఛార్జి ద్వారా వసూలు చేసిన మొత్తంపై కేంద్ర ప్రభుత్వం ఎటువంటి పన్నులు చెల్లించదు. ఇవన్నీ కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రాష్ట్రాలకు అందిస్తున్నామని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

స్పీకర్ అనుమతి లేకుండా నిరసనలేంటి?

- హరీశ్‌రావు సభలో సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీయడం సభా ఉల్లంఘనే
- సోషల్‌మీడియాలో సభపై అసత్య ప్రచారాలు చేయించడమేంటి?
- బీఆర్ఎస్ సభ్యులపై చర్యలు తీసుకోండి : విప్ ఆది శ్రీనివాస్
- పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం : స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్పీకర్ అనుమతి లేకుండా బీఆర్ఎస్ సభ్యులు సభలోనూ, శాసనసభ లాబీలు, ఆవరణలోనూ నినాదాలు చేయడం, నిరసన తెలపడం సభా హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. సభలో సభ్యుడై ఉండ సభ జరుగుతుంటే బుధవారం రాత్రి బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు సెల్‌ఫోన్ ద్వారా ఫొటోలు తీయడాన్ని తప్పుబట్టారు. సభలో ఫొటోలు తీయడం నిషేధం అని తెలిసీ ఫొటోలు తీయడమేంటని నిలదీశారు. లాబీల్లో నినాదాలు చేసిన, శాసనసభ ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపిన ఫొటోలు బయటి ప్రపంచానికి విడుదల చేయడం, సభపై అసత్యప్రచారాలు చేయించడం దుర్మార్గమన్నారు. సోషల్‌మీడియా ద్వారా ప్రచారం చేయడం, ఎస్టేట్ గ్రూపులో ఫొటోలు వేయడం సభా సాంప్రదాయాల ఉల్లంఘన కిందకు వస్తుందని చెప్పారు. సభలో ఫొటోలు తీయడమేంటి? చైర్ అంటే గౌరవం లేదా? సీఎం అంటే గౌరవం లేదా? అని నిలదీశారు. మాట్లాడే ప్రతిసారీ హరీశ్‌రావు సభను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హరీశ్‌రావు ప్రతి దానిపైనా అబద్దాలే మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇలాంటి పదం వాడొచ్చేలేదోగానీ వారిపై కొరడా ఝులిపించాలని కోరుతున్నానన్నారు. బీఆర్ఎస్ సభ్యులకు స్పీకర్ తగిన సమయం ఇస్తున్నారనీ, మళ్లీ ఇతర సభ్యులు మాట్లాడుతుంటే రన్నింగ్ కామెంట్లు ఏంటని అడిగారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ..పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. సభా కార్యక్రమాలకు విరుద్ధంగా అలాంటి కార్యక్రమాలు చేయడం సరిగాదన్నారు.

మానవ హక్కుల ఉల్లంఘనలకు దారి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వలసవాద చట్టాలను సమన్వయం చేయడం పేరుతో ప్రవేశపెట్టిన బిల్లు అపరిమిత అధికార దుర్వినియోగానికి, మానవ హక్కుల ఉల్లంఘనలకు దారితీస్తుందని సీపీఐ(ఎం) లోక్‌సభ నాయకుడు కె. రాధాక ృష్ణన్ స్పష్టం చేశారు. ఇమ్మిగ్రేషన్ అధికారులకు ఇచ్చిన అధిక అధికారాలు విస్త ృతంగా దుర్వినియోగం చేయబడతాయనే ఆందోళనలు ఉన్నాయని అన్నారు. అనవసర అరెస్టులు, ఏకపక్ష నిర్బంధాలు, క్రూరమైన అవమానాలు పెరుగుతాయని పేర్కొన్నారు. విదేశీ పౌరుల ప్రవేశాన్ని నిరాకరించే అధికారం ప్రభుత్వానికి ఉందని, వారు జాతీయ భద్రతకు 'ముప్పు'గా భావిస్తే వారిని బహిష్కరించే అధికారం ఉందని బిల్లులో పేర్కొన్నారు. ఈ నిబంధనలు కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే జర్నలిస్టులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త బిల్లులో శరణార్థులను రక్షించడానికి ఎటువంటి నిబంధనలు లేవని అన్నారు. భారతదేశం ఏకపక్షంగా విదేశీయులపై కఠినమైన నిబంధనలు విధిస్తే, విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు తాము నివసిస్తున్న దేశాలలో కూడా ఇలాంటి ప్రతిచర్యలను ఎదుర్కొంటారనే ఆందోళనను లేవనెత్తారు. ఈ పరిస్థితిలో బిల్లులోని వివాదాస్పద నిబంధనలను పున్ణపరిశీలించాలని కె. రాధాక ృష్ణన్ డిమాండ్ చేశారు. చట్టాన్ని ఉల్లంఘించారనే అనుమానంతో విదేశీయులను అరెస్టు చేయడానికి అధికారం ఇచ్చే బిల్లు తీవ్ర పరిణామాలను కలిగిస్తుందని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ హెచ్చరించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాజీవ్ రాయ్ మాట్లాడుతూ మన దేశస్థులను 'అక్రమ వలసదారులు'గా ముద్రవేసి, చేతులు, కాళ్లు సంకెళ్లు వేసి సైనిక విమానాల్లోకి బలవంతంగా ఎక్కించిన సంఘటనను కేంద్ర ప్రభుత్వం మర్చిపోయిందా? అని ప్రశ్నించారు. టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్, సీపీఐఎంఎల్ ఎంపీ రాజారాం సింగ్ కూడా ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రతిపక్షాలు లేవనెత్తిన ఆందోళనలు, విమర్శలకు హోంమంత్రి అమిత్ షా స్పందించలేదు. ప్రతిపక్ష ఎంపీలు ప్రతిపాదించిన అన్ని సవరణలను తిరస్కరిస్తూ, బిల్లును లోక్‌సభలో మూజువాణి ఓటుతో ఆమోదించారు.

భారత్ ధర్మశాల కాదు : అమిత్‌షా

భారతదేశం ధర్మశాల కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. చట్టాన్ని ఉల్లంఘించారనే అనుమానంపై వారెంట్ లేకుండా ఏ విదేశీయుడినైనా అరెస్టు చేయడానికి అధికారులకు అధికారం ఇచ్చే 'ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ బిల్లు'ను లోక్‌సభ గురువారం ఆమోదించింది. భారతదేశానికి వచ్చే విదేశీయుల పౌర, మానవ హక్కులను ఉల్లంఘించే వివాదాస్పద నిబంధనలపై ప్రతిపక్షం తీవ్రంగా నిరసన వ్యక్తం చేసింది.

అమిత్ షాకు వ్యతిరేకంగా ప్రివిలేజ్ మోషన్ తిరస్కరణ

అమిత్ షాకు వ్యతిరేకంగా వచ్చిన ప్రివిలేజ్ మోషన్‌ను రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్కర్ తిరస్కరించారు. ఆయన మాటల్లో ఎక్కడా ఉల్లంఘన లేదని పేర్కొన్నారు. రాజ్యసభ చైర్మెన్ ఎంపీల ప్రవర్తనా మార్గదర్శకాలను సమీక్షించడానికి నీతి కమిటీని నియమించారు. రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్కర్ గురువారం కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ ప్రవేశపెట్టిన హక్కుల తీర్మానాన్ని తిరస్కరించారు. ఇందులో "ఎటువంటి అతిక్రమణ" జరగలేదని, అమిత్ షా వ్యాఖ్యలు వాస్తవంగా ధ్రువీకరించబడ్డాయని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ధన్కర్ మాట్లాడుతూ మార్చి 26న తనకు హక్కుల తీర్మానం అందిందని, అయితే రమేశ్ తన సంతకాన్ని మే 26గా తప్పుగా తేదీ పెట్టారని పేర్కొన్నారు. విపత్తు నిర్వహణ బిల్లు 2024పై చర్చ సందర్భంగా అమిత్ షా ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఆర్ఎఫ్) గురించి తప్పుదారి పట్టించే వాదనలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ రమేశ్ పేర్కొన్నారు. హక్కుల ఉల్లంఘనను "తీవ్రమైన విషయం"గా అభివర్ణిస్తూ, పార్లమెంటరీ వేదికలను "ప్రతిష్టలను నాశనం" చేయడానికి దుర్వినియోగం చేయడంపై ధన్కర్ ఆందోళన వ్యక్తం చేశారు. సభ్యులు మర్యాద, వ్యక్తిగత విశ్వసనీయతను కాపాడుకోవాలని నొక్కి చెప్పారు. ఆధునిక సాంకేతిక, సోషల్ మీడియా సవాళ్ల ద ృష్ట్యా నివేదికను సమీక్షించి సభ్యులకు కొత్త మార్గదర్శకాలను అభివృద్ధి చేయాలని ఘనశ్యామ్ తివారీ నేతృత్వంలోని నీతి కమిటీని చైర్మెన్ ఆదేశించారు.

పార్లమెంటులో న్యాయ శాఖ మంత్రి ప్రకటన చేయాలి

జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నగదు దొరికినట్టు వచ్చిన వార్తలపై కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ ఆందోళన వ్యక్తం చేశారు. వాస్తవ సంఘటనల గురించి లోక్‌సభలో ప్రసంగించాలని ఆయన కేంద్ర న్యాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌ను అభ్యర్థించారు. జీరో అవర్ సందర్భంగా మాట్లాడుతూ న్యాయపరమైన అవకతవకలకు సంబంధించిన నివేదికలు దేశవ్యాప్తంగా ఉన్న మనస్సాక్షిగల పౌరులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. నేరాన్ని నిర్ధారించడం చాలా తొందరగా జరిగిందని తివారీ నొక్కి చెప్పారు. న్యాయవ్యవస్థపై పార్లమెంటు పర్యవేక్షణ బాధ్యతను తివారీ ఎత్తి చూపారు. భారత ప్రధాన న్యాయమూర్తి అంతర్గత దర్యాప్తు ప్రారంభించారని, దాని ఫలితాల కోసం ఎదురు చూస్తున్నప్పుడు ఈ ప్రక్రియను గౌరవించడం ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. అయినప్పటికీ, న్యాయ మంత్రి సంఘటనల క్రమాన్ని సభకు సమర్పించాలని పట్టుబట్టారు. పార్లమెంటు తన రాజ్యాంగ పర్యవేక్షణ బాధ్యతను కొనసాగిస్తుందని ఆయన నొక్కి చెప్పారు.

సెన్సార్ వారి
ముండ్ల కంచెలు

'ఇదిగో సెన్సారోడా సినిమా లో నువ్వు చెప్పిన కటింగ్స్ అన్నీ చేస్తే ఇక మిగిలేది శుభం కార్డు మాత్రమే. ఏ పిచ్చోడైనా సినిమా హాలుకు వచ్చి, టిక్కెట్టు కొని అర్థంపర్థంలేని సినిమా చూస్తాడా?'


'అదంతా మాకనవసరం తల్లీ. పోలీసుల అఘాయిత్యం, నడి బజార్లో రౌడీల దందాలు, మానభంగాలు, అవినీతి బాగోతాలు ఇలా.. చూపిస్తే.. అబ్బే.. కుదరదంటే కుదరదమ్మా, సర్టిఫికెట్ ఇవ్వలేము.'

'మహాశయా, మీరు అభ్యంతర పెట్టిన సీన్లు ఇప్పటి దాక మీరు సర్టిఫికెట్లు ఇచ్చిన సినిమాల్లో లేవా? రెండర్థాల బూతు మాటలు, జుగుప్స కలిగే అర్ధనగ్న నత్యాలు, రక్తం ఏరులై పారే హింసాత్మక దశ్యాలు..అబ్బో ఇవన్నీ మీ రూల్స్ ప్రకారమే వున్నాయి కాబోలు. మా సినిమా అనేక అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్ లో ఎన్నో బహుమతులు పొందింది. ప్రశంసలు అందుకుంది. కానీ, మీ వల్ల థియేటర్లలో ఆడించటానికి అనుమతి పొందలేకపోతున్నది.'

'ఇక్కడ ఆ చర్చ అంతా వేస్ట్. సినిమా చూసే వాళ్ళకి ఏమి సందేశం పోతుంది అనేదే ముఖ్యం. ఏ ముస్లిం చక్రవర్తిని తిడుతూనో, హిందూ రాజును ఆకాశానికెత్తుతూనో సినిమా తీయి. చరిత్ర గురించి పట్టించుకోకు, దాని పాటికి దాన్ని వదిలేసి, నీ పాటికి నువ్వు సినిమా వండు. సెన్సార్ సర్టిఫికెట్ నిమిషాల్లో ఇప్పించే బాధ్యత నాది. ఇక్కడ వున్నది.. "ఆ" ప్రభుత్వం, తల్లీ. అర్థమయిందా? వారికి నచ్చితే, వారే నీ సినిమాకు జనాలను తోలి ప్రమోట్ చేస్తారు. '

'సంతోష్ ' హిందీ సినిమా బందానికి సెన్సార్ బోర్డు నుంచి దాదాపు ఇటువంటి చేదు అనుభవమే ఎదురైంది.

సినిమా గురించిన వివరాలలోకి వెళితే, 'సంతోష్' హిందీ సినిమా ను నిర్మించి, దర్శకత్వంవహించింది బ్రిటిష్ ఇండియాకు చెందిన సంధ్య సూరి. కథ కూడా ఆమెదే. సంధ్య సూరి తీసిన డాక్యుమెంటరీలు గాని, ఈ సినిమాగాని భారతదేశంలో పరిస్థితుల నేపథ్యం కనపడుతుంది. బ్రిటన్, ఇండియా, జర్మనీ, ఫ్రాన్స్ కు చెందినవారు ఈ సినిమాకు ఆమెతో పాటు సహ నిర్మాతలు. సినిమాలో నటించిన వారందరూ భారతీయులే. ముఖ్యపాత్ర సంతోష్ ను సుహానా గోస్వామి పోషించింది. ఆమె అనేక హిందీ సినిమాలలో కూడా నటించింది. లేడీ పోలీసు ఆఫీసరు గీతాశర్మగా సునీత రాజ్వార్ నటించారు.ఈ సినిమా ముఖ్య సన్నివేశాలు అన్నీ ఉత్తరప్రదేశ్ లక్నోలో 2023 ఆగస్టు- సెప్టెంబర్ లో చిత్రీకరించారు. అంతర్జాతీయంగా అనేక అవార్డులు, ప్రశంసలు అందుకున్న ఈ సినిమాను ఆస్కార్ అవార్డుల పోటీలో అధికారిక ఎంట్రీగా బ్రిటన్ ప్రభుత్వం ఎంపిక చేసింది. నిర్మాత, దర్శకురాలు అయిన సంధ్య సూరి భారతదేశ మూలాలుగల బ్రిటీష్ వనిత, నటీనటులందరూ భారతదేశపు నటులు. సినిమా హిందీలో తీయబడింది. అయినా మనవాళ్ళు ఈ సినిమాను చూడటానికి నోచుకోలేదు. కారణం మన సెన్సార్ బోర్డు వారు అడ్డంగా వేసిన వేసిన ముళ్ళ కంచె.



సర్టిఫికెట్ కావాలంటే పేజీల కొద్దీ మార్పులు, కత్తిరింపులు చేయాలని సెన్సార్ బోర్డు అంటున్నది. అవన్నీ చేస్తే మూల కథకే ఎసరు పడు తుందని దర్శకు రాలు అంటున్నారు. పాత్రల పేరు వల్ల కులం పేరు తెలుస్తుంది కనుక సినిమాలోని పాత్రల పేర్లను కూడా వేరేగా పెట్టండి అంటు న్నది బోర్డు. కత్తిరింపు లకు, పేర్ల మార్పులకు దర్శక, నిర్మాత అంగీకరించక పోవటంతో సినిమా హాల్స్‌లో ప్రదర్శనకు అనుమతి నిరాక రించింది సెన్సార్ బోర్డు. సర్టిఫికెట్ ఇవ్వకపోవటానికి ప్రధాన కారణం ఈ సినిమా కథ ఏలికలకు ఇబ్బంది కలిగిస్తుందని భావించటం..

ఈ 'సంతోష్' సినిమా కథ ఏమిటయ్యా అంటే, కథ మొత్తం ఉత్తర భారత దేశ సామాజిక నేపథ్యంలో నడుస్తుంది. కొత్తగా పెళ్లయిన 28 ఏళ్ల సంతోష్ భర్త పోలీస్ ఉద్యోగి. ఒకసారి జరిగిన మత ఉద్రిక్తతలలో అతను చంపబడతాడు. కారుణ్య నియామకం క్రింద ఆ పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం సంతోష్ కు వస్తుంది. డ్యూటీలో చేరిన వెంటనే ఒక దళిత యువతి రేప్ గురియై, హత్యచేయబడిన కేసును పరిశోధించే బందంలో పనిచేయవలసి వస్తుంది. లేడి పోలీసు ఇన్స్‌పెక్టర్ సునీత శర్మ ఈ కేసును విచారిస్తుంటుంది. ఈ క్రమంలో పోలీసుల భయానక క్రూరత్వం, క్రింది కులాలపై జరిగే లైంగిక అమానుషత్వం, ముస్లిం పట్ల ప్రభుత్వ సంస్థల ద్వేష పూరిత ధోరణి వీటన్నిటిని ఈ సినిమా ప్రస్తావించింది. ఇదిగో, ఈ కారణంగానే సెన్సార్ బోర్డు సినిమాకు అనుమతి ఇవ్వలేదు.

'భారతీయులకోసం తీసిన సినిమా భారతీయులకు చూపించలేకపోతే ఎట్లా? మరో మార్గం వెతకాలి' అంటున్నారు నిర్మాత సంధ్య సూరి.

ఇదే సినిమా ఓటిటి ప్లాట్ ఫామ్ MUBI లో అందుబాటులో ఉండగా, సినిమాహాల్స్ లో ప్రదర్శించటానికి అనుమతి నిరాకరించటంలో అర్థం ఏమయినా వుందా?

సినిమాలకు, కామెడీ షోలకు, కార్టూన్లకు భయపడే "ఆ" ప్రభుత్వం ఇదేనేమో? ఎందుకు ఈ చిన్నచిన్న వాటికే భయపడుతున్నామని ప్రభుత్వ నేతలు ఆత్మశోధన చేసుకుంటే తాము చేసిన, చేస్తున్న తప్పేమిటో తెలుస్తుంది. అది దేశానికి ఉపయోగపడుతుంది, తమ నీడను చూసి తామే భయపడే బాధా తప్పుతుంది.

సాగు, తాగునీటి సమస్యల్ని పరిష్కరించండి

వాటిపైనే జీరో అవర్‌లో ప్రధాన ప్రస్తావన

గంటా 43 నిమిషాల్లో 52 మందికి అవకాశం

ఆర్టీసీలో సమ్మెను నివారించండి : కూనంనేని

హైవేలపై ట్రామాకేర్ సెంటర్లు పెట్టాలి : హరీశ్‌బాబు

బెల్టు షాపులు మూసేయించండి : కొత్త ప్రభాకర్‌రెడ్డి

గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచండి..

పెండింగ్ బకాయిలు చెల్లించండి : బీర్ల ఐలయ్య, అనిల్‌కుమార్‌రెడ్డి





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శాసనసభలో గురువారం జరిగిన జీరో అవర్‌లో సభ్యులు సాగు, తాగునీటి సమస్యల్నే ప్రధానంగా ఎత్తిచూపారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయంచాలనీ, కాలువల్లో పూడిక తీయించిన చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రధానంగా విన్నవించారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సూటిగా ఒకటెండ్రు అంశాలే చెప్పాలనీ, ప్రసంగాల్లోకి వెళ్లొదని స్పీకర్ ప్రసాద్ కుమార్ ముందే నిర్మోహమాటంగా చెప్పారు. దీంతో గంటా 43 నిమిషాల పాటు సాగిన జీరో అవర్‌లో అన్ని పక్షాలకు చెందిన 52 మంది సభ్యులకు మాట్లాడే అవకాశం దక్కింది. సీపీఐ శాసనసభాపక్షనేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ..లక్షల కోట్ల రూపాయల ఆస్తులున్న ఆర్టీసీ సంస్థను కాపాడుకోవాలనీ, ఆ సంస్థలో కార్మిక సంఘాలకు అనుమతిచ్చి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వానికి సూచించారు. అరకొర జీతాలతో గ్రామాల్లో సేవలందిస్తున్న పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలివ్వాలనీ, వారికి ఇవ్వాల్సిన పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని కాంగ్రెస్ సభ్యులు బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆశాలు, అంగన్‌వాడీల జీతాలు పెంచాలని బీఆర్‌ఎస్ సభ్యులు కృష్ణమోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బీజేపీ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సగటున రోజుకు 70 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయనీ, 20 మంది చనిపోతున్నారని సభాదృష్టికి తెచ్చారు. గోల్డెన్ అవర్‌లో ప్రమాదబాధితులను ఆస్పత్రులకు తీసుకెళ్తే బతికే అవకాశం ఎక్కువ ఉంటుందనీ, వీలైనంత మేరకు ఎక్కువ స్థాయిలో జాతీయ రహదారులపై ట్రామాకేర్ సెంటర్లను పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బోధన్ చక్కెర కర్మాగారాన్ని తెరిపించాలని కాంగ్రెస్ సభ్యులు సుదర్శన్‌రెడ్డి కోరారు. ఉప్పల్ ఫ్లైఓవర్ త్వరగా పూర్తిచేయాలనీ, దాని కింద ఉన్న సర్వీస్ రోడ్లను బాగు చేయించాలని బీఆర్‌ఎస్ సభ్యులు బి. లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఫార్మాసిటీ, టీఎస్ఐఐసీ, టీజీ మొబిలిటీ వ్యాలీ కోసం భూములిచ్చిన రైతులకు గుంట చొప్పున ఇంటి జాగాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రోడ్ల పక్కనుండే హ్యాకర్ల జీవనోపాధిపై హైడ్రా, పోలీసు, జీహెచ్ఎంసీ అధికారులు దాడిచేసి పొట్టగొట్టడం తగదన్నారు. బీజేపీ సభ్యులు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ..గ్రామాల్లో వడ్డీ వ్యాపారులపై పోలీసుల దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ సభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ ..శ్రీరామనవమి భద్రాద్రి ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్, సభ్యులందరూ రావాలని సభ నుంచి ఆహ్వానం పలికారు. భద్రాచలం రామాలయానికి పాలకమండలిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్‌ఎస్ సభ్యులు దానం నాగేందర్ మాట్లాడుతూ ..ఓవర్సీస్ స్కాలర్‌షిప్పులు త్వరగా విడుదల య్యేలా చూడాలని సూచించారు. గ్రామాల్లో కుటుంబాలు ఛిద్రం కావడానికి ప్రధాన కారమైన బెల్టుషాపులను మూసేయంచాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారనీ, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బీఆర్‌ఎస్ సభ్యులు కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు.

జీరో అవర్‌లో తనకు అవకాశం రాగానే బీఆర్‌ఎస్ సభ్యులు, మాజీ మంత్రి మల్లారెడ్డి లేచి..'అధ్యక్షా నేను రెండు ముచ్చట్లు చెబుతా..ముందు ప్రభుత్వానికి రూ.1100 కోట్ల ఆదాయం వచ్చేది ముందు చెప్పనా? నా నియోజకవర్గ సమస్య ముందుచెప్పానా?' స్పీకర్‌ను అడగటంతో సభ్యులందరూ నవ్వారు. తన నియోజకవర్గంలో 13 మున్సిపాల్టీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయొద్దని కోరారు. 'అధ్యక్షా..ఇగ రూ.1100 కోట్ల ఆదాయం వచ్చే ముచ్చట చెబుతున్నా...'అంటుండగానే 'ఎవ్వరైనా ఒకటే ప్రశ్నకు పరిమితం కావాలని చెప్పా' అంటూ స్పీకర్ మైక్ కట్ చేశారు. 'అరె సర్కార్‌కు ఆదాయం వచ్చే ముచ్చట చెబుతా అంటుంటే...' అని అలాగే మాట్లాడుతుండటంతో కేటీఆర్ వారించి కూర్చోమన్నారు.

తన నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో రేషన్ బియ్యం మాఫియాకు అడ్డుకట్ట లేకుండా పోతున్నదనీ, ప్రశ్నించేవారిని చంపుతామంటూ బెదిరిస్తున్నారని బీజేపీ సభ్యులు పైడి రాకేశ్‌రెడ్డి సభా దృష్టికి తీసుకొచ్చారు. తన నియోజకవర్గం నుంచి రోజూ 8 టన్నుల బియ్యం మహారాష్ట్రకు తరలిపోతున్నదనీ, తిరిగి అదే ప్రాసెస్ అయ్యి మార్కెట్ రూ.40-50కి అమ్ముతున్నారని ఎత్తిచూపారు. వేలాది కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయనీ, దీనివెనుక రాజకీయ నాయకుల హస్తం ఉందని ఆరోపించారు. ఉగాది నుంచి సన్నబియ్యం ఇస్తే ఈ మాఫియా ఆగడాలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దయచేసి బియ్యం అమ్ముకునేటోళ్లకు రేషన్‌కార్డులను ఇవ్వొద్దని సర్కారుకు విన్నవించారు.

వచ్చే డిసెంబర్‌లోగా 'దేవాదుల' పూర్తి

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

వచ్చే డిసెంబర్‌లోగా దేవాదుల ప్రాజెక్టు అన్ని దశలు, పంపింగ్‌స్టేషన్లు పూర్తి చేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం హన్మకొండ జిల్లా దేవన్నపేట పంప్‌హౌజ్‌ను సందర్శించి 'దేవాదుల' మూడో దశ మూడో ప్యాకేజీలోని ఒక్క మోటర్‌ను ఆన్‌చేశారు. ఈ మోటర్‌తో 600 క్యూసెక్కుల నీటిని ధర్మసాగర్ రిజర్వాయర్‌కు తరలించే ప్రక్రియ ప్రారంభమైంది. అనంతరం మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. ధర్మసాగర్ రిజర్వాయర్‌ను సందర్శించి మోటర్ ద్వారా వస్తున్న గోదావరి జలాలను తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. మరో 15 రోజుల్లో దేవన్నపేటలోని రెండో మోటర్‌ను కూడా ప్రారంభించి ధర్మసాగర్‌కు గోదావరి జలాలను తరలించనున్నట్టు చెప్పారు. రాజవరంలోని పంపింగ్ స్టేషన్‌ను సైతం త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి పూర్తి ఆయకట్టుకు సాగునీరందిస్తామని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టుతోపాటు మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేయనున్నట్టు చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరందించడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.



మంత్రుల రాకతో ట్రిప్పయిన మోటర్

మరమ్మతులు చేసి మళ్లీ రన్ చేసిన ఇంజినీర్లు

ఇందిరమ్మ ప్రభుత్వంలోనే సాగునీరు : మంత్రి పొంగులేటి

ఇందిరమ్మ ప్రభుత్వంలో ప్రారంభించిన దేవాదుల ప్రాజెక్టును మళ్లీ ఇందిరమ్మ ప్రభుత్వంలోనే ఇప్పుడు సాగునీరందిస్తున్నామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గత పదేండ్లలో నాటి పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా ఆగిపోయిన ప్రాజెక్టు పనులను మళ్లీ ప్రారంభించి ఆలస్యమైనా సాగునీరందించి పంటలను కాపాడే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదని అన్నారు. విలేకరుల సమావేశంలో వర్ధన్నపేట, పాలకుర్తి ఎమ్మెల్యేలు కెఆర్ నాగరాజు, యశస్వినిరెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ఝాన్సీరెడ్డి, హన్మకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, నీటిపారుదల శాఖ సిఇ అశోక్, ఎస్ఇ వెంకటేశ్వర్లు, ఇఇ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల రాక నేపథ్యంలో ట్రిప్పయిన మోటర్లు

దేవన్నపేట పంప్‌హౌజ్‌లో ఆస్ట్రియా దేశానికి చెందిన 'ఆండ్రిట్జ్' కంపెనీ ఇంజనీర్ల బృందం గురువారం వేకువజామున 3.30 గంటల ప్రాంతంలోనే మోటర్‌ను రన్ చేయించి ధర్మసాగర్ రిజర్వాయర్‌కు గోదావరి జలాలను తరలించింది. ఈ నేపథ్యంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి సాయంత్రం దేవన్నపేట పంప్‌హౌజ్‌ను సందర్శించి మోటర్‌ను స్విచాన్ చేసే కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 4.30 గంటలకు మంత్రులు హెలిప్యాడ్‌లో దిగి దేవన్నపేట పంప్‌హౌజ్‌కు చేరుకోగానే మోటర్ ట్రిప్ అయి ఆగింది. 30 నిమిషాలపాటు ఆస్ట్రియా ఇంజినీర్ల బృందం 144.50 మీటర్ల లోతున్న పంప్‌హౌజ్‌లోకి దిగి మోటర్లను మరమ్మతులు చేసి మళ్లీ ఆన్ చేయడంతో మోటర్ రన్ అయి గోదావరి జలాల తరలింపు పునఃప్రారంభమైంది. దాంతో మంత్రులు ధర్మసాగర్ రిజర్వాయర్ వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు.



విద్యారంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయించాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి

నవతెలంగాణ భూపాలపల్లి

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి బడ్జెట్‌లో 15శాతం కేటాయించాలని, ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి డిమాండ్ చేశారు. గురువారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నక్క తిరుపతి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రాథమిక పాఠశాలల బలోపేతం కోసం ప్రత్యేక కేంద్రీకరణ జరగాలన్నారు. పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించి, ప్రతి తరగతికి ఒక టీచర్ చొప్పున ఐదుగురు టీచర్లు, ఒక హెచ్ఎం ఉండేలా తెలుగు, ఇంగ్లీష్ మీడియంలను సమాంతరంగా నిర్వహించాలని తెలిపారు. పాఠశాలల పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారంలో విఫలమైందన్నారు. పెండింగ్ బిల్లులు, బకాయిపడిన నాలుగు వాయిదాల డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. పీఆర్సీ నివేదిక తెప్పించుకుని సంఘాలతో చర్చించి అమలు చేయాలని, ఆరోగ్య సంరక్షణ పథకం అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. వేసవిలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త కుమారస్వామి, ఉపాధ్యక్షులు మార్త రాజేందర్, తోట రమ, కోశాధికారి తిరుపతయ్య, జిల్లా కార్యదర్శి ఎస్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అది మా విధానం కాదు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'కక్ష పూరిత రాజకీయాలు మా విధానం కాదు..మేం అలా చేస్తే.. కేటీఆర్ ఇప్పటికే చంచల్‌గూడ జైల్లో ఉండేవారు.. అనుమతి లేకుండా ఎవరైనా డ్రోన్ ఎగరవేస్తే రూ.500 జరిమానా విధిస్తారు. కానీ, డ్రోన్ ఎగరవేశారని ఒక ఎంపీ మీద కేసు పెట్టి చర్లపల్లి జైలులో వేశారు. నా బిడ్డ పెండ్లికి కూడా మధ్యంతర బెయిల్‌పై వచ్చి వెళ్లాను. కేసీఆర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను జైల్లో వేయాలని చాలా మంది మమ్మల్ని అడుగుతున్నారు. బీఆర్‌ఎస్ నేతల మాదిరిగా అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపే వ్యక్తిని కాదు నేను" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు సీఎం స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'రాజకీయ కక్ష సాధింపు ఎవరిది? మీదా? నాదా?.. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎంపీగా ఉన్న నన్ను చర్లపల్లి జైల్లో ఉంచి చిత్రహింసలకు గురి చేశారు. నక్సలైట్లు, దేశ ద్రోహులు ఉండే డిటెన్షన్ సెల్‌లో పార్లమెంట్ సభ్యుడినైన నన్ను వేశారు. నేను పడుకోకుండా రాత్రిళ్లు లైట్లు వేశారు. జైల్లో 16 రోజులు నిద్రలేని రాత్రులు గడిపా. నా బిడ్డ లగ్నపత్రిక రాసుకోవడానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. అయినా నేను కేసీఆర్ కుటుంబంపై ఏనాడూ.. ఎలాంటి రాజకీయ కక్ష చర్యలకు పాల్పడలేదు. వారిని జైలుకు పంపుతానన్న హామీని కూడా నెరవేర్చలేదు. ఎవరివి కక్ష సాధింపు చర్యలో తెలంగాణ సమాజం గమనిస్తోంది' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్ అంటూ నిత్యం మాట్లాడుతూనే అయన కుర్చీ మీద కుటుంబ సభ్యులు కన్నేశారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'పెద్దాయనను ఖతం చేసే స్కీం నడుస్తోంది నేపాల్ రాజు దేవేంద్ర అధికారం కోసం ఏకే 47 గన్‌తో ఎనిమిది మంది కుటుంబ సభ్యులను హతమార్చారు. అలాంటి పరిస్థితులు తెలంగాణలో ఉత్పన్నమవుతాయేమోనని భయంగా ఉంది. నాలుగు ఇంగ్లీషు ముక్కలు మాట్లాడితేనే జ్ఞానమా?" అంటూ బీఆర్‌ఎస్‌పైనా, కేటీఆర్‌పైనా రేవంత్ నిప్పులు చెరిగారు. రైతుల భూములను బలవంతంగా గుంజుకున్నది బీఆర్‌ఎస్ సర్కారేనని గుర్తు చేశారు. తాము మాత్రం భూ నిర్వాసితులకు దేశంలోనే అత్యుత్తమమైన ప్యాకేజీ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కమీషన్ల కోసం రూ.36 వేల కోట్ల ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు అంచనాలను రూ.1.50 లక్షల కోట్లకు పెంచారని విమర్శించారు. ప్రాజెక్టులు కట్టిన చోటల్లా కేసీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్‌ఎస్ నేతలు ఫాంహౌస్‌లు, భూములు కొన్నారని ఆరోపించారు. ఈ విషయమై కాంగ్రెస్ సభ్యులు కాకుండా ఇతర పార్టీల వారితో నిజనిర్ధారణ కమిటీకి ఒప్పుకుంటారా? అని ప్రశ్నించారు. విద్యుత్ కొనుగోళ్లు, ప్రాజెక్టుల నిర్మాణంలో వేల కోట్ల అవినీతి జరిగిందని విచారణ కమిషన్లు తేల్చాయని అన్నారు. ఆయా కేసుల్లో బాధ్యులు జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు.

మైట్రో రైల్ ఘటన నిందితుడిని శిక్షించాలి

- ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.అరుణజ్యోతి, మల్లు లక్ష్మి



నవతెలంగాణ-బేగంపేట

ఎంఎంటీఎస్ రైల్లో యువతిపై లైంగికదాడికి యత్నించిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కెన్ ఆశాలత ప్రభుత్వాన్ని కోరారు. సికింద్రాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని, తల్లిదండ్రులను గురువారం వారు పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. రాత్రి సమయంలో ఖాళీగా వెళ్తున్న ఎంఎంటీఎస్ రైళ్లలో ఆకతాయిలు ఒంటరిగా ఉన్న అమ్మాయిలను వేధింపులకు గురిచేస్తున్నారని, ఇలాంటి ఘటనలు ఆరేడు నెలలుగా జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్రో రైల్ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు, అమ్మాయిలకు ఇంట్లో, బయటా భద్రత కరువైందని, ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం రైల్వేలలో సీసీ కెమెరాలు పెట్టాలని, మహిళలను వేధింపులకు గురిచేసినప్పుడు రైలు ఆగడానికి ఒక బటన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మెట్రో రైల్ బాధితురాలి తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుని బతుకుతున్నారని, అమ్మాయికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీఎంవి కక్ష సాధింపు చర్యలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"పాలనంటే పంచ్ డైలాగులు చెప్పడం కాదు. రాష్ట్రంలో ఏ గ్రామంలోనైనా వంద శాతం రుణమాఫీ జరిగితే రాజకీయాలనుంచి శాశ్వతంగా తప్పుకుంటా. ఎవరు ఏమనుకున్నా.... తెలంగాణ జాతిపిత కచ్చితంగా కేసీఆరే.. బూతుపిత మాత్రం రేవంత్‌రెడ్డే. ముఖ్యమంత్రికి ఎవరో ఏకే47 గురించి చెప్పారు. ఎవరో కాల్చి చంపారంట? ఏకే47తోపాటు తుపాకుల గురించి ఆయనకు తెలిసినంత మాకు తెలియదు. తెలంగాణ ఉద్యమంలో ప్రజల మీదకు తుపాకి తీసుకుపోయిన రైఫిల్ రెడ్డి ఆయన. అసలు ఎవరు ఎవర్ని చంపి అధికారం లాక్కున్నారు..? పాపం పాత కాంగ్రెసోళ్లను అందర్నీ ఖతం చేసి వాళ్ల పదవిని లాక్కున్న రేవంత్ ఇవాళ మమల్ని అంటే ఎలా..?' అని బీఆర్‌ఎస్ సభ్యులు కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా గురువారం అసెంబ్లీలో కేటీఆర్ మాట్లాడుతూ... అట్టర్ ఫ్లాప్ సినిమాకు అట్టహాసంగా శత దినోత్సవం చేసినట్టు కాంగ్రెస్ ఏడాది పాలనపై విజయోత్సవాలు నిర్వహించారంటూ ఎద్దేవా చేశారు. రేవంత్ తన ఏడాది పాలనలో ఆరు గ్యారెంటీలు, తులం బంగారం, రుణమాఫీ, రైతుబంధు పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. కొండారెడ్డి పల్లి నుంచి కొడంగల్ దాకా ఏ ఒక్క ఊర్లోనైనా 100శాతం రుణమాఫీ అయిందని నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు. 'ఇంత ఫ్రస్టేషన్, ఆవేశం, వ్యక్తిగత విమర్శలు, తిట్ల దండకం అందుకున్న సీఎంను నా జీవితంలో చూడలేదు. మీవల్ల రాబోయే 20 ఏండ్లు కాంగ్రెస్‌కు ఓటేయ్యాలంటే ఎవరైనా భయపడే పరిస్థితి తెలంగాణ మొత్తంలో వస్తున్నది. మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానాలో ఎన్నికల ప్రచారం చేశారు. అద్భుతాలు సాధించారు. 'ఓ స్త్రీ రేపు రా' మాదిరి కాంగ్రెస్ పాలన ఉంది. ముఖ్యమంత్రిలో ఒక అపరిచితుడు ఉన్నాడు. మొన్న రవీంద్ర భారతిలో మాట్లాడుతూ.. మమ్మల్ని ఎవరూ నమ్మటం లేదు.. మనకు అప్పు పుడతలేదు.. దివాళ తీసినం.. అని మాట్లాడిండు. ఇక్కడేమో రూ. లక్షా 58 వేల కోట్ల అప్పు చేశానని రొమ్ము విరుచుకుని చెబుతున్నారు.. ఆయన కరెక్టా.. ఈయన కరెక్టా.. రామునా.. రెమోనా.. ఎవరు కరెక్టో తెలుస్తలేదు" అని కేటీఆర్, సీఎంపై సెటైర్లు విసిరారు. తెల్లారి లేస్తే ప్రజాపాలన అంటారు, కానీ నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉందో.. మీ ప్రజా పాలనలో ప్రజాస్వామిక స్ఫూర్తి కూడా అంతే ఉందని విమర్శించారు. హరీశ్‌రావు మీద పెట్రోల్ పోసి చంపేస్తానని ఓ కాంగ్రెస్ నాయకుడు అంటే ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. చిన్న మాటంటే బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హామీలను అమలు చేయలేక అడ్డగోలుగా మాట్లాడుతున్న కాంగ్రెస్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

న్యాయవాదుల సంఘాలతో సీజేఐ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

చర్చించారు. వారి డిమాండ్లను పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. జస్టిస్ వర్మ బదిలీకి సంబంధించి తమ డిమాండ్‌ను పరిశీలిస్తానని ప్రధాన న్యాయమూర్తి హామీ ఇచ్చారని అలహాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారీ తెలిపారు. నిరవధిక సమ్మెను కొనసాగించాలా లేక విరమించాలా అనే విషయాన్ని పున్నపరిశీలిస్తామని చెప్పారు. అంతకుముందు వివిధ బార్ అసోసియేషన్ల నేతలు సీజేఐ కార్యాలయంలో మెమొరాండం సమర్పించారు. జస్టిస్ వర్మను బదిలీ చేయాలన్న కొలీజియం సిఫార్సును ఉపసంహరించుకోవాలని అందులో కోరారు. అలహాబాద్, గుజరాత్, కేరళ, జబల్పూర్, కర్నాటక, లక్నో హైకోర్టులకు చెందిన బార్ అసోసియేషన్ల నాయకులు ఈ మెమొరాండంపై సంతకాలు చేశారు. జస్టిస్ వర్మ అధికారిక నివాసంలో జరిగిన ఘటనపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఇప్పటి వరకూ ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు.

ఇదిలావుండగా ఢిల్లీ పోలీసులు బుధవారం జస్టిస్ వర్మ నివాసంలోని స్టోర్‌రూమ్‌కు సీలు వేశారు. ఆ ప్రాంగణాన్ని వీడియో తీశారు. డీసీపీ దేవేష్ మహ్లా నేతృత్వంలోని పోలీసు బృందం సుమారు రెండు గంటల పాటు అక్కడే గడిపింది. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించింది. జస్టిస్ వర్మ కుటుంబ సభ్యులతో, ఆయన వ్యక్తిగత కార్యదర్శితో మాట్లాడింది. కాగా జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని బెంచ్ అంగీకరించింది. పిటిషన్‌పై వెంటనే విచారణ చేపట్టాలని న్యాయవాది మాథ్యూస్ నెడుంపర కోరగా పిటిషన్‌ను లిస్ట్ చేశామని, విచారణ తేదీని రిజిస్ట్రీ నుండి తెలుసుకుంటానని ఖన్నా తెలిపారు. జస్టిస్ వర్మ నివాసంలో పెద్ద మొత్తంలో నగదు లభించినందున ఈడీ, ఆదాయపన్ను శాఖ విచారణ జరిపేలా ఆదేశించాలని కోరుతూ మరో పిటిషన్ కూడా దాఖలైంది.

ముదురుతున్న ఎండలు



(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఈ మేరకు ఆ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికను జారీ చేశారు. ఉక్కపోత కూడా తీవ్రమైంది.

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు	
ఆదిలాబాద్	41 డిగ్రీలు
నిజామాబాద్	41 డిగ్రీలు
మహబూబ్‌నగర్	39 డిగ్రీలు
భద్రాచలం	39 డిగ్రీలు
ఖమ్మం	38.8 డిగ్రీలు
రామగుండం	38.4 డిగ్రీలు
మెదక్	38.3 డిగ్రీలు

ముగింపు రోజూ మాటల యుద్ధం..

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో ఆయన తన 'కుటుంబంలో మాత్రం కారుణ్య నియామకాలు' చేపట్టారంటూ రేవంత్ దుయ్యబట్టారు. తాను ప్రతీకార రాజకీయాలకు పాల్పడటం లేదనీ, అలాంటి ఉద్దేశమే తనకుంటే కేటీఆర్ ఇప్పటికే చంచల్‌గూడ జైల్లో ఉండేవారంటూ వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో డ్రోన్లు ఎగరేశాననే కారణంతో తనను జైల్లో పెట్టారని సీఎం వాపోయారు. ఆఖరుకు తన బిడ్డ పెండ్లికి కూడా తాను జైలు నుంచే రావాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిగా కేటీఆర్ మాట్లాడుతూ...'మీకే కుటుంబం, మీకే కుటుంబ సభ్యులున్నారా? మాకు లేరా? మీ ఇంటిపైన ఇప్పుడు డ్రోన్లు ఎగరేస్తే ఊరుకుంటారా? అప్పట్లో మా ఇంట్లోని చిన్న పిల్లలను సైతం వదలకుండా తిట్టి పోశారు కదా..?' అని ఎదురు ప్రశ్నించారు. ఈ రకంగా సీఎం రేవంత్, కేటీఆర్ ఇద్దరూ ప్రభుత్వాల విధానాలను ఏకరువు పెడుతూనే వ్యక్తిగత విమర్శలకు దిగారు. ఈ క్రమంలో వారి వాగ్యుద్ధం తారాస్థాయికి చేరింది. మధ్యలో మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి జోక్యం చేసుకుని బీఆర్‌ఎస్‌పై ఎదురుదాడికి దిగారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

నవతెలంగాణ - చంపాపేట్

చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ పరిధి లోని శ్రీ చైతన్య పాఠశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు సర్టిఫికేట్స్, మెడల్స్‌ను బహుకరించారు. అనంతరం పిల్లలు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సతీష్, ఆర్.ఐ. రవీందర్ రెడ్డి, ప్రైమరీ కో ఆర్డినేటర్ కామేశ్వరి, ప్రిన్సిపాల్ ఫణిమాధవి, వైస్ ప్రిన్సిపాల్ సుందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.




తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ-కొత్తపేట

చైతన్యపురిలోని సాయి నగర్ కాలనీ శివాలయం పక్కన భారీ చెట్టు కుప్పకూలింది. కానీ అక్కడ చెట్టు కూలిన సమయంలో దారిలో ఎవరు లేరు. ఎలాంటి ప్రమాదం కూడా జరగలేదు. వెంటనే అప్రమత్తమైన పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలాన్ని చేరుకొని చెట్టును తొలగించారు.



సీఎంను కలిసిన
ఎమ్మెల్యే, గడ్డి అన్నారం మార్కెట్ చైర్మెన్



నవతెలంగాణ-ఎల్బీనగర్

సీఎం రేవంత్ రెడ్డిని అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో గురువారం సాయంత్రం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ చైర్మెన్ చిలక మధుసూదన్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత కోహెడలో ఏర్పాటు చేయబోయే నూతన మార్కెట్‌పై చర్చించారు. గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక మధుసూదన్ రెడ్డి మార్కెట్ నిర్మాణం గురించి వివరించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందిస్తూ సంబంధిత ఉన్నత అధికారులను పిలిచి, కోహెడ మార్కెట్‌కి సంబంధించిన పరిపాలన అనుమతులు వేగవంతం చేయాలని ఆదేశాల ఇచ్చారు. త్వరలో ఈ ప్రాజెక్ట్‌పైన సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కోహెడలో ఏర్పాటు చేయబోయే సమీకృత మార్కెట్ దేశంలోనే ఆదర్శంగా ఉండేలా చూడాలని అన్నారు. సీఎంను కలిసిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్ రావు, సిఎం ఓఎస్డీ చంద్రశేఖర్ రెడ్డి తో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

'ప్లాట్ల యజమానులను
భయాందోళనలకు గురిచేస్తున్న కొందరు వ్యక్తులు'



నవాతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ 22వ వార్డు సర్వే నెంబర్ 240లోని భూమి తమదంటూ కొందరు వ్యక్తులు తమను బెదిరిస్తున్నారని స్థానిక ప్లాట్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. కమ్మగూడ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఇళ్లు, ప్లాట్ల యజమానులు గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 240, 241 సర్వే నెంబర్లలో 61 ఎకరాల భూమిలో 30 ఏళ్ల క్రితమే 18 వెంచర్లు ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుంచి అనేకమంది ఆయా వెంచర్లలో ప్లాట్ల క్రయ, విక్రయాలు జరుగుతున్నాయన్నారు. శివాజీనగర్, అన్నపూర్ణ కాలనీ, కల్యాణ వెంకటేశ్వరస్వామి కాలనీ వంటి కాలనీల్లో ప్రజలు ఇళ్లు నిర్మించుకొని నివాసముంటున్నారన్నారు. కాగా ఇటీవల కొందరు వ్యక్తులు సర్వే నెంబర్ 240లోని 10.09 ఎకరాల భూమి తమదంటూ వస్తున్నారని తెలిపారు. ఇన్నాళ్లు కేసుల్లో ఉన్న భూమి విషయంలో కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినట్లు చెబుతూ భయానికి గురిచేస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. 10ఎకరాల స్థలం తమదంటూ కొందరు వ్యక్తులు కబ్జాచేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని ఆయా ప్లాట్ల యజమానులు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య, ప్లాట్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకలు అందజేత



నవతెలంగాణ-మీర్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్ తన స్వంత ఖర్చుతో ముస్లిం మహిళలకు గురువారం రంజాన్ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు అభివృద్ధి బాటలు వేస్తూ అన్ని వర్గాలతో మమేకమై సమభావంతో ముందుకు వెళ్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డిని ఆదర్శంగా తీసుకొని సేవ కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లెలగూడ మాజీ ఎంపీటీసీ ఏనుగుల అనిత యాదవ్ సౌజన్యంతో ముస్లిం మైనారిటీ మహిళలకు రంజాన్ కానుకలు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ తాజా మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, కార్పొరేటర్లు సిద్దాల లావణ్య బీరప్ప, దోమలపల్లి ధనలక్ష్మి రాజ్ కుమార్, ఉయ్యాల నవీన్ గౌడ్, సిద్దాల పద్మా అంజయ్య, మాజీ కోఆప్షన్ సభ్యులు రజాక్, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు జమాల్ పూర్ సునీత బాల్ రాజ్, మాజీ టెంపుల్ డైరెక్టర్లు మేకల యాదగిరి, బొమ్మర బోయిన యాదగిరి ముదిరాజ్, జ్ఞానేశ్వర్ చారి తదితరులు పాల్గొన్నారు.

శుభోదయం కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా



కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి

నవతెలంగాణ-చంపాపేట్

శుభోదయం కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం రూ.1కోటి 78లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1కోటి 50లక్షలతో కర్మన్‌ఘాట్ రేణుక ఎల్లమ్మ దేవాలయం నుండి వైయస్సార్ విగ్రహం వరకు స్టామ్ వాటర్ డ్రైన్స్ పనులను (వరదనీటి కాలువ పనులు) త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. స్థానిక సమస్యలు ఏమైన ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సురేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏ శేఖర్, బీజేపీ చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి రవీందర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల భూములను ఆక్రమించిన
'రామోజీ' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



- ఆక్రమించిన పేదల భూములు తిరిగి వారికి దక్కేవరకూ పోరాటం
- పోలీసుల అత్యుత్సాహం మానుకొని పేదల పక్షాన నిలబడాలి
- లాఠీ చార్జీలు, నిర్బంధాలు, అరెస్టులు కమ్యూనిస్టులకు కొత్తమి కాదు
- అప్రజాస్వామిక అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం :సీపీఐ (ఎం)

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

రామోజీ ఫిలిం సిటీ ఆక్రమించిన పేదల భూములు తిరిగి వారికి దక్కే వరకూ సీపీఐ(ఎం) పోరాడుతుందని ఆ పార్టీ మండలం కార్యదర్శి నర్సింహ అన్నారు. పేదల ప్లాట్స్ ఆక్రమించిన రామోజీ ఫిలింసిటీ తిరిగిచ్చేయాలంటూ సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వేస్లీ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య నేతృత్వంలో వందలాది మందితో బుధవారం రామోజీ ఫిలిం సిటీ ముట్టడి కార్యక్రమం చేపట్టిన విషయం విధితమే. ఈ సందర్భంగా బాధితులకు, పోలీసులకు మధ్య కొద్ది సేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భూములు కోల్పోయిన బాధితులు ప్రజాస్వామ్య బద్ధంగా రామోజీ ఫిలిం సిటీలో ప్రజా పోరాటం చేస్తుంటే పోలీసులు ఆధిపత్య భూస్వాములకు అనుకూలంగా వ్యవరించిన తీరు బాధాకరంగా ఉందంటూ పోలీస్‌ల తీరును ఖండిస్తూ గురువారం అబ్దుల్లాపూర్ మెట్ మండలం కేంద్రంలో సీపీఐ (ఎం) మండల కార్యదర్శి నర్సింహ మాట్లాడారు. పేదల భూములు లాక్కున్న రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం తిరిగి పేదలకు ఇవ్వాలంటూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటం చేస్తే పోలీసులు అత్యుత్సాహంగా వ్యవరిస్తూ రామోజీ ఫిలిం సిటీ సంస్థకు వత్తాసు పలకడం ఎంత వరకు న్యాయమన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజా స్వామ్యంలో ప్రజల పక్షాన పోలీసులు నిలబడాలన్నారు. భూస్వాములు, పెట్టిదారుల పక్షాన కాదన్నారు. పేదల స్థలాలు లాగుకున్న రామోజీ ఫిలిం సిటీ సంస్థ తిరిగి వారికి ఇవ్వకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భూ పోరాటంలో కమ్యూనిస్టులకు పోలీస్ లాఠీలు, కేసులు, జైళ్లు, నిర్బంధాలు కొత్తేమి కాదన్నారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా పేదల సమస్యల పరిస్కారంలో కమ్యూనిస్టులు వెనకడుగు వేసేది లేదన్నారు. ఈ కార్యక్రమం సీపీఐ (ఎం) నాయకులు గుండె శివ కుమార్, ముత్యాలు, శ్రీనివాస్, ప్రణయ్, శివ శంకర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-తుర్కయంజాల్

పేదల, ప్రభుత్వ భూములను ఆక్రమించిన రామోజీ యాజమాన్యంపై చట్టపరమైన కేసులు పెట్టాలని, పట్టాలు పొందిన పేదలకు వెంటనే ఇండ్ల స్థలాలు చూపించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిన్న పట్టాలు పొందిన నిరుపేదలంతా వాళ్ళ వాళ్ళ ఇండ్ల జాగాల్లోకి శాంతియుతంగా వెళ్తున్న సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీపై, జిల్లా నాయకులపై, నిరుపేదలపై ప్రభుత్వ అండదండలతో పోలీసులు సాగించిన నిర్బంధకాండను, అక్రమ కేసులను తీవ్రంగా ఖండిస్తూ సీపీఐ(ఎం) తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కార్యదర్శి డి. కిషన్ మాట్లాడుతూ రామోజీ ఫిలిం సిటీ దగ్గర ప్రభుత్వ భూములలో నాగన్‌పల్లి, పోల్కంపల్లి, రాయపోల్, ఏనుగల్ గూడ, ముకునూరు గ్రామాలకు చెందిన సుమారు 600 మంది నిరుపేదలకు 60 గజాల చొప్పున 2007వ సంవత్సరంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో సుమారు 20 ఎకరాల్లో లేఅవుట్ చేసి పట్టాలు ఇచ్చారని గుర్తుచేశారు. అప్పటినుండి ఈ నిరుపేదలు ఆ భూమిలో ఇండ్లు నిర్మించుకుందామనే ప్రయత్నం ఎప్పుడు చేసినా రామోజీ యాజమాన్యం అడ్డుపడిందని, అంతేకాకుండా అక్రమంగా ప్రహరీ గోడ నిర్మించి నిరుపేదలను తమ ఇంటి స్థలాల్లోకి రానివ్వకుండా ఇబ్బందులు పెట్టిందని ఆరోపించారు. ఇంత నగ్నంగా రామోజీ యాజమాన్యం గత 18 సంవత్సరాలుగా వందలాదిమంది నిరుపేద కుటుంబాల ప్రజలను ఇబ్బందులు పెడుతుంటే, ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా కబ్జా చేస్తుంటే పాలకవర్గాలు కళ్లప్పగించి చూస్తున్నాయే తప్ప రామోజీ యాజమాన్యంపై మాత్రం ఎలాంటి చర్యలకు పూనుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నిరుపేదలకు కేటాయించిన ప్రభుత్వ భూమిలోని ఇళ్ల స్థలాల్లో ప్రభుత్వమే నేరుగా ఇల్లు కట్టించి ఇవ్వాలని , సీపీఐ(ఎం) నాయకులపైన అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సీపీఐ(ఎం) తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ సభ్యులు జే. ఆశీర్వాదం, ఎం. సత్యనారాయణ, బడుగు మాల్యాద్రి, శ్రీనివాసులు, ఐ. కృష్ణ, బడుగు శంకరయ్య, ఏ మాధవరెడ్డి, ఎం. యాదయ్య, ఎస్ యాదగిరి, హనుమంత్ రెడ్డి, ధర్మారెడ్డి రాజు, లింగారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నేడు సహకార సంఘం సర్వ సభ్య సమావేశం



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

ది బాటసింగారం రైతు సేవా సహకార సంఘం లిమిటెట్ 56వ మహాజన సభ సమావేశాన్ని నేడు నిర్వహించనున్నట్లు సంఘం చైర్మెన్ చేగురి భరత్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 11-30.ని.లకు సహకార సంఘం కార్యాలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సభ్యులందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి.. ఆమోదం కోసం తీర్మానం ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు.

సకాలంలో
పన్నులు చెల్లించండి : కమిషనర్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి పురపాలక సంఘం ప్రజలు సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించి.. జల్‌పల్లి మున్సిపల్ అభి వృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమి షనర్ బి. వెంకట్రాం గురువారం ఒక ప్రక టనలో తెలిపారు. మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ప్రజలందరూ సకాలంలో ఇంటి, ఆస్తి పన్నులు చెల్లించాలని కోరారు. తమ తమ వార్డులలో అందుబటులో ఉన్న సంబంధిత బిల్ కలెక్టర్, వార్డ్ ఆఫీసర్లు లేదా మున్సిపల్ కార్యాలయం కౌంటర్ నందు పన్నులు చెల్లించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థలలో వన్ టైమ్ సెటిల్‌మెంట్ క్రింద ఆస్తి పన్ను వడ్డీ బకాయిలలో 90% రాయితీ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఆర్థిక సంవత్సరం 2024-25 వరకు వడ్డీతో ఇప్పుడికే చెల్లించిన సదురు యాజమానలకు చెల్లించిన వడ్డీలో 90% వడ్డీని వచ్చే ఆర్థిక సంవత్సరం 2025-26 ప్రాపర్టీ టాక్స్ డిమాండ్‌లో సర్దుబాటు అవుతుందన్నారు.



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రజలు సకాలంలో ఆస్తి, ఇంటి పన్నులు చెల్లించి మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ సరస్వతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బిల్ కలెక్టర్, వార్డ్ ఆఫీసర్స్, సహాయక సిబ్బంది అందరూ మీ వార్డులకు ఇంటి పన్ను 2024-25 వరకు బకాయి ఉన్న యజమానులకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ క్రింద ఆస్తి పన్ను వడ్డీ బకాయిలలో 90% రాయితీ స్కీం గురించి తెలియజేసి ఇంటి యజమానులు నుండి ఇంటి పన్ను వసూళ్లు చేయాలని కోరారు. సకాలంలో పన్నులు చెల్లించి బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియడానికి వస్తున్నందున ఇంటి పన్ను బకాయిలు ఉన్నవారు తక్షణమే చెల్లించాలని కోరారు. తమ తమ డివిజన్లలో అందుబాటులో ఉన్న సంబంధిత బిల్ కలెక్టర్ వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ కార్యాలయం కౌంటర్ నందు చెల్లించగలరనీ కోరారు.

'గోర్ బోలి భాషను '8వ షెడ్యూల్'లో చేర్చాలి'



నవతెలంగాణ-చంపాపేట్

తెలంగాణ రాష్ట్రంలో గోర్ బోలి భాషను అధికార భాషగా గుర్తించి, భారత రాజ్యాంగం 8వ షెడ్యూల్లో చేర్పించాలని జివిఎస్ మరియు గోర్ సేన రాష్ట్ర నాయకులు కేతావాత్ భహూగుణ నాయక్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గోర్ బోలి భాషను అధికార భాషగా గుర్తించి, భారత రాజ్యాంగం 8వ షెడ్యూల్ లో చేర్చాలని అసెంబ్లీ తీర్మానం చేయడాన్ని జివిఎస్ మరియు గోర్ సేన పక్షాన ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. జరిగిన అసెంబ్లీ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన 15 కోట్ల బంజారాలు మాట్లాడే భాషా గోర్ బోలి భాషాను అధికార భాషగా గుర్తించి, భారత రాజ్యాంగం 8వ షెడ్యూల్ లో చేర్చాలని జూపల్లి కృష్ణరావు అసెంబ్లీ తీర్మానం ప్రవేశపెట్టారని, గౌరవ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆమోదించడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

'ఇంటి పన్నుల భారం వెంటనే తగ్గించాలి'

- గత బీఆర్ఎస్ కంటే అధిక పన్నులు వసూలు చేస్తున్న కాంగ్రెస్
- అందెల శ్రీరాములు యాదవ్



నవతెలంగాణ-మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పేద ప్రజలపై మోపిన ఇంటి పన్నుల భారాన్ని వెంటనే తగ్గించాలని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి, తులసి ముఖేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పెంచిన ఇంటి పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా అందెల శ్రీరాములు యాదవ్, రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డిలు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలపై ఇంటి పన్నుల రూపంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెను భారం మోపుతుందని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా పెంచిన పన్నులపై బీజేపీ పోరాటం చేసిందని, అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ కూడా పోరాటం చేసిందని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 15 నెలలలో అప్పటి బీఆర్ఎస్ కంటే అధికంగా పన్నులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి పేదలపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే ప్రజల పక్షాన రోడ్డెక్కి పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు కార్పొరేటర్ పెండ్యాల నర్సింహ, ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి, బీజేపీ మాజీ కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్ ఆత్మహత్య

నవతెలంగాణ-హయత్‌నగర్

మద్యం మత్తులో ఓ కార్పెంటర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మన్సూరాబాద్‌లోని వాంబే కాలనీ బ్లాక్ నంబర్ 40లో నివాసం ఉంటున్న శంకరాచారి(45). ఇతనికి ఇద్దరు పిల్లలు. తరచూ మద్యం సేవించి భార్యతో గొడవ పడేవాడు. అతని భార్య బంధువుల ఇంటికి వెళ్లడంతో బుధవారం తన కూతురుకు ఫోన్ చేసి మీ అమ్మ రాకపోతే నేను చనిపోతున్న అని కూతురుతో చెప్పి ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు.. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'పాఠశాల పట్ల మక్కువ పెంచడానికి పలు కార్యక్రమాలు'

నవతెలంగాణ - హస్తినాపురం

చిన్నారులకు పాఠశాల పట్ల మక్కువ పెరగడానికి తమ పాఠశాలలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నాగార్జున విద్యా సంస్థల వైస్ చైర్ పర్సన్ గుమ్మకొండ రజనీ విఠల్ రెడ్డి తెలిపారు. సాగర్ రోడ్డు హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని నాగార్జున మోడల్ స్కూల్‌లో గురు వారం మాంటిస్సోరి విద్యార్థులకు కాన్వకేషన్ డేను ఘనంగా నిర్వహించారు. తర్వాత గుమ్మకొండ రజనీ విఠల్ రెడ్డి.. విద్యార్థులకు క్యాప్‌లు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాలమైన ఇండోర్, ఔట్ డోర్ ప్లే గ్రౌండ్ల తో పాటు స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసి చిన్నారుల మానసిక వికాసంతో పాటు శారీరక వికాసానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల గ్రహణ శక్తిని పెంపొందించడానికి ఆడియో విజువల్ తర గతి గదులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కె. విజయ్ కుమార్ రావు, ఇంచార్జిలు సవిత, పుష్పలత, అరుణ, దివ్య, ప్రియాంక, ఉషశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉప్పల్ సమస్యల మీద అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-చర్లపల్లి/కాప్రా

ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని పలు సమస్యలపై గురువారం అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గళమెత్తారు. ముఖ్యంగా ఉప్పల్ - నారపల్లి రహదారి మార్గంలో నిర్మాణం జరుగుతున్న ఎలివేటెడ్ కారిడార్ పనులను వేగంగా పూర్తి చేయాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా తాత్కాలికంగా బ్లాక్ టాప్ రోడ్లు వేయాలని కోరారు. అంతేకాకుండా, చర్లపల్లి, నాచారం, కాప్రా, ఉప్పల్ చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పీకర్ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శితో వీసీలో పాల్గొన్న కలెక్టర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ గురువారం సెర్ప్ కార్యక్రమాల పై సెర్ప్ సీఈఓ డి. దివ్య తో కలిసి జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ గౌతం, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డిలతో కలిసి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సమావేశంలో డీఆర్డిఓ సాంబశివరావు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ సుగుణబాయి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రకళ, డి.ఈ.ఓ. విజయ కుమారి, ఎల్డిఎం శివప్రసాద్,మెప్మా పిడి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కాప్రాలో సమస్యలు పరిష్కరించాలి



- సీపీఐ(ఎం) కాప్రా సర్కిల్ కార్యాదర్శి జి.శ్రీనివాసులు
- కాప్రా మున్సిపల్ ఆఫీస్ వద్ద ధర్నా

నవతెలంగాణ-కాప్రా

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, కాప్రా సర్కిల్‌లో ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, 6 గ్యారెంటీలు అమలు చేయాలని సీపీఐ(ఎం) కాప్రా సర్కిల్ కార్యాదర్శి జి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు.కాప్రా మున్సిపల్ ఆఫీస్ వద్ద గురువారం పార్టీ కాప్రా సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పార్టీ కాప్రా సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై కుషాయిగూడ, సాయి నగర్, వివేకానంద నగర్, నాచారం, బాబా నగర్ ప్రాంతాలలో సర్వే నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు అనేక సమస్యలను పార్టీ నాయకులకు తెలియజేశారన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి కిరాయి కట్టలేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని.. ప్రభుత్వం ప్రకటించిన ఇండ్ల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఆరు గ్యారెంటీలు ఏ ఒక్కటీ అమలు కావడం లేదని చెప్పారు. 200 యూనిట్లు వరకు ఉచితం అన్నారు కానీ దాదాపు 50 శాతం మందికి జీరో కరెంటు బిల్లు రావడం లేదన్నారు. అలాగే దాదాపు 70 శాతం కుటుంబాలకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్ అందడం లేదని, వికలాంగులు, వితంతువులు, వద్దులు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఏ ప్రభుత్వం వచ్చినా వాగ్దానాలు అమలు చేయడంలో విఫలమవుతున్నారని అన్నారు. మహాలక్ష్మి పథకం కింద రూ. 2,500 రుపాయలు ఇస్తామని చెప్పి ఈ బడ్జెట్‌లో దానికోసం బడ్జెట్ కేటాయించలేదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే ఆరు గ్యారెంటీలు అమలుకు చర్యలు తీసుకోవాలని, వెంటనే అర్హులైన వారందరికీ ఇండ్ల స్థలాలు, పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్ కార్యదర్శి పి గణేష్, సుహాసిని లబ్దిదారులు పాల్గొన్నారు.

తై బజార్ రుసుము వసూళ్లు ఆపాలి

- పీర్జాదిగూడ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి
- కమిషనర్‌కు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో తై బాజర్‌ల వద్ద వ్యాపారుల నుంచి వసూళ్లు చేయాడం ఆపాలని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి కోరారు. పీర్జాదిగూడ కార్పొరేషన్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు కు బీఆర్ఎస్ పార్టీ నాయకుల బందం గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విభిన్నమైన వ్యాపారాలు చేసుకుంటున్న చిన్న వ్యాపారులు వారి జీవనోపాధిని సాగిస్తూ వారు ఆర్థికంగా బలోపేతం కాగలరన్న మానవతాధకృథంతో తైబజారు రుసుము వసూలు చేయకూడదని గత తమ పాలకవర్గం తీర్మానించిందని తెలిపారు. ఈ నిర్ణయం పట్ల చిన్న వ్యాపారులు ప్రజానికం సానుకూలంగా స్పందించారన్నారు. ఒక మహిళకు సాధికారత కల్పిస్తే మెత్తం సమాజాన్నే ఉద్ధరించినట్టవుతుందన్న సదాశయంతో తీసుకున్న నిర్ణయం మహిళలకు ఆర్థిక చేయూతనిచ్చిందని అలాగే మహిళాసాధికారిత సాకారానికి నాంది పలికిందన్నారు. సామాన్యుల సంతోషమే పాలకునికి సంతోషం కలిగిస్తుందని, వారి సంక్షేమమే పాలకునికి సంక్షేమం అని తెలియజేశారు. తైబజారు రుసుము సేకరించేందుకు బహిరంగ వేలం ప్రక్రియను పరిశీలించినపుడు, గతంలో వేలం దక్కించుకున్న వ్యక్తులు నిర్దేశిత రుసుము కంటే అధిక మెత్తంలో రుసుం వసూళ్ళకు పాల్పడేవారని, దౌర్జన్యాలు అసాంఘిక శక్తుల అరాచకాలు శాంతి భద్రతలకు విఘాతంగా పరిణమించేవన్నారు. ఇలాంటి దుశ్చర్యలను అరికట్టడానికే తమ పాలకవర్గం తైబజారు రుసుము వసూలు చేయకూడదని తీర్మానించిందని చెప్పారు. ఇప్పటికైనా ప్రజల, చిరు వ్యాపారుల సమస్యలు దష్టిలో ఉంచుకుని తై బజార్ వసూళ్లు అపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరి శకర్ రెడ్డి, కోల్తూరి మహేష్, మదుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు లేతకులా రఘుపతి రెడ్డి,రఘువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులపై తప్పుడు ఆరోపణలు తగదు



- నిబంధనలకు అనుగుణంగానే నిర్మాణాలు
- మీర్జాలగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రజాప్రతి నిధులపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదని, నిబంధనలకు అనుగుణంగానే ఇండ్ల నిర్మాణాలు చేపట్టినట్టు మీర్జాలగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. గురువారం మీర్జాలగూడలోని చిన్మయి మార్గ్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీకి చెందిన శ్రీరామ్ యాదవ్ రోడ్లు ఆక్రమణకు పాల్పడి నిర్మాణాలు చేపట్టామని ఆరోపించడంలో నిజం లేదన్నారు. ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్ లపై ఆయన తప్పుడు ఆరోపణలు చేయడాన్ని వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఖండించారు. అసోసియేషన్ పేరు మీద గతంలో కాలనీవాసులను డబ్బులు డిమాండ్ చేయడం, బెదిరింపులకు పాల్పడడం చేసినందుకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైందన్నారు. అప్పటినుంచి ఆయనను అసోసియేషన్ నుంచి తొలగించామన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం కాలనీలో రోడ్డు ఆక్రమణకు గురైనట్టు, హైడ్రా, జీహెచ్ఎంసీకి తప్పుడు ఫిర్యాదులు చేశాడని మండి పడ్డారు. అధికారులకు పూర్తి ఆధారాలతో వివరణ ఇచ్చామని, డ్రయినేజీ, ముంపు సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించామని, స్వార్థం కోసం శ్రీరామ్ యాదవ్ కాలనీవాసులను అధికారులను ప్రజాప్రతినిధుల పై ఆరోపణలు మానుకోవాలని సూచించారు. తమదే అసలైన అసోసియేషన్ అని, తమ అసోసియేషన్ పేరు వాడుకుంటున్న అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. భవిష్యత్తులో రోడ్డు వెడల్పు ఇతర అభివద్ధి కార్యక్రమాలకు అధికారులకు సహకరిస్తామని సభ్యులు స్పష్టం చేశారు. వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దీందాయ దీన్ దయాల్, ఉపాధ్యక్షులు శ్రీధర్, జనరల్ సెక్రటరీ జి పి శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీ ఏవి యువరాజ్, ట్రెజరర్ సిఈ స్వరన్ కుమార్, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వలను కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిది

- కార్పొరేటర్ బన్నాల గీత



నవతెలంగాణ-ఉప్పల్

వరల్డ్ వాటర్ డేను పురస్కరించుకొని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ వాటర్ వర్క్స్ అధికారులు జీఎం సంతోష్ కుమార్ ,డీజీఎం రజనీకాంత్ రెడ్డితో కలిసి బ్యాంక్ కాలనీలోని జోషి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులతో సేవ్ వాటర్ సేవ్ లైఫ్ అంటూ కార్పొరేటర్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరారు. అనంతరం రాఘవేంద్ర నగర్ కాలనీ , బాలాజీ ఎంక్లేవ్ కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి కాలనీలలో ఉన్న ఇంకుడు గుంతల మరమ్మత్తు,వాటిని శుభ్రపరచి అందులో ఇసుక నింపారు. NGO MARI ఫౌండేషన్ (మోడ్రన్ ఆర్కిటెక్స్ ఫర్ రూరల్ ఇండియా)వారు ఇంకుడు గుంతల మరమ్మత్తు మరి వాటికి కావలసిన ఇసుకని ఇచ్చారు.

కార్యక్రమంలో కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ,జీఎం సంతోష్ కుమార్, కాలనీ సభ్యులు మాట్లాడుతూ ప్రజలు నీటి నిలువలు చేసుకోకపోతే ముస్ముందు మనుషుల మనుగడ భూమిపైన కష్టంగా మారుతుందన్నారు. భూమి పైన గాలి ఎంత ముఖ్యమో నీరు కూడా అంతే ముఖ్యమని, అదేవిధంగా ప్రతి ఒక్కరూ ప్రతి ఇంటి దగ్గర ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు కాలనీలలో ఉన్న ఇంకుడు గుంతలను ప్రతినిత్యం మరమ్మత్తులు చేసుకుంటూ వాటిని కాపాడుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రజలు భాగస్వామ్యం ఉంటేనే ఏ ప్రభుత్వమైనా ఎటువంటి కార్యక్రమాన్ని అయినా విజయవంతంగా చేపడుతుందన్నారు. స్కూల్‌లలో పిల్లలకు నీటి నిల్వలా ప్రాముఖ్యతను నిత్యం తెలియజేస్తూ అవగాహన కల్పించాలని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎదుల కొండల్ రెడ్డి, కోకుండా జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, ఫోటో బాలు, అల్లిబిల్లి మహేందర్ ,మార్క శీను, శ్యామ్, కాలనీ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి ,కౌశిక్, కాలనీ అసోసియేషన్ సభ్యులు రమణ గుప్తా, ఉదయ్, సోమేశ్, కేశవరెడ్డి, శ్రీధర్, కృష్ణ మూర్తి,కెనడి, శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.



చర్లపల్లి డివిజన్ రెడ్డి కాలనీకి నూతనంగా ఎన్నికైన వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి కార్యవర్గ సభ్యులు గురువారం నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌ను, కార్పొరేటర్ బొంతు శ్రీదేవిని మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యవర్గ సభ్యులను బొంతు దంపతులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కాలనీ ప్రెసిడెంట్ డి.బూమ్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి సీహెచ్.వెంకట్ రాంరెడ్డి,ట్రెజరర్ వి.జీవన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ,బి.సుదర్శన్,జాయింట్ సెక్రటరీ ఏ.ఎలామా రెడ్డి, కాలనీ మాజీ అధ్యక్ష కార్యదర్శులు ,కాలనీ వాసులు ,పెద్దలు, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-చర్లపల్లి

ప్రభుత్వ భూముల పరిరక్షణకు కదిలిన హైడ్రా యంత్రాంగం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ భూముల కబ్జా జరుగుతున్నట్టు వస్తున్న ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్, ఐజీ ఏవీ రంగనాథ్ క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం మాదాపూర్లోని గుట్టల బేగంపేట, ఫిలింనగర్ బస్తీ విష్పర్ వ్యాలీ చేరువగా వున్న చెరువు, శంషాబాద్ మండలంలోని తొండపల్లి గ్రామం, కుత్బుల్లాపూర్ మండలం గాజులరామా రం గ్రామంలో ప్రభుత్వ భూములను కమిషనర్ పరిశీలించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు హైడ్రా చర్యలు తీసుకుంటుందని కమిషనర్ తెలిపారు. రహదా రులకు ఆటంకం లేకుండా చుట్టూ ఫెన్సింగ్ వేయడం, ప్రహరీలు నిర్మించి కాపాడుతామన్నారు. ప్రభుత్వ భూముల కు సంబంధించి త్వరితగతిన సర్వే చేయించి హద్దు లు నిర్ణయించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. భూమి తనది అని పేర్కొంటే సంబంధిత పేపర్లు చూపిం చాలని సూచించారు. రెవెన్యూ అధికారులతో కలసి, సర్వే చేసి భూముల వివరాలను తెలుసుకోవడమే కాకుండా ఎవరైనా ఆక్రమణలో ఉంటే వాళ్ళను ఖాళీ చేయించాలన్నారు. ఉప్పల్ నల్లచెరువునాభివృద్ధి పనులను పరిశీలించారు. పోచారం మున్సిపాలిటీ కాచవాని సింగరం లోని దివ్యానగర్ లే ఔట్‌ను కమిషనర్ సందర్శించారు. యీ లేఅవుట్‌తో పాటు ఏకశిల నగర్ లే ఔట్‌లలో పార్కులను, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల కబ్జపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు.

నాగార్జున నగర్ కాలనీ అభివృద్ధికి కృషి

- చర్లపల్లి కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్



నవతెలంగాణ-చర్లపల్లి

దశల వారీగా మౌలిక వసతులు కల్పిస్తూ నాగార్జున నగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ తెలిపారు. గురువారం జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి డివిజన్ నాగార్జున నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యావపురం రవి, మొగిలి కరుణాకర్ రెడ్డిల ఆధ్వర్యంలో కార్పొరేటర్‌ను ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, విద్యుత్ స్తంభాలు, స్ట్రీట్ లైట్లు, నిర్వహణ, పునర్నిర్మాణ పనులు, అంతర్గత రోడ్లలో ఏర్పడిన పాట్ హెూల్స్ పనులను చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. నాగార్జున నగర్ కాలనీకి ఎంతో చేశాము, ఇంకా చేస్తామన్నారు. దశలవారీగా కాలనీ అభివృద్ధి తోడ్పాటును ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ నాగిల్ల బాల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రభుగౌడ్, గద్దల క్రాంతి, ఎస్ఎస్ కాలనీ ఉపాధ్యక్షులు బైరంకొండ గోపాల్ యాదవ్, సహాయ కోశాధికారి సాయివివేక్, సంయుక్త కార్యదర్శులు శ్రీశైలం, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ప్రత్యేక ప్రార్థనలకు ఈద్గాలో ఏర్పాట్లు..



- కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్

నవతెలంగాణ-చర్లపల్లి

రంజాన్ సందర్భంగా ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు చేస్తామని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తెలిపారు. రంజాన్ పండుగ నేపథ్యంలో నాచారం డివిజన్ లోని ఎర్రకుంట ఈద్గాలో సుమారు రెండువేల మంది ముస్లిం సోదరులు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. గురువారం ఈద్గా మైదానాన్ని కార్పొరేటర్ ఈద్గా కమిటీ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. చాలావరకు పిచ్చి మొక్కలు, అలాగే గడ్డి పెరిగి ఉండడంతో కార్పొరేటర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఈద్గా మొత్తం శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ నరేష్, బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేకర్, దాసరి కర్ణ, మంగోల్ శివకుమార్, కట్టబుచ్చన్న గౌడ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరిస్తూ సంక్షేమానికి కృషి..



- రెడ్డి కాలనీ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు బూమ్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి

నవతెలంగాణ-చర్లపల్లి

రెడ్డి కాలనీ సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి కమిటీ సభ్యులతో కలిసి కృషి చేస్తామని నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డి.బూమ్ రెడ్డి, చెప్యాలా వెంకట్రాంరెడ్డిలు అన్నారు. చర్లపల్లి డివిజన్ రెడ్డి కాలనీ నూతన కమిటీని ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో సభ్యులు ప్రతిజ్ఞ చేసి, బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ.. రెడ్డి కాలనీలో ప్రధానంగా మురుగు కాలువ అవుట్ లేట్ లో సమస్యపై దృష్టి సారిస్తామన్నారు. కాలనీవాసుల అందరి సహకారంతో.. కాలనీ అభివృద్ధికి పనిచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను కాలనీవాసులు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సుదర్శన్, కోశాధికారిగా జీవన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి వెల్మారెడ్డి, ఎన్నికల అధికారులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బలరాం రెడ్డి, ప్రతినిధులు చెప్యాలా సురేందర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, సుదర్శన్ రెడ్డి, నర్సిరెడ్డి, కృష్ణారెడ్డి, కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

50వ రోజుకు చేరుకున్న ఉత్తరాల ఉద్యమం



నవతెలంగాణ-ఘట్కేసర్

ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థులకు విద్యనందించిన గురుకుల పాఠశాలను ప్రతి విద్యార్థి విద్యార్థిని కాపాడుకునే అవసరమెంతైనా ఉందని ఘట్కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాన్ని యాదగిరి యాదవ్ చేపట్టిన సేవ్ గురుకుల్ ఉత్తరాల ఉద్యమం గురువారం 50వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని పోస్ట్ ఆఫీస్ కార్యాలయం లో సేవ్ గురుకుల్ ఉత్తరాల ఉద్యమం లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డికి ఉత్తరాలను అందజేశారు గురుకుల్ 1963-1973 సంవత్సరంలోచదువుకున్న పూర్వ విద్యార్థి జమ్ముల నరేందర్ రావు, పూర్వ విద్యార్థులు దాదాపు 200 పైగా ఉత్తరాలను ఘట్కేసర్ పోస్ట్ మాస్టర్ కే. వసంత్ కుమార్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రికి, రాష్ట్ర మంత్రి అలాగే శాసనసభ ప్రతిపక్ష నేతలకు సేవ్ గురుకుల్ నినాదాలతో పంపించారు అబ్బసాని యాదగిరి మాట్లాడుతూ ఒకప్పుడు వేలాది మందికి పేద విద్యార్థి విద్యార్థులకు విద్యనందించిన గురుకుల్ విద్యాలయం నేడు శిథిలావస్థాకు చేరుకుందన్నారు. వేలాదిమంది జీవితంలో వెలుగు నింపిన గురుకుల్ విద్యాలయాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, జమిలాపేట ఎరుకల పాండురగన్, జనపల్లి, మాజీ ఎంపీటీసీ బాలకష్ణ, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు కొమ్మిడి మహిపాల్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ కూతడి రవీందర్,మాజీ వార్డు సభ్యులు కొత్తకొండ వెంకటేష్, సీపీఐ(ఎం) నాయకురాలు సబితా,సిరాజ్, కంది ప్రేమ్, బచ్చు నగేష్,గురుకుల్ పూర్వ విద్యార్థులు, ఉద్యమానికి మద్దతు తెలిపిన గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వివరించిన మైనంపల్లి



నవతెలంగాణ-నేరేడ్ మెట్

మల్కాజిగిరి ఆనంద్ బాగ్ లోని క్యాంపు కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జై బాపూ జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హాజరై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ చైర్మెన్ ఎం ఎ ఫహీం, పీసీసీ జనరల్ సెక్రెటరీ భాస్కర్, కాంగ్రెస్ కార్పొరేటర్‌లు వై ప్రేమ్ కుమార్, జితేంద్రనాథ్, కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షులు అశోక్ రెడ్డి, మల్కాజిగిరి బి బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, గుండా శ్రీనివాస్, బీకే శ్రీనివాస్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, బాబు, సత్యనారాయణ, డివిజన్స్ అధ్యక్షులు సంపత్ గౌడ్, ప్రవీణ్, వినోద్ యాదవ్, పంజా శ్రీనివాస్ యాదవ్, ఉమేష్ సింగ్, నయీమ్ ఖాన్, ఫరీద్, ఇస్తారి, ఆశ, ప్రభ రోజారమణి, శారద, లాస్య లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంతో నిరుద్యోగులకు లబ్ధి

- కాంగ్రెస్ చర్లపల్లి అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-చర్లపల్లి

నిరుద్యోగ యువతీ యువకులకు రాజీవ్ యువ వికాసం ద్వారా లబ్ధి చేకూరుతుందని కాంగ్రెస్ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్ యువవికాసం పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.6వేల కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో 5 లక్షల మంది యువతకు రాయితీ రుణాలు అందుతాయన్నారు. రాజీవ్ యువవికాసం పథకాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విలేకరుల అరెస్టులను ఖండించిన స్ఫూర్తి గ్రూప్

నవతెలంగాణ-కాప్రా



పదో తరగతి పరీక్ష పేపర్ లీక్ చేసిన దానికి ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోకుండా రాసిన విలేకరులపై, ఒక ప్రముఖ పత్రిక రాష్ట్ర ప్రతినిధిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడాన్ని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఇన్‌చార్జి యాదగిరి రావు గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. పరీక్షా సమయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. పత్రిక స్వేచ్ఛలో అణిచి వేసే తత్వాన్ని నిర్బంధ విధానాన్ని ఖండిస్తున్నామని, వెంటనే అరెస్టు చేసిన విలేకరులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



మున్నూరు కాపు సంఘం బలోపేతానికి కృషి

- నాచారం నూతన అధ్యక్షుడు తిప్పిరి రాజబాబు

నవతెలంగాణ - చర్లపల్లి

మున్నూరు కాపు సంఘం అభివద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆ సంఘం నాచారం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన తిప్పిరి రాజబాబు అన్నారు. సీతాఫల్ మండిలో నామాల గుండు ఎంబీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో నాచారం మున్నూరు కాపు సంఘం అధ్యక్షులుగా తిప్పిరి రాజబాబు, కార్యవర్గానికి అధికారిక అనుబంధ సంఘం గుర్తింపు పత్రాన్ని రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షులు పిల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి నగేష్, మహిళా అధ్యక్షురాలు చామకూర సుజాత, సికింద్రాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు చేకూరి వెంకటేశ్వర్ రావు చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తిప్పిరి రాజబాబు మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి అధ్యక్షునిగా ఎంపిక చేసిన సంఘం సభ్యులందరికీ పేరుపేరునా కతజ్ఞతలు తెలిపుతూ, తనపై ఉంచిన నమ్మకాన్ని మమ్ము చేయకుండా సంఘం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు.



మేడ్చల్-మల్కాజిగిరి డిస్ట్రిక్ట్ కోర్టు కాంప్లెక్స్‌లో జరిగిన న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్న బార్ అసోసియేషన్ మెంబర్ అడ్వకేట్, బీఆర్ఎస్‌రాష్ట్ర మాజీ కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య. నవతెలంగాణ-కాప్రా



ప్రతాపసింగారంలో ఇటీవల జరిగిన మల్లన్న కళ్యాణంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డితో కలిసి మహంకాళి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సురేందర్ , రాజశేఖర్ రెడ్డి, సందీప్, సాయికిరణ్, చంద్రమౌళి, ప్రభాకర్ గౌడ్, హసిని పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో



నాట్యాచార్యుడు శ్రీనివాస్‌కు ఉగాది పురస్కారం

నవతెలంగాణ-ఉప్పల్

శాస్త్రీయ నత్యంలో గత 20 సంవత్సరాలుగా శిక్షణ ఇచ్చి నత్య కళాకారులుగా తీర్చిదిద్దుతున్న రామంతపూర్‌కు చెందిన కోనూరు శ్రీనివాస్‌కు ఉగాది పురస్కారంతోపాటు నాట్య ప్రవీణ్ అవార్డు లభించింది. గురువారం రామంతపూర్ ఆర్టీసీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో శ్రీ సాయి మీరా కల్చర్ సొసైటీ అధ్యక్షులు ప్రొఫెసర్ వెనకపల్లి తిరుపతయ్య చైర్మెన్ కంటి పోతనాచార్యులు శ్రీనివాస్‌తో పాటు హిందుస్థాని సంగీత విభాగంలో అనుముల హెూష, డాక్టర్ శరత్ చంద్రాలకు ఉగాది పురస్కారాలను అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో పలువురు నత్య కళాకారులు పాల్గొన్నారు.

'అట్టడుగు వర్గాలకు అండగా ఉంటా'



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అట్టడుగు వర్గాలకు అండగా ఉంటానని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే తన నివాసం వద్ద గురువారం నియోజకవర్గ ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పలు ఆహ్వానాలు, వినతి పత్రాలను స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు, యువజన నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

సబ్జిమండీ ప్రాంతంలో కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కార్వాన్ నియోజకవర్గ పార్టీ అధ్యక్షురాలు మామిడి మాధవి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కల్వ సుజాత గుప్తా హాజరయ్యారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్తా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్వాన్ ఇన్‌చార్జి మహమ్మద్ ఓస్మాన్, మలక్‌పేట ఇన్‌చార్జి మహమ్మద్, ఖాదీర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచుతాయి



- జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

క్రీడలు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచి మానసిక ఒత్తిడిని తొలగిస్తాయని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు అన్నారు. జేఎన్‌టీయూ హైదరాబాద్ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగిన ఖో-ఖో, కబడ్డీ వైస్ ఛాన్సలర్ ట్రోఫీ ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, కూకట్ పల్లి ఏసీపీ శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గెలుపు-ఓటములు సహజమే, కానీ ప్రయత్నించకపోవడం కంటే ప్రయత్నించి ఓడిపోవడమే మేలు" అని తెలిపారు. క్రీడాకారులకు ఆల్ ఇండియా స్పోర్ట్స్ కోటా ద్వారా గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల్లో అవకాశాలు ఉన్నట్టు తెలిపారు. ఖో-ఖో (పురుషులు): జేఎన్‌టీయూహెచ్ హైదరాబాద్ (ప్రథమ), సీఎంఆర్ సెట్ మేడ్చల్ (ద్వితీయ), ఖో-ఖో (బాలికలు): జి.నారాయణమ్మ కాలేజ్ (ప్రథమ), సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ మేడ్చల్ (ద్వితీయ), కబడ్డీ (పురుషులు): వి.జె.ఐ.టి కాలేజ్ (ప్రథమ), ఎంఎల్ఆర్ఐటీ కాలేజ్ (ద్వితీయ), కబడ్డీ (బాలికలు): ఐఆర్ఈ కాలేజ్ (ప్రథమ), విజేఐటి కాలేజ్ (ద్వితీయ) బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎన్.ఎస్. దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ నల్లగొండ అశోక్, కే.ఫణి కుమార్, సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కేపీహెచ్‌బీ రాజశేఖర్ రెడ్డి, ఎస్సై శ్రీలత రెడ్డి తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి



- కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి సూచించారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతి పక్ష నేత రాహుల్ గాంధీ సూచనల మేరకు. నిర్వహిస్తున్న జై బాపు, జై భీమ్, జై సంవిధాన్, కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట,రంగారెడ్డినగర్ ఆయా డివిజన్‌లో సన్నాహక సమావేశం ఆదర్శ్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్క పేదవారికి చేరే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షులు వి.గణేష్, రంగారెడ్డినగర్ డివిజన్ అధ్యక్షులు పెరిక శివ కుమార్, సీనియర్ నాయకులు ఓరుగంటి కృష్ణ గౌడ్, మేకల ఎల్లయ్య, సయ్యద్ రషీద్, కే.జయరాం, నరేందర్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన మిఠాయిలకు స్వీట్ వన్ షాప్




- సినీనటి అనన్య నాగల్ల
- నిజాంపేట్‌లో స్వీట్ వన్ షాప్ ప్రారంభం

నవతెలంగాణ-నిజాంపేట్

స్వచ్ఛమైన మిఠాయిలకు చిరునామా స్వీట్ వన్ షాప్ అని సినీ నటి అనన్య తెలిపారు. రుచికరమైన మిఠాయిలని సరాసమైన ధరలలో ప్రజలకు అందించేందుకు నిజాంపేట ఐటెన్షన్ లైన్‌లో గురువారం స్వీట్ వన్ షాప్‌ను ముఖ్య అతిథిగా ఆమె హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నగరంలో కార్పొరేట్ స్వీట్ షాపులు ఉన్నప్పటికీ ఈ స్వీట్ వన్ షాప్‌కు ప్రత్యేకత ఉందని మిఠాయ్ స్వచ్ఛత, నాణ్యత ప్రమాణాలతో కూడిన స్వీట్‌ను అతి తక్కువలో ధరలలో అందించడమే స్వీట్ వన్ యాజమాన్యం యొక్క ప్రత్యేకత అన్నారు. అనంతరం స్వీట్ వన్ మేనేజింగ్ డైరెక్టర్ శంకర్ నారాయణ మాట్లాడుతూ... తాను గత 30 సంవత్సరాలుగా ఎన్నో పెండ్లిళ్ల శుభకార్యాలకు తన క్యాటరింగ్ ద్వారా రుచి కరమైన వంటలను అందించి అపారమైన అనుభవాన్ని ప్రజల మన్ననలు పొందనని తెలిపారు.

మహా నగరంలో ఇప్పటివరకు మూడు షాపులను వనస్థలిపురం, చింతల్, నిజాంపేటలోలోని హైదర్ నగర్‌లో ప్రారంభించామని మా స్వీట్ షాపులను నగర ప్రజలు ఆదరించాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని సీట్లు కొనుగోలు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమం ఓ పండుగ వాతావరణం తలపించింది. నగరంలో జరిగే అన్నిశుభకార్యాలకు స్వీట్లు తక్కువ ధరలకు స్వచ్ఛమైన మిఠాయిలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు, ఇతర రాజకీయ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి..



- కూకట్‌పల్లి కంటెస్టెంట్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వలన ఇతరులకు ప్రాణం పోసిన వారవుతారని కూకట్‌పల్లి నియోజకవర్గ కంటెస్టెంట్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ అన్నారు. గురువారం కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేస్ (మంజీరా (లులూ) మాల్ ప్రక్కన) గల శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి దేవాలయం నందు అఖిల భారత రామ్ చరణ్ యువత నిర్వాహకులు సందీప్ ధనపాల్, అరవింద్ చెర్రీ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగ కూకట్‌పల్లి నియోజకవర్గ కంటెస్టెంట్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్, ఆల్ ఇండియా చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు, చిరంజీవి బ్లడ్ బ్యాంక్ మేనేజర్ రవణం స్వామి నాయుడు విచ్చేసి మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి రక్త దానం, నేత్రదారం ద్వారా ఇతరులకి ప్రాణదానం చేయవచ్చని తెలిపారు. సేవా దృక్పథంతో చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌ని ప్రారంభించారన్నారు. ప్రపంచంలోనే తయారు కాని వస్తువు ఏదైనా ఉందంటే అది కేవలం రక్తం మే అన్నారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ 40వ పుట్టినరోజు సందర్భంగా చిరంజీవి స్ఫూర్తితో రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన యువకులు సందీప్, అరవింద్‌లను అభినందించి, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన నాయకులు కొల్లా శంకర్, భోగాది వెంకటేశ్వరరావు, కలిగినిడి ప్రసాద్, పులగం సుబ్బు, యాళ్ళ శిరీష, మెగా అభిమానులు ఊచా రాంబాబు (భట్టో), నూతి రాంబాబు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ ప్రజల సంక్షేమమే ధ్యేయం

- కార్పొరేటర్ రావుల శేషగిరి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గాజులరామారం డివిజన్ ప్రజల సంక్షేమమే ధ్యేయమని స్థానిక కార్పొరేటర్,గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి అన్నారు. ఈ మేరకు గురువారం డివిజన్ పరిధి శ్రీ వృద్ధి ఎంక్లేవ్, బాలాజీ లేఔట్ కాలనీలలో అధికారులతో కలిసి ప్రజా సమస్యలపై పాదయాత్ర చేశారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే రాజకీయాలకతీతంగా పరిష్క రిస్తారని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ గ్రేటర్‌లోనే గాజులరామారం డివిజన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ అధికారులతో పాటు కాలనీ నాయకులు పాల్గొన్నారు.

బస్తీ రోడ్లపై వారాంతపు సంతలు..

- బాలానగర్‌లో పాదచారులకు, వాహనదారులకు తప్పని తిప్పలు
- తీవ్ర ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, కాలనీవాసులు
- జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు పత్యామ్నాయం చూపాలని వేడుకోలు



నవతెలంగాణ-బాలానగర్

బాలానగర్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ఆయా కాలనీలు, బస్తీలు అసలే ఇరుకైన రోడ్డుతో వాహనదారులు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు రోడ్డుపై వారపు సంత ప్రతి ఆదివారం ఏర్పాటు చేయడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం మూడు గంటల నుండి రాత్రి 10 గంటల వరకు నడిచే ఈ సంతతో అటుగా వెళ్లే వాహనా దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకానొక సమయంలో కిలోమీటర్లు ప్రయాణించి వెళ్లాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి ప్రధాన రోడ్డును ఆనుకుని ఉన్న కాలనీ, బస్తీ రోడ్లలో సంతను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. మార్కెట్‌కు వచ్చిన వారు వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేయడం. జనాలు రోడ్లపైనే నిలబడి కొనుగోలు చేయడంతో వాహనాలు వెళ్లేందుకు మార్గం లేక గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఒకానొక సమయంలో అర కిలోమీటర్ దాటాలంటే అరగంట సమయం పడుతుందని వాన దారులు తెలిపారు. రహదారి, నర్సాపూర్ చౌరస్తా రాష్ట్ర రహదారి, కూకట్ పల్లిలోని 65వ జాతీయ రహదారిలను కలిపే ఈ రోడ్డు గుండా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సంత జరిగే సమయంలో ఫోర్ వీలర్, భారీ వాహనాలు ఆ రోడ్డు గుండా వెళ్లేందుకు కష్టతరంగా ఉంది. అదనంగా నాలుగు కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తుందని వాహనదారులు తెలిపారు. హనుమాన్ దేవాలయం, గడ్డి చేను పరిధిలో, రాజుకాలనీ, గౌతం నగర్, పద్మా నగర్ ప్రతివారం జరిగే సంతతో వాహనదారులు ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు ప్రత్యామ్నా యంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. ప్రధాన రోడ్డును ఆనుకుని వినాయక్ నగర్, రాజుకాలనీ, పంచవటి కాలనీ రోడ్లపై సంత నిర్వహించేలా చర్యలు చేపడితే వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఉండవని స్థానికులు కోరుతున్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని ప్రధాన, అంతర్గత రహదారుల్లో వారం వారం ఏర్పాటు చేస్తున్న సంతలతో వాహనదారులు, బాటసారులు నరకయాతన పడుతున్నారు. రహదారులపై ఏర్పాటు చేసే సంతల పట్ల జీహెచ్‌ఎంసీ యంత్రాంగం, ట్రాఫిక్ లా అండ్ ఆర్డర్ పోలీసులు చొరవ తీసుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన అంతర్గత రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన వారాంతపు సంతల మూలంగా కూరగాయలు, నిత్యావసర సరుకులు, తినుబండారాలు, అనేక రకాల గృహోపకరణాల వస్తువులను కొనుగోలు చేయడానికి వచ్చిన వారి వాహనాలను రోడ్డుపై అడ్డదిడ్డంగా పార్కు చేయడంతో రోడ్లన్నీ ఆక్రమణలకు గురవుతున్నాయి. దీంతో అనేక కాలనీలు, బస్తీలకు వెళ్లాల్సిన రోడ్లపై సంతలు అడ్డంగా ఉండటంతో సంత జరిగిన ప్రతీసారి ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడటం ఒక ఎత్తయితే, 30 నిమిషాల నుంచి గంటల సమయం వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. ట్రాఫిక్, లా అండర్ ఆర్డర్ పోలీసులు దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం లేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యకు కారణాలు..

సంత జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ సిబ్బంది కానీ, లా అండ్ ఆర్డర్ పోలీసులు కానీ ట్రాఫిక్‌ను క్లియర్ చేయకపోవడంతో వ్యాపారులు తమ కూరగాయలు, వస్తువులను రోడ్లపైనే పెట్టి అమ్మకాలు జరుపుతున్నారు. కొనుగోలు దారులు తమ వాహనాలను రోడ్ల మధ్యే అక్రమ పార్కింగ్ చేయడంతో రాకపోకలు సాగించే వాహనాలు ట్రాఫిక్ ముందుకు సాగడానికి అడ్డంకిగా మారుతున్నాయి. దీంతో ఎవరికి వారు అడ్డదిడ్డంగా వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఈ రహదారుల్లో ట్రాఫిక్ సమస్య నుంచి ప్రధాన రహదారి, రోడ్డు, కాలనీ వరకు, అంతర్గత రహ దారుల్లో ఏర్పాటు చేసే సంతలు, అంతర్గత రహదారిలో వారంలో ఏదో ఒక రోజు ఏర్పాటు చేసే సంతలతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.

సాయంత్రం వేళల్లో కిక్కిరిసిన రహదారిపై అవస్థలు..



బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజుకాలనీ, వినాయక్ నగర్, కళ్యాణి నగర్, గౌతంనగర్ తదితర కాలనీలు, బస్తీలలో వ్యాపారులు వారాంతపు సంతలు నిర్వహిస్తున్నారు. అసలే ఇరు కైన రోడ్లపై సంతలు ఏర్పాటు చేసుకోవడం వల్ల వాహన దారులు రాకపోకలు సాగించే వారు సాయంత్రం వేళల్లో కిక్కి రిసిన రహదారిపై అవస్థలు పడుతున్నారు. కార్మికులు, ప్రజలు అధికంగా నివాసాలు ఉండే ప్రాంతాలలో సంతను నిర్వహణ వల్ల ట్రాఫిక్ సమస్యలో అవస్థలు పడుతున్నారని పలువురు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంతల నిర్వహణకు ప్రత్యా మ్నాయం చూపించాలని ట్రాఫిక్ పోలీసులకు కోరారు.

-స్థానిక మహిళ దేవలక్ష్మి (వినాయక్ నగర్)

అధికారులు చర్యలు తీసుకోవాలి..



ప్రధాన కాలనీలు, ఆస్తీలలో వ్యాపారస్తులు కూరగాయల నుండి ఇతరత్రా వస్తువులు విక్రయాలు జరుపుతున్నారు. ఇదిలా ఉండగా కార్మికులు నివాసాలు ఉంటున్న కార్మిక వాడల్లో వారం వారం వివిధ వ్యాపారులు సంతలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలు నిత్యవసరాలు కొనుగోలు చేయడం కోసం రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా కాలనీలో, బస్తీలలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

-స్థానిక మహిళ వసుధ (రాజు కాలనీ)

పాత నేరస్తుడు రిమాండ్



- 25 తులాల బంగారం,15 తులాల వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ కె.సురేష్ కుమార్
- సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడి దొంగతనం కేసును సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాచుపల్లి పోలీసులు చేదించారు.గురువారం సాయంత్రం షాపూర్ నగర్ లోని బాలనగర్ జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ కే.సురేష్ కుమార్ వివరాలు వెల్లడించారు. బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 23 న తెల్లవారుజామున ప్రగతినగర్ కాలనీకి చెందిన నిరీషా అనే మహిళ ఇంట్లో ఆమె లేని సమయంలో దొంగతనం జరిగింది. 25 తులాల బంగారంతో పాటు 15 ఎతురాల వెండి చోరీకి గురయ్యాయని ఆమె బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు నేతృత్వంలో బాచుపల్లి సీఐ.ఉపేందర్ రావు, డీఐ యాదయ్య గౌడ్‌లు సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశారు. నిందితుడు నాజర్ (35)గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో నాజర్ దొంగతనం చేశానని ఒప్పుకున్నాడు. ఇదిలా ఉండగా నిరీష ఆమె స్నేహితురాలు శోభారాణి ఈవెంట్ మేనేజర్లుగా పనిచేస్తున్నారని ఈవెంట్ పని మీద 22 న రాత్రి నిరీష బయటికి వెళ్లడంతో పక్కా ప్లాన్ వేసుకున్న ఆమె స్నేహితురాలు శోభారాణి నాజర్‌ను ఆశ్రయించింది. దీంతో వారు పక్కా స్కెచ్ వేసి దొంగతనం చేశారని డీసీపీ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 25 తులాల బంగారంతో పాటు 15 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు 25 లక్షలకు పైగా ఉంటుందని తెలిపారు. నిందితుడు నాజర్‌ను రిమాండ్‌కు తరలించారు. సహకరించిన శోభారాణిపై కేసు నమోదు చేశారు. నిందితుడిపై గతంలో పలు పోలీస్ స్టేషన్‌లో ఆరు కేసుల వరకు నమోదై ఉన్నాయన్నారు. అందులో ఒక హత్య కేసు కూడా ఉందని దీంతో పాటు పీడీ యాక్ట్ కింద సంవత్సరం పాటు జైలు శిక్ష కూడా అనుభవించాడని డీసీపీ వివరించారు. ఈ కేసు చేదించిన బాచుపల్లి పోలీసులను డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం



నవతెలంగాణ-బాలానగర్

ట్రాఫిక్ నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై జెడ్సీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని ప్రధాన రహదారుల్లో తచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి, ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడానికి, మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించడానికి మెడ్చల్ అదనపు డీసీపీ (ట్రాఫిక్) వీరన్న, మేడ్చల్ ఏసీపీ ట్రాఫిక్ వెంకట్ రెడ్డి, స్థానిక ఇన్‌స్పెక్టర్లతో కలిసి గురువారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో ట్రాఫిక్ సమస్యలపై అధికారిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజు కాలనీ, ఎస్ఆర్ఎస్సీ ప్రాంతాలలో నీరు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ కాకుండా నివారించడానికి చేపట్టవలసిన చర్యల గురించి వివరించారు. డిమార్ట్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ ప్రవాహాన్ని క్రమబద్ధీకరించడానికి కొత్త ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడానికి నూతనంగా ప్రణాళికలపై ప్రస్తావించారు. అదేవిధంగా బాలానగర్-టి జంక్షన్ నుంచి ఫతేనగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ వరకు విద్యుత్ స్తంభా లను గురించి చర్చించారు. తద్వారా ట్రాఫిక్ స్వేచ్ఛగా సాగేలా చర్యలు చేపట్టాలని సమావేశంలో అధికారులు నిర్ణయించారు. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సీపీఎస్ మోడల్ స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

గ్రీన్ హిల్స్ కాలనీలోని సీపీఎస్ మోడల్ స్కూల్‌లో గురువారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు స్కూల్ ప్రిన్సిపల్ ఏ. వీరన్న ప్రశంస పత్రాలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.... విద్యార్థులు చిన్నతనం నుంచే నైతిక విలువలు, క్రమశిక్షణ, శ్రద్ధ వంటి లక్షణాలను నేర్పుతూ ఉత్తమ పిల్లలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాల కరస్పాండెంట్ ఏ.నీరజ మాట్లాడుతూ... మా పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే ప్రోగ్రాం వల్ల విద్యార్థులకు ఒక మంచి ఉల్లాసాన్ని అందించడానికి ఏర్పాటు చేయడం జరిగింది. దీనికి సహకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ వేడుకల్లో విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలతో చూపులను ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో విద్యుత్ ఏఈ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఏసీబీ అధికారులు దాడులు నిర్వహిస్తూ అవినీతి అధికారులను కటకటా ల్లోకి నెడుతున్నా వారి తీరు మారడం లేదు. ఏసీబీ అధికారుల దాడుల్లో మరో అవినీతి అధికారి కటకటాల పాలయ్యాడు. వివరాలలోకి వెళితే.. జీడిమెట్ల డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎలక్ట్రికల్ ఏఈ ఎస్.సురేందర్ రెడ్డి దొమ్మర పోచంపల్లి సబ్ డివిజన్‌లో పనిచేస్తున్నాడు. దొమ్మర పోచంపల్లి సబ్ డివిజన్ పరిధిలోని బౌరంపేటకు చెందిన ఓ వ్యక్తికి సంబంధించిన 11 కేవీ లైన్ సిఫ్టింగ్ ఎస్టిమేషన్ వేసేందుకు రూ.30 వేలు లంచం ఆశించడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుని సమాచారంతో గురువారం అవినీతి నిరోధక శాఖ సిటీ రేంజ్ యూనిట్-2 డీఎస్పీ పి.శ్రీధర్ నేతృత్వంలో డి.పోచం పల్లి సబ్ డివిజన్ కార్యాలయంలో దాడులు నిర్వహించారు. ఏసీబీ అధికారులు బాధితుని దగ్గర నుంచి రూ. 30 వేలు లంచం తీసుకుంటుండగా ఏఈని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సదరు ఏఈ సురేందర్ రెడ్డి గత రెండు సంవత్సరాలుగా దొమ్మరపోచంపల్లి సబ్ డివి జన్‌లో విధులు నిర్వహిస్తూ పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొం టున్నట్టు సమాచారం. అతనిని అరెస్ట్ చేసిన అధికారులు విచారణ నిమిత్తం నాంపల్లి ఏసీబీ కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా లంచం అడిగితే 1064 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం రహస్యంగా ఉంచుతామన్నారు.

మంత్రివర్గ విస్తరణలో బీసీలకు 42 శాతం వాటా ఇవ్వాలి



- జాజుల లింగంగౌడ్

నవతెలంగాణ-ఓయూ

విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికలో బీసీలకు 42 శాతం వాటా కల్పిస్తూ.. అసెంబ్లీలో తీర్మానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి వర్గ విస్తరణలో కూడా 42 శాతం వర్తింపజేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజ్వేషన్లను కల్పిస్తూ.. తీర్మానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మీ చేతిలో ఉన్న మంత్రివర్గంలో కూడా బీసీలకు 42 శాతం వాటా కల్పించి నిజంగా కాంగ్రెస్ పార్టీ బీసీల పక్షపాతి అని నిరూపించుకోవాలని అన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బస్తీ వాసులు



నవతెలంగాణ-కంటోన్మెంట్

తమ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలోని వార్డు 5 సంజీవయ్య నగర్ వీకర్ సెక్షన్ బస్తీ వాసులు గురువారవం ఎమ్మెల్యే శ్రీగణేష్ కలిశారు. వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయనకు చెప్పారు. పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. బస్తీలో నీటి సరఫరా, సీసీ రోడ్ల నిర్మాణం, కొత్త బోర్ వెల్ ఏర్పాటు చేయాలని, దోమల నివారణ తదితర సమస్యలను వివరించారు. స్పందించి ఎమ్మెల్యే వెంటనే కంటోన్మెంట్ అధికారులతో మాట్లాడి బస్తీ వాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని సూచించారు. సీసీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులను కూడా మంజూరు చేయిస్తానని వారికి హామీ ఇచ్చారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటా..



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

మృతుల కుటుంబాలకు తాను అండగా ఉంటానని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. బన్సీలాల్ పేట డివిజన్‌లోని బీజేఆర్ నగర్‌కు చెందిన హర్షిత్ (20), సీసీ నగర్‌కు చెందిన ప్రణయ్ (18)లు బుధవారం తెల్లవారుజామున ప్యారడైజ్ సర్కిల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం బీజేఆర్ నగర్‌లోని హర్షిత్ నివాసానికి వెళ్ళి మృతదేహం వద్ద నివాళులర్పించి తల్లిదండ్రులు కనక మాధవ్, విజయలక్ష్మిలను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. అదేవిధంగా సీసీ నగర్‌లోని నివాసం వద్ద ప్రణయ్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇరువురు అతిచిన్న వయసు ఉండటం, ఇరు కుటుంబాలకు కూడా ఒకొక్కరే కుమారుడు కావడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోధనలతో ఆయన చలించిపోయారు. మృతుల కుటుంబాలను పరామర్శించి తాను అండగా ఉంటానని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆర్థిక సహాయం అందజేశారు. చేతికి అందివచ్చిన కుమారుల మృతిచెందితే ఆ బాధ ఎవరు తీర్చలేనిదని విచారం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు లక్ష్మీపతి, ప్రేమ్ కుమార్, నాయకులు బలరాం, అబ్బాస్, సాయి, రంజిత్ తదితరులు ఉన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్/అమీర్పేట్

సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మహిళ అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటన చోటు చేసుకుంది. సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం, ఫోటో లోని 45 నుంచి 50 ఏండ్ల మహిళ గత కొన్ని రోజులుగా ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ దగ్గరలో తిరుగుతూ ఉండేదని, బుధవారం, సాయంత్రం ఒక మగ వ్యక్తి ఆమెను భరత్‌నగర్ బ్రిడ్జి క్రింద గల కేజీఎన్ చికెన్ సెంటర్ పక్కన ఖాళీ ప్రదేశంలోనికి తీసుకొని లైంగిక దాడి చేసి ఆమెను కొట్టడం వల్ల ఆమె మర ణిచిందని చెప్పారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న సనతనగర్ పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారని తెలిపారు. వెంటనే పోలీస్‌లు కేసు నమోదు చేసి మహిళ మృత దేహాన్ని గాంధీ ఆస్పత్రికి మార్చురీకి తరలించారన్నారు. సమీప పరిసరాలలో విచారించగా చనిపోయిన మహిళను ఎవరు గుర్తించలేదు ఎలాంటి ఆచూకీ తెలియలేదు. గుర్తు తెలియని మహిళగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఎవరైనా మహి ళను గుర్తించిన యెడల, ఈ క్రింది నంబర్లకు ఫోన్ చేసి సనత్ నగర్ పోలీస్‌లకు తెలపాలన్నారు. ఇన్‌స్పెక్టర్ నెం 9490617132, సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ నెం 8331013246 కు ఫోన్ చేసి తెలియపరచవలసినదిగా కోరారు.

చెత్త ఆటో కార్మికుల ధర్నా



- రామ్కీ యాజమాన్యంపై ఫిర్యాదు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జీహెచ్ఎంసీ సర్కిల్ 19 పరిధిలోని కృష్ణకాంత్ పార్క్ పక్కన డంపింగ్ యార్డ్ వద్ద, గురువారం 10 గంటలకు ధర్మచక్రం జీహెచ్ఎంసీ స్వచ్ఛ ఆటో యూనియన్ కార్మికులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు రంగన్న మాట్లాడుతూ.. చెత్త ఆటోలను డంపింగ్ యార్డ్ సమీపంలో పార్కింగ్ చేసుకొనుటకు అంగీకరించుటలేదని, జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్ రామ్కీ తరపున యార్డు ఇన్‌చార్జిగా ఉంటున్న లక్ష్మీ అనే మహిళ అనేక ఇబ్బందులకు గురిచేస్తుందని, చెత్తను అన్లోడ్ చేయడంలో జాప్యం చేస్తున్నారని, గంటల తరబడి ఆటోలో కూర్చుంటున్నామని, తాము చెప్పే వరకు డంపింగ్ యార్డు వద్దకు రావద్దని బయట వేసి ఉండాలని, అనేక రకాలుగా హింసిస్తూ సెక్యూరిటీ గార్డులతో గాలి తీయించే ప్రయత్నాలు చేస్తున్నారని నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న మధురానగర్ పోలీస్ అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని ధర్నా చేస్తున్న చెత్త ఆటో కార్మికులను పీఎస్‌కు తరలించారు. అనంతరం విడిచి పెట్టడం జరిగింది. వెంటనే సెక్యూరిటీ గార్డులపై, డంపింగ్ యార్డ్ ఇన్‌చార్జి లక్ష్మీపై, తగిన చర్యలు తీసుకోవాలని రామ్కీ సంస్థ యాజమాన్యాన్ని, అదేవిధంగా జీహెచ్ఎంసీ సర్కిల్ 19 అధికారులను ఆటో కార్మికులు కోరుతున్నారు.

ప్రవీణ్ పగడాలది ముమ్మాటికీ హత్యే..

- క్రైస్తవ సోదరులు
- కేఏ పాల్, పలువురు నాయకులు నివాళులు
- బాప్టిస్ట్ చర్చి వద్ద ఉద్రిక్తత
- సెయింట్ జాన్సన్ సిమిట్రీలో అంత్యక్రియలు పూర్తి







నవతెలంగాణ-బేగంపేట్/కంటోన్మెంట్

రాజమండ్రి వద్ద అనుమానాస్పదంగా మరణించిన పాస్టర్ ప్రవీణ్ పగడాలకు వేలాది మంది క్రైస్తవులు, క్రైస్తవ ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. రాజమండ్రి నుంచి గురువారం తెల్లవారు జామున 2.30గంటల ప్రాంతంలో ఆయన భౌతికకాయాన్ని సికింద్రాబాద్ క్లాక్ టవర్ ప్రాంతంలోని సెంటినరీ బ్యాప్టిస్ట్ చర్చికి తీసుకుని వచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చర్చిలో ఉంచగా వేలాది మంది క్రైస్తవ ప్రముఖులు, క్రైస్తవులు, దళిత సంఘాల నాయకులు వచ్చి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి కన్నీటి నివాళులర్పించారు. పెద్ద ఎత్తున క్రైస్తవులు తరలి రావడంతో క్లాక్ టవర్ పరిసర ప్రాంతాలన్ని కిటకిటలాడాయి. ప్రజా శాంతి పార్టీ నాయకులు కేఏ పాల్, మాజీ ఎంపీ మైనంపల్లి హన్మంతరావు, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, బ్యాప్టిస్ట్ చర్చి పాస్టర్ పురుషోత్తం తదితరులు పగడాల ప్రవీణ్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఉద్రిక్త వాతావరణం.. హోరెత్తిన నినాదాలు

వేలాది మంది క్రైస్తవులు సెయింటినరీ బ్యాప్టిస్ట్ చర్చికి చేరుకుని వియ్ వాంట్ జస్టిస్ అంటూ. నినాదాలు చేశారు. పగడాల ప్రవీణ్ ప్లకార్డులను పట్టుకుని ఆయనది ముమ్మాటికి హత్యేనంటూ నినదించారు. దోషులను వెంటనే పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఏ క్షణంలో ఏమి జరుగుతుందోననే ఆందోళన నెలకొనడంతో ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్ అక్కడే ఉండి టాస్క్ ఫోర్స్, ఉత్తర మండలంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీసులను మోహరించి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మధ్యాహ్నం 2గంటలకు ఆయన భౌతికకాయాన్ని చర్చి నుంచి భయటకు తెచ్చి ప్రత్యేక వాహనంలో ఉంచారు. అక్కడి నుంచి వేలాది మంది క్రైస్తవులు పగడాల ప్రవీణ్ స్మరించుకుంటూ, న్యాయం చేయాలంటూ నినాదాలు చేస్తూ పరేడ్ గ్రౌండ్ ప్రాంతంలోని సెయింట్ జాన్సన్ సెమిట్రీకి అశ్రునయనాల మధ్య తరలించారు. దారి వెంట కూడా వేలాది మంది క్రైస్తవులు ర్యాలీగా రావడంతో పోలీసులు కొంత టెన్షన్ పడ్డారు. సాయంత్రం 5 గంటలకు సీఎస్ఐ మెదక్ డయాసిస్ ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అంత్యక్రియలు పూర్తి చేశారు. క్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ దీపక్ జాన్, ఐపీసీసీ కార్యదర్శి హెజ్కెయేల్, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ రాజీవ్ సాగర్, శంకర్ లూక్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, విమల్ సుకుమార్, జైసన్ జాన్, భరత్, జవహర్ కెన్నెడీ తదితరులు పగడాల ప్రవీణ్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఇఫ్తార్ విందులో మేయర్



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఐక్యతకు ప్రతీకలు సాంస్కృతిక పండగలని, రంజాన్ మాసం పర్వదినం పురస్కరించుకొని డా. ఎండీ గ్రూప్రెనోవా అఫ్ హాస్పిటల్స్ చైర్మెన్ శ్రీధర్ పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో రెనోవా ఎన్ఐజీఎల్ హాస్పిటల్స్ బంజారా హిల్స్ రోడ్ 12లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా నగర మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి హాజరయ్యారు. ఈ విందులో వెంకటేశ్వర కాలనీ డివిజన్ మన్నె కవిత గోవర్ధన్ రెడ్డి, ఖైరతాబాద్ సీనియర్ నాయకులు మన్నే గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే కాలని అధ్యక్షులు, టి.నారాయణ రెడ్డిలు పాల్గొని మత పెద్దలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులకు ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..ఈ విధమైన ఆధ్యాత్మిక దైవ ప్రార్థనలు శాంతి, సోదరభావానికి ప్రతీక రంజాన్ పండుగ అని తెలిపారు. ముస్లింలకు ముందస్తుగా ఆమె రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. డా. ఆర్ వి రాఘవేంద్ర రావు, డైరెక్టర్, రెనోవా ఎన్ఐజీఎల్ హాస్పిటల్స్ అండ్ సీనియర్ లివర్ ట్రాన్స్ ప్లాంట్ సర్జన్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డా. ఆర్ వి రాఘవేంద్ర రావు, డైరెక్టర్, రెనోవా ఎన్ఐజీఎల్ హాస్పిటల్స్ అండ్ సీనియర్ లివర్ ట్రాన్స్ ప్లాంట్ సర్జన్, డా.రాకేష్ శర్మ డైరెక్టర్ డా.రాధాకృష్ణ రావు సాగి, సీఈఓ రెనోవా మిడ్ లెవల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్, రవీంద్రనాథ్ గరగ, సీఓఓ, జహీర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ డెవలప్ మెంట్, రామసుబ్బా రెడ్డి కొమ్మన, ముస్లిం సోదరులు, ఇతర వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది తదిరతులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగించుకోవాలి



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

మెరుగైన వైద్యం కోసం అవసరమైన ఆర్థిక సహాయం పొందడానికి ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన కార్యాలయంలో అమీర్ పేట్, రాంగోపాల్ పేట్ డివిజన్‌లకు చెందిన 9 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన రూ.3.32 లక్షలు విలువైన ఎల్ఓసీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక సమస్యల కారణంగా వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు నామన శేషుకుమారి, అత్తిలి అరుణ గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, నాయకులు నామన సంతోష్ మణి కుమార్, అశోక్ యాదవ్, కూతురు నర్సింహ, బలరాం, హరిసింగ్, వనం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన దేశవ్యాప్తంగా చేపట్టాలి



- మేకపోతుల నరేందర్ గౌడ్

నవతెలంగాణ-బంజారాహిల్స్

సమగ్ర కులగనన దేశవ్యాప్తంగా చేపట్టాల్సిందేనని, బీసీలందరూ ఏప్రిల్ 2న ఢిల్లీలోనీ జంతర్ మంతర్ వద్ద జరిగే బీసీల మహా ధర్నాకు స్వచ్ఛందంగా కదలిరావాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో దేశవ్యాప్తంగా జరగబోయే జనాభా (జనగణన) లెక్కల్లో సమగ్ర కులగణనతో నిర్వహిచాలి. తెలంగాణ రాష్ట్రంలో విద్య ఉద్యోగ, స్థానిక రంగాలలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో 42శాతం రిజర్వేషన్లు తీర్మానం చేసిన బిల్లును పార్లమెంటులో ఆమోదించాలని తెలిపారు. బీసీల 42శాతం రిజర్వేషన్లు బిల్లును 9వ షెడ్యూలులో చేర్చాలనే అంశంపై బావిభారత ప్రధాని రాహుల్ గాంధీ అద్వర్యంలో బీసీలకు దేశవ్యాప్తంగా విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో, రాజకీయ, రంగాలలో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని జరిగే ధర్నా కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం నుంచి అన్ని బీసీ సంఘాలు పాల్గొనాలని విజయవంతం చేయాలని కోరుతూ.. దానికి సంబంధించిన పోస్టర్‌ను తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఓరుగంటి వెంకటశం గౌడ్, జాతీయ ఓబీసీ జాక్ చైర్మెన్, సరికొండ రామ కృష్ణం రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ దేశగొని సాంబశివ గౌడ్, బీసీ ఉద్యమ వేదిక, అల్లం పల్లి రామకోటి ముదిరాజ్లతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. కొందరు బీసీ నాయకులు తమ ఆధ్వర్యంలోనే ఈ కార్యక్రమం జరుగుతున్నదని తప్పుడు ప్రచారం జరుగుతోందనీ దాన్ని ఎవ్వరు నమ్మవద్దని విజ్ఞప్తి చేసారు. బీసీ సంఘాలు, ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఉద్యమకారులు శివకుమార్, అధికార ప్రతినిధి తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం, బిమాగౌని సౌజన్య బీసీ మహిళ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, బెక్కం వెంకట్ ఎంబీసీ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఆనంతుల రామ్మూర్తి గౌడ్ యువజన విద్యార్థి సంఘాల అధ్యక్షులు, ఎర్ర శ్రీహరి గౌడ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం, గిరగాని భిక్షపతి గౌడ్ పేదల రిజర్వేషన్ల పోరాట సమితి అధ్యక్షులు, కాడబోయిన మల్లేష్ యాదవ్ రాష్ట్ర కార్యదర్శి బీసీ సంక్షేమ సంఘం, కొండ పల్లి రజిత పటేల్ బీసీ మహిళ సంఘం తదితరులు పాల్గొన్నారు.

ఓయూ వీసీ వైఖరిని నిరసిస్తూ.. ప్రొఫెసర్లు రాజీనామా..

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి (వీసీ), రిజిస్ట్రార్, ఓఎస్డీల తీరును నిరసిస్తూ తమ పట్ల వారు అవలంభిస్తున్న తీరుకు మనస్తాపంతో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రొఫెసర్స్ తమ అడ్మినిస్ట్రేటివ్ పదవులకు గురువారం సాయంత్రం ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. నరేష్ రెడ్డికి రాజీనామా పత్రాలు ఔటా అధ్యక్షుడు ప్రొ. మనోహర్, సెక్రెటరీ ప్రొ. సురేందర్ రెడ్డి సమక్షంలో సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా కళాశాలలో ఉన్న పలు సమస్యలను పరిష్కారం కోసం, ఎదుర్కొంటున్న పలు అంశాలపై సమావేశం ఏర్పాటు చేయాలని కోరిన తనను నేటి వరకు యూనివర్సిటీ అధికారులు కలిసేందుకు అన్న కూడా సమయం ఇవ్వలేదని గత్యంతరం లేక తాము ప్రస్తుతం నిర్వహిస్తున్న పలు అడ్మినిస్ట్రేటివ్ పదవులకు రాజీనామా చేస్తున్నట్టు ఆయన తెలిపారు. రాజీనామా చేసిన వారిలో ప్రిన్సిపాల్ ప్రొ.సునీల్ కుమార్, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొ. లక్ష్మీ కాంత్ రాథోడ్, డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం హెడ్ ప్రొ. రాజేష్ కుమార్, ఐయుటి సెక్రెటరీ ప్రొ. దీప్లలు ఉన్నారు.

మొబైల్ వాడకాన్ని తగ్గించి.. పుస్తక పఠనాన్ని పెంచాలి

- రిటైర్డ్ ప్రొఫెసర్, ఈఎల్‌టీఏఐ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ డా. కే ఎలాంగో
- ఇండియా రీడ్స్ అనే అంశంపై సెమినార్





నవతెలంగాణ-ధూల్‌పేట్

మొబైల్ వాడకాన్ని తగ్గించి.. పుస్తక పఠనాన్ని పెంచాలని అన్నా యూనివర్శిటీ (చైనై) రిటైర్డ్ ప్రొఫెసర్, ఈఎల్‌టీఏఐ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ డా. కే ఎలాంగో అన్నారు. గురువారం గవర్నమెంట్ సిటీ కాలేజీ ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'ఇండియా రీడ్స్' అనే అంశంపై అసోసియెట్ ప్రొఫెసర్, ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ డా. ఆది రమేష్ బాబు, కన్వీనర్ (ఈహెచ్‌సీసీ) అసోసియెట్ ప్రొఫెసర్, ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ డా. బీ కృష్ణ చంద్ర కీర్తి సెమినార్‌ను నిర్వహించారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా డా. కే ఎలాంగో, గౌరవ అతిథిగా జరీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. కే ఎలాంగో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడాతూ.. ఇటీవల కాలంలో ఏఐ ప్రభావం రోజు రోజుకు పేరుగుతుందని దీని వల్ల భవిష్యత్తులో మానవుల ఉద్యోగాలను వారి స్థానంలో రోబోలు ఎలా భర్తీ చేయాబోతున్నాయని విద్యార్థులకు వివరించారు. రోజు రోజుకు భోధన ఎలా సాగుతుందని, ఎలా భోధిస్తే విద్యార్థులకు సులభంగా అర్థం చేసుకోగ లరో చెప్పారు. ప్రస్తుత సమాజంలో అధిక శాతం యువకులు మెబైల్‌కి అలవాటు పడ్డారని దాని, వల్ల యువకులు భవిష్యత్తులో ఎంత నష్టపోతారో ఆలోచించాలన్నారు. మొబైల్ వాడకాన్ని తగ్గించి పుస్తక పఠనాన్ని ఎలా పెంచాలో పలు సూచనలు విద్యార్థులకు ఇచ్చారు. పుస్తకాలు, నవలలు చదవడం వల్ల కలిగే ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయని, పుస్తక పఠనం వల్ల ఆలోచన విధానం, ఊహాశక్తి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. పుస్తక పఠనం విద్యార్థులకు ఎంత ముఖ్యమో.. పఠనంలో ఎన్ని రకాలు ఉన్నాయో.. స్పష్టంగా చెప్పారు. వేగంగా చదవడం, నెమ్మదిగా చదవడం మధ్య వ్యత్యాసాల గురించి తెలిపారు. ప్రసంగం అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆంగ్ల విభాగం అధ్యాపకులు బీ.గిరిధర్, రాజ్ కమల్, షైనీ నెల్సన్, అనుష, మహేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న కోట నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్

సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని రాంగోపాల్‌పేట డివిజన్ నల్లగుట్టలో ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్ చార్జి కోట నీలిమ హాజరయ్యారు. ఇఫ్తార్ విందుకు మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరుశురాం, రాంగోపాల్ పేట్ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్ రావు, నాయకులు, హాసిన్, అజర్, సమీ, కరీం, రహీం, సిద్ధిక్, రఘు యాదవ్, శ్రీకాంత్ చారి, రాజశేఖర్, వెంకట్, హేమంత్ సింగ్, శివ, రాజు, మధు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ఓయూ

పీడీఎస్‌యూ నూతన కమిటీ ఏర్పాటు కోసం నిర్మాణ జనరల్ బాడీ కార్యక్రమాన్ని ఓయూ టెక్నాలజీ కాలేజీలో నిర్వహించారు. పీడీఎస్‌యూ నాయకుడు ఆసిఫ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఓయూ అధ్యాపకులు డా. ఈ ఉపేందర్ రావు పాల్గొని మాట్లాడారు. సమ సమాజ లక్ష్యసాధన కోసం విద్యార్థుల సమరశీల పోరాటాలే పునాది అవుతాయని తెలియజేశారు. శాస్త్రీయ విద్యాసాధన కోసం చిత్తశుద్ధి లేని ప్రభుత్వాల ఆలోచన విధానం ఏమాత్రం పరిపుష్టం కాదని వివరించారు. నిస్వార్థంగా దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన అమరుల స్ఫూర్తి ప్రదంలో యువత చైతన్యవంతం కావాలని తెలియజేశారు. ప్రగతిశీల ఉద్యమాల వేగు ధ్రువతారలైన జార్జిరెడ్డి, జంపాల, రంగవల్లి, మరోజుల అమరత్వపు యాదిలో యువతరం కదం తొక్కాలని పిలుపునిచ్చారు. మరో వక్తలు డా. దుబ్బ రంజిత్, పీడీఎస్‌యూ జాతీయ నేత మహేష్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజులు మాట్లాడుతూ.. ప్రపంచ శాంతికై, సమత విలువలకై పరితపించే ఉస్మానియా వీరత్వ చైతన్యాన్ని భుజానికి ఎత్తుకొని నూతన కార్యవర్గం ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మంద నవీన్, కే. శ్రీనివాస్‌లు నూతన కార్యవర్గ ఆమోదం, ప్రమాణస్వీకారాన్ని చేయించారు. ప్రజాస్వామిక కేంద్రీకృత విధానంతో, పీడీఎస్‌యూ నిబంధనావలి సాయంతో అంతిమ లక్ష్యాన్ని చేరుకునేందుకు తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు రాష్ట్ర ఉపాధ్యక్షులు సంతోష్, నగర ఉపాధ్యక్షులు గౌతం, కోశాధికారి యూన్సీ, సహాయ కార్యదర్శి ఆసిఫ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రహీమ్, పాల్గొన్నారు. అనంతరం ఓయూ పీడీఎస్‌యూ నూతన కార్యవర్గం అధ్యక్షులుగా ఆసిఫ్, ప్రధాన కార్యదర్శిగా మౌనిక, సహాయ కార్యదర్శిగా శ్రావణ్, ఉపాధ్యక్షులుగా సాయి కిరణ్, కోశాధికారిగా షబానా, సభ్యులుగా కిషోర్, అనిల్, సాయి, అనిల్, స్వేచ్ఛ, నవీన్‌లను నూతన కమిటీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జర్నలిస్టుల పాత్ర సమాజ శ్రేయస్సును కోరేలా ఉండాలి

- సినీ ప్రొడ్యూసర్ అంబికా కృష్ణ



నవతెలంగాణ-బంజారాహిల్స్

డిజిటల్ మీడియా నుంచి నాణ్యమైన వార్తలతో పాటు స్ఫూర్తినిచ్చే కథనాలతో పాటు సమాజ శ్రేయస్సు కొరకు పాటుపడాలని ప్రముఖ సినీ ప్రొడ్యూసర్ అంబికా కృష్ణ అన్నారు. గురువారం ఫిలింఛాంబర్‌లోని రామానాయుడు కళామండపంలో జరిగిన వీబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఫిలిం అండ్ టీవీ డైరెక్టరీ ఆవిష్కరణ, డిజిటల్ మీడియా జర్నలిస్టుల అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యుగంలో డిజిటల్ మీడియాకు హద్దులు లేకుండా పోయిందని టాలెంట్, వార్తలపై అవగాహన ఉన్న ఎంతో మంది జర్నలిస్టులుగా మారుతూ వార్తలు అందిస్తున్నారని అన్నారు. కొన్ని సార్లు మెయిన్ స్ట్రీమ్ మీడియాను డిజిటల్ మీడియా దాటేస్తుందేమోనని కూడా అనిపిస్తుందని మెయిన్ స్ట్రీమ్ సంస్థలు కూడా ఇప్పుడు డిజిటల్ జర్నలిజంలో దూసుకెళుతున్నాయని అన్నారు. వీబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత, 'మా' అసోసియేషన్ ఈసీ మెంబర్ విష్ణు బొప్పన మాట్లాడుతూ.. ప్రతియేటా వీబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో టీవీ ఆర్టిస్టులతో పాటు డిజిటల్ రంగంలో పని చేస్తున్న వారిని సత్కరించుకోవడం, ప్రోత్సాహం అందించడం ఆనవాయితీగా వస్తున్నదని అన్నారు. ఈ సందర్భంగా 2025 టీవీ డైరెక్టరీని ఆవిష్కరించారు. ఎన్నో ఏండ్లుగా తమ సంస్థ ద్వారా ఎంతో మంది చిన్న పిల్లలకు ఆరోగ్య, విద్య అవసరాలకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ మీడియాల్లో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులు నాగరాజు, రవి శంకర్, సుమన్, జాఫర్, ప్రభు, వీఎస్ఎన్.మూర్తి, స్వప్న రోహిత్, అంజలి, వంశీకూరపాటి, నిరుపమ, నిఖిల్, విజయేంద్ర సింహ, గీతాంజలి, డాక్టర్ నాగేశ్వర్ రావు పూజారి, రమేష్ చందు, బ్రదర్‌షఫీ, క్రాంతి, జాస్మిన్, తేజస్వి, కునపరెడ్డి అనిల్ తదితరులకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత కే.ఎస్.రామారావు, ఎస్ఆర్ఆర్ విజయగణపతి ఎవెన్యూస్, ముకుంద జ్యువెలరీ, వాకృతి ఇన్‌ఫ్రా, ప్రొసిఫ్, కనక వస్త్ర సిల్క్స్, హైజి హెల్త్ ఫుడ్స్ బ్రాండ్ మల్టీ మీడియా, అంబికా సంస్థల ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
శుక్రవారం | మార్చి 28, 2025 | www.navatelangana.com

చలివేంద్రం ప్రారంభించిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

తార్నాకలో మహంకాళి జిల్లా కార్యదర్శి మల్లికంటి వీరన్న ఆధ్వర్యంలో గురువారం తార్నాక సెంటెన్స్ స్కూల్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బండ కార్తీక చంద్ర రెడ్డి హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నాయకులు జిల్లా బీజేపీ నాయకులు డివిజన్ బీజేపీ నాయకులు నాగేశ్వర్ రెడ్డి, శారదా మల్లేష్, ఉపేందర్ యాదవ్,రాము, పాల్గొన్నారు.

అబ్రహార్ నగర్‌లో ఇఫ్తార్



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్‌పల్లి119 డివిజన్ అస్మత్‌పేట్ అబ్రహార్ నగర్ మసీదులో గురువారం ఇఫ్తార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఇజాజ్ భాయ్, అధ్యక్షుడు ఇర్ఫాన్, జనరల్ సెక్రెటరీ హరినాథ్, సీనియర్ నాయకులు కర్రె జంగయ్య, ముస్లిం పెద్దలు ఉస్మాన్ భాయ్, దిలావర్ భాయ్, చాంద్ భాయ్, అమీద్ భాయ్, ఖదీర్ అన్వర్ భాయ్, అబ్రహార్ నగర్ మజీద్ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లీం సోదరుల జీవనశైలి ఐక్యతకు ప్రతీక





●ఎమ్మెల్యే దానం నాగేందర్

నవతెలంగాణ-బంజారాహిల్స్

సంస్కృతి, సాంప్రదాయాలకు ముస్లీం సోదరుల జీవనశైలి ఓ ప్రత్యేక ఉదాహరణ, ఐక్యంగా ఉంటూ ముందుకు సాగాలనే వారి ధృఢ సంకల్పం దేశానికే ఆదర్శమనీ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. గురువారం నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్ బంజారా లేక్ యూ ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ప్రత్యేక ప్రార్థనలు చేసి ముస్లిం మైనార్టీ సోదరులతో కలిసి ఉపవాసాన్ని విరమించి వారి భాగంలో అడిగి తెలుసుకున్నారు. ఆసిఫ్ నగర్ ఎమ్మెల్యేగా చేసినప్పుడు తనను ఆదరించి వారి కుటుంబ సభ్యుడిగా రెండుసార్లు గెలిపించారని గుర్తు చేశారు. సోదర భావంతో అందరూ ముందుకు వెళ్లాలని ప్రజా పాలన ప్రభుత్వంలో సమస్యలు ఏమైనా ఉంటే తాను సీఎం దృష్టికి తీసుకు వెళ్తానని నియోజక వర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్, హిమాయత్ నగర్ కార్పొరేటర్ లక్ష్మీ రామన్ గౌడ్లతో పాటు పెద్ద సంఖ్యలో మైనారిటీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దూరవిద్యకు 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఓయూ

దూరవిద్య ద్వారా పలు కోర్సుల్లో చేరే విద్యార్థులు ఈ నెల 31 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రొఫెసర్ జి. రాంరెడ్డి దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొ. జి.బి. రెడ్డి తెలిపారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం ఐసెట్‌లో అర్హత సాధించని విద్యార్థులు ఓయూ దూరవిద్యా కేంద్రం ఈ నెల 28న నిర్వహించే ప్రవేశపరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని ఓ ప్రకటనలో వివరించారు. ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష కోసం 28వ తేదీ ఉదయం వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు నేరుగా ప్రవేశాలు పొందవచ్చు. ఈ నెల 31వ తేదీ వరకు ఇతర కోర్సుల్లో నేరుగా దూరవిద్యలో చేరవచ్చు. కోర్సుల వివరాల కోసం ప్రొఫెసర్ జి. రాంరెడ్డి దూరవిద్యా కేంద్రం వెబ్ సైట్ www.oucde.net ను సందర్శించవచ్చని దూరవిద్యాకేంద్రం సంచాలకులు తెలిపారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు

● బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు దోహదపడతాయని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్ అన్నారు. గురువారం అంబర్ పేట డివిజన్ పరిధిలోని చిన్నారెడ్డి నగర్‌లో తన కార్యాలయంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్ సీనియర్ నాయకులు లవంగు ఆంజనేయులతో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో ఎండలు తీవ్రంగా మండుతుండడంతో ప్రజ దాహార్తి తీర్చడం కోసం చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆకుల మల్లేష్, సజయ్ ముదిరాజ్, నరేంద్ర ముదిరాజ్, మహేష్ గౌడ్, సురేష్,దశరథ్, రాజేష్, కాశి తదితరులు పాల్గొన్నారు.

మేనేజింగ్ డైరెక్టర్ వై.కృష్ణారావుకు సత్కారం...



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

టీజీసీఏబీ యొక్క 24వ సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్న చైర్మెన్ మార్నేని రవీందర్ రావు నూతనంగా నియమితులైన మేనేజింగ్ డైరెక్టర్ వై. కృష్ణా రావుని బోర్డు డైరెక్టర్లతో కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గత కొన్నినెలలుగా టీజీసీఏబీ మేనేజింగ్ డైరెక్టర్‌గా సేవాలందించిన డా.బి.గోపి(ఐఏఎస్)ను బోర్డు డైరెక్టర్లు బ్యాంక్ అధికారులతో కలిసి చైర్మెన్ శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో టీజీసీఏబీ డైరెక్టర్లు కొత్త కుర్మ సత్తయ్య, కుంభం శ్రీనివాస్ రెడ్డి, చిట్టి దేవేందర్‌రెడ్డి, అడ్డి భోజా రెడ్డి, మామిల్లపల్లి విష్ణు వర్ధన్ రెడ్డి, దొండపాటి వెంకటేశ్వర రావు, కుంట రమేష్ రెడ్డి, ప్రొఫెషనల్ డైరెక్టర్లు శ్రీనివాసులు రెడ్డి, మెహనయ్య, నాబార్డ్ సిజిఎం ఉదయ్ భాస్కర్, టీజీసీఏబీ సీజీఎం జ్యోతి, జీఎంలు సురేఖ, సుజాత, శ్రీలత బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.



పేదల భూములు ఆక్రమించుకున్న రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అక్రమ అరెస్టుకు గోషామహల్ సీపీఐ(ఎం) కమిటీ ఖండన..



నవతెలంగాణ-ధూల్‌పేట్

రామోజీ ఫిల్మ్ సిటీ పరిధిలోని 360 ఎకరాల్లో 870 కుటుంబాలకు పేదలకు గత ప్రభుత్వం పట్టాలిచ్చారు. ఆ భూమి దగ్గరికి పేదలను పోనీయకుండా అడ్డంగా గోడ కట్టిన రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం చర్యలను ఖండిస్తూ పట్టాలున్న పేదలు నిన్న ప్రతిఘటించి చేస్తున్న పోరాటానికి అండగా వెళ్లిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని స్థానిక పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్టు) గోషామహల్ జోన్ కన్వీనర్ పి.నాగేశ్వర్ తీవ్రంగా ఖండించారు. పట్టా భూములున్న పేదలకు ధనవంతులకు (రామోజీ ఫిల్మ్ సిటీ యజమాని) మధ్య జరుగుతున్న ఈ పోరులో అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరి పక్షాన ఉండాలనుకుంటున్నదో స్పష్టం చేయాలని ఈ సందర్భంగా చేసిన ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని పత్తాలిచ్చిన ప్రభుత్వ అధికారులు, వారి భూమి దగ్గరికి పోనీయకుండా అడ్డుకుంటున్న రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యాన్ని నిలువరించాలని డిమాండ్ చేశారు.







ఉప్పల్ స్టేడియంలో అభిమానుల సందడి



సంగీత దర్శకుడు థమన్ షో



రాజ్యాధికారమే బీసీల అంతిమ లక్ష్యం

సీపీఐ జాతీయ నాయకులు, మాజీ రాజ్యసభ సభ్యులు అజీజ్ పాషా, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

రాజ్యాధికారమే బీసీల అంతిమ లక్ష్యమని జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు పార్టీలోని ప్రధాన పదవుల్లో ప్రాతినిధ్యం కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. రాజ్యధికారమే బీసీల అంతిమ లక్ష్యం కావాలని వారు పిలుపునిచ్చారు. ఓబీసీ డెమోక్రటిక్ జేఏసీ చైర్మెన్ కోల జనార్ధన్ అధ్యక్షతన గురువారం కాచిగూడలోని అభినందన్ హెూటల్లో 'ఓబీసీల సమస్యల పరిష్కారానికి -రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం' అనే అంశంపై అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ నాయకులు, మాజీ రాజ్యసభసభ్యుడు అజీజ్ పాషా, టీడీపీ పొలిటీ బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొని మాట్లాడుతూ బీసీలందరూ పార్టీలకు, సంఘాలకు అతీతంగా ఒకే వేదికపైకి వచ్చి సంఘటితంగా ఉద్యమించినప్పుడే బీసీలకు రాజ్యాధికారం దక్కుతుందని, ఆదిశగా బీసీలందరూ ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలకు పార్టీల్లో, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు దక్కకుండా కుట్రలు చేస్తున్నాయని, ఆ కుట్రలను బీసీలు సంఘటితంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీసీలకు విద్యా, ఉద్యో గ, రాజకీయాల్లో 42శాతం రిజర్వేషన్లు తీర్మానం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ బీసీ రిజర్వేషన్ల బిల్లును ప్రవేశ పెట్టి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో దాసు సురేష్, మేక పోతుల నరేందర్ గౌడ్, టి.రాజు, ఓరుగంటి వెంకటేశం, నీల వెంకటేష్, తంగెళ్లముడి నందగోపాల్, వేముల రామకృష్ణ, పగడాల సుధాకర్, రఘుపతి, మట్ట జయంతి, కరుణశ్రీ, వేణు, లతా గౌడ్, స్వప్న, ఉదయ్ నేత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలి

● కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పని చేస్తే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ. విజయ్‌కుమార్ గౌడ్ అన్నారు. గురువారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని ప్రేమనగర్ లో స్థానిక బస్తీ వాసులతో కలిసి అంబర్ పెట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా డ్రయినేజీ మ్యాన్ హెూల్స్ పడైపోవడంతో వెంటనే సంబంధిత అధికారులు సిబ్బందితో మాట్లాడి వీలైనంత త్వరగా నూతన మ్యాన్ హెూల్స్ కొత్త కవర్‌లను ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులు సమన్వయంతో కలిసి పని చేస్తే ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంతోష్ చారి, మమత, భూలక్ష్మి, శోభ, మౌనిక, పి.శోభ, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలకు చేరుతారు



● డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్ లక్ష్మణ్ సింగ్

నవతెలంగాణ-ధూల్‌పేట్

విద్యార్థులు కష్టపడి చదువుతేనే ఉన్నత శిఖరాలకు చేరుతారని బండ్లగూడ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్ లక్ష్మణ్ సింగ్ అన్నారు. గురువారం గౌలిపురా లలితబాగ్ రోడ్డులోని బెరూన్ గౌలిపురా ప్రాథమిక పాఠశాల వీడ్కోలు సమావేశం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులలో ప్రతిభ ఉంటుందని ఉపాధ్యాయులు గుర్తించి ప్రోత్సాహం కలిగిస్తే ఉన్నతమైన్నత ఉద్యోగస్తులై సమాజానికి సేవ చేస్తారన్నారు. బహదూర్ పుర డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్, శాలిబండ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరి నారాయణ విశిష్ట అతిథులుగా పాల్గొని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతి రంగంలోనూ ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ఉన్నత స్థానంలోనే నిలుస్తారన్నారు. బెరూన్ గౌలిపుర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎల్.ఎఫ్.ఎల్. ప్రధానోపాధ్యాయురాలు రమా దేవి స్వాగతోపన్యసం చేస్తూ ఐదవ తరగతి విద్యార్థులకు చదవడం, రాయడం చతుర్విధ ప్రక్రియలు అన్ని వచ్చించారు. ఈ కార్యక్రమంలో శాలిబండ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.అనురుద్ధరావు, డాక్టర్. ఎస్.విజయ భాస్కర్, వి.మధుసుధన రావు, ప్రమీల, శ్రీదేవి, మంజుల, నవనీత, రవికాంత్, బెరూన్ గౌలిపురా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నందిని, శశికళ, రవి, వీణ, మూర్తి, రమణ, ఎం.వి.ఎఫ్ ఉపాధ్యాయురాలు రజిత, పాఠశాల సహాయ సిబ్బంది అనిల్, సుధేష్ణ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య విధాన పరిషత్ (కింగ్ కోఠి) జిల్లా ఆస్పత్రిని సందర్శించిన డీహెచ్ తాండూర్ కాయకల్ప పీర్ అసెస్మెంట్ బృందం వైద్యులు అన్నారు. డాక్టర్ ఆనంద్ గోపాల్‌రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్‌రెడ్డి, ఐసీఎస్‌లు కృష్ణవేణి, అనిత ఎస్సార్ అసిస్టెంట్ శ్రీధర్‌గౌడ్ బృందం సందర్శించి ఆస్పత్రిలో గల మత శిశు కేంద్రంలోని గైనిక్ ఓపి, నవ జాత శిశువులకు లేబర్ రూమ్, మెటర్నిటీ ఆపరేషన్ థియేటర్, ప్రసూతి కేంద్రం ఇన్‌స్టివ్ కేర్ యూనిట్లు(ఐసీయూ)లో సౌక ర్యాలు, ఆర్థోపెడిక్ ఓపి, జనరల్ ఫిజీషియన్ ఓపి, సర్జరీ ఓపి, ఆపరేషన్ థియేటర్, ఈఎన్‌టీ, ఫిజియోథెరపీ అన్ని విభాగాలను సందర్శించి వైద్య సేవలు, సౌకర్యాలను ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్, ఆర్ఎంఓ డాక్టర్ సాధన, గైనిక్ హెచ్ ఓడి డాక్టర్ రాజశ్రీ, కంటి వైద్య నిపుణులు డాక్టర్ సవిత, వైద్యులు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ స్వప్న, డాక్టర్ సుజాత, డాక్టర్ జ్యోతిర్మయి , డాక్టర్ సరిత,డాక్టర్ మాధవి, వైద్యులు, నర్సింగ్ సూపరిడెంట్ శమంతకమని, పద్మ, నర్సింగ్ సిబ్బంది వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ గురుద్వారా సాహెబ్ సమీపంలో వ్యర్థాలను తొలగించాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గౌలిగూడ సెంట్రల్ గురుద్వారా సాహెబ్ సమీపంలో గల నాలా పూడిక, మట్టి, ఇతర వ్యర్థాలను వెంటనే తొలగించేలా చొరవ చూపాలని గురుద్వార్ కమిటీ ప్రతినిధులు ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్య అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌ను కోరారు. గౌలిగూడ సెంట్రల్ గురుద్వారా సాహెబ్ కమిటీ అధ్యక్షులు సర్దార్ ఇందర్ సింగ్ కమిటీ ప్రతినిధులు బోనాల శ్రీనివాస్‌ను పార్టీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ కమిషనర్, డిప్యూటీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరం అయేలా చూస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు.

'టీఎస్‌సీఎస్‌ను సందర్శించిన మహేశ్వర శర్మ సిద్ధాంతి'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నగరంలోని తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ (టీఎస్‌సీఎస్)ని శ్రీ శారదా పీఠం ఆస్థాన వేదశాస్త్ర పండిట్ బ్రహ్మశ్రీ డా.పురాణం మహేశ్వర శర్మ సిద్ధంతి గురువారం సందర్శించారని టీఎస్ సీఎస్ అధ్యక్షులు డా.చంద్రకాంత్ అగర్వాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తలసేమియా, సికిల్ సెల్ సొసైటీలోని సౌకర్యాలను పరిశీలించిన అనంతరం మహేశ్వర శర్మ మాట్లాడుతూ రోగులు, వారి కుటుంబాలకు మరింత అవగాహన, మద్దతు అవసరమని చెప్పారు. తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ నిబద్ధత, అంకిత భావంతో కూడిన పనిని ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు భారత దేశాన్ని తలసేమియా రహితంగా మార్చడానికి, అందరికీ హెచ్ బీఏ-2 పరీక్షను తప్పనిసరి చేయలనే వారి ప్రయత్నాన్ని అభినందిస్తూ సహాయం చేయనున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో చీఫ్ ప్యాటన్ నరేష్ రతి, వైస్-ప్రెసిడెంట్ రత్నావళి, టీఎస్ సీఎస్ కార్యదర్శి, సీఈఓ డా.సుమన్ జైన్, కార్య నిర్వాహక సభ్యులు నివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

'తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ ఎన్నికలు హైదరాబాద్ టీఎన్జీవో భవన్ లో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా విస్తం చౌదరి వ్యవహరించగా, మాజీ ప్రధాన కార్యదర్శి సుజావతి, మరియమ్మ నేతృత్వంలో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర అధ్యక్షుడిగా కె.ఆదిలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా లలిత, కోశాధికారిగా స్వర్ణలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, పబ్లిసిటీ సెక్రటరీ శైలజ, టీఎన్జీవోస్ మెడికల్ హెల్త్ అధ్యక్షులు కిరణ్ రెడ్డి, కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, పలు జిల్లాల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.లక్ష్మణ్, శేఖర్, బాలునాయక్ వీరమ్మ, సుబ్బమ్మ ఇతర కార్యవర్గ సభ్యులు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు.అనంతరం టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను అభినందించారు.

బస్తీలో స్వచ్ఛభారత్ కార్యక్రమం..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



గన్ ఫౌండ్రీ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్ బీశ్వ ఆధ్వర్యంలో చౌదరి బాగ్, రామకోటి బస్తీలలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయ్ సింగ్, ఫణి ందర్, లక్ష్మణ్, గోపి,శోభ, కేశవి, శిరీష, భూమి, అపర్ణ కార్యకర్తలు, జీహెచ్ఎంసీ స్వీపర్స్ ఎస్ఎఫ్ఐలు బస్తీవాసులు పాల్గొన్నారు.

ఓటీఎస్‌కు ఇంకా నాలుగు రోజులే గడువు

● బకాయి ఉన్న ఆస్తిపన్ను చెల్లించండి
● వడ్డీ పై 90 శాతం రాయితి పొందండి
● కమిషనర్ ఇలంబర్తి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ కల్పించిన వన్ టైమ్ స్కీమ్ పథకానికి ఇంకా నాలుగు రోజులే గడువు ఉందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెల 31లోపు బకాయి ఉన్న ఆస్తి పన్నును చెల్లించి, ఓటీఎస్ ద్వారా వడ్డీపై 90 శాతం పన్ను రాయితీ పొందాలని సూచించారు. ఆస్తిపన్నును ఆన్‌లైన్, సిటీజన్ సర్వీస్ సెంటర్లు, ఈ-సేవా కేంద్రాల ద్వారా చెల్లించవచ్చునని, సర్కిల్ ,హెడ్ ఆఫీస్ లో ఉన్న సిటిజన్ సర్వీస్ సెంటర్లు ఉదయం 8 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు పనిచేస్తాయని ఆయన తెలిపారు. అలాగే ఇంటి వద్దకు వచ్చే బిల్ కలెక్టర్లకు కూడా నేరుగా ఆస్తిపన్ను చెల్లించి, రాయితితో కూడిన రశీదులను పొందాలన్నారు. అంతే కాకుండా ఆన్ లైన్, మైజిహెచ్ఎంసి యాప్ ద్వారా ఆస్తి పన్ను చెల్లించే వెసులుబాటు ఉందన్నారు. బకాయి ఉన్న ఆస్తి పన్ను పై 90 శాతం రాయితీ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ సూచించారు. పన్ను చెల్లించిన వారు నగర అభివృద్ధికి దోహద పడిన వారవుతారని కమిషనర్ కోరారు.

మత విద్వేషకర వ్యాఖ్యలు చేసే యూట్యూబ్ చానల్స్‌ను కట్టడి చేయాలి

● క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షులు జెరూసలెం మత్తయ్య



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మత విద్వేషకర వ్యాఖ్యలు చేసే యూట్యూబ్ చానల్స్‌ను పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వం కట్టడి చేయాలని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షులు జెరూసలెం మత్తయ్య గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మత ఘర్షణలకు కారణమవుతున్న హిందూ, క్రైస్తవ, ముస్లిం మత డిబేటింగ్ స్టార్ లను కట్టడి చేయ వలసిన అవసరం ఉందన్నారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమా నాస్పద మృతికి ప్రత్యక్ష కారకులైన హిందూ మతోన్మాదులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మత విశ్వాసాలపై వివాదాస్పద టీవీ చర్చలు జరిపే యూట్యూబ్ ఛానల్ యాంకర్లు, వాటిలో పాల్గొనే పలువురు మత ప్రబోధకులకు కౌన్సెలింగ్ నిర్వ హించి కట్టడి చేయాలన్నారు.రక్షణ చానల్ (క్రైస్తవ), శివశక్తి (హిందూ), షఫీ సూక్తి (ముస్లిం) తదితర యూట్యూబ్ ఛానల్‌లను నిషేధించాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్, సైబర్ క్రైమ్, తెలంగాణ డీజీపీ, ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖలను ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా తెలంగాణ పోలీసులు పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపి, కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

జంతర్ మంతర్ వద్ద బీసీల పోరు గర్జనను జయప్రదం చేయాలి



● తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ

నవతెలంగాణ-ముషీరాబాద్

ఏప్రిల్ 2న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీల పోరు గర్జనను జయప్రదం చేయాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మెన్ బాలగౌని బాలరాజు గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్లు పిలుపునిచ్చారు. గురువారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్లను స్థానిక సంస్థల్లో, విద్యా, వైద్యం, ఉపాధి రంగాలలో అమలు చేస్తున్నట్లు అసెంబ్లీలో చట్టం చేసి పార్లమెంటుకు పంపించాలని హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. జూడో యాత్రలో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు రిజర్వేషన్ అమలు చేయడం జరిగిందని అయితే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో కూడా 9వ షెడ్యూల్‌లో చట్టం చేసేందుకు ఏకగ్రీవ తీర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ 2న అన్ని బీసీ కులసంఘాల ఆధ్వర్యంలో పోరు గర్జన నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలో సర్వాయిపాపన్న 315వ వర్ధంతిని ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మార్చి 31న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఉదయం 7గంటలకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేయడం జరిగిందని, బీసీలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ పోరు గర్జనలో రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్ తో పాటు అని పార్టీల ఎంపీలు పాల్గొంటారని తెలిపారు. విలేకరుల సమావేశంలో సమన్వయ కమిటీ వైస్ చైర్మెన్ గడ్డమీది విజయ్ కుమార్డ్, బాలగౌని వెంకటేష్ గౌడ్, సుగూరి దుర్గయ్య గౌడ్, వి నాగభూషణం, సింగం నాగేష్ గౌడ్, పోతగాని అయిలేని గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన దేవాదాయశాఖ అర్చక జేఏసీ నాయకులు

● సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ రాష్ట్ర శాసనసభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మెన్ గంగు ఉపేంద్రశర్మ, రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కాండూరు కృష్ణమాచారి, కన్వీనర్ పరాశరం రవీంద్ర చార్యులు, అధ్యక్షులు బద్రీనాథ్ చార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ అగ్నిహెూత్రా చంద్రశేఖర్ శర్మ, గ్రేటర్ అధ్యక్షుడు బండారి జగపతి బృందం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి తెలంగాణ అర్చక ఉద్యోగుల జేఏసీ నూతన ఉగాదిటు ఉగాది డైరీ విశ్వావసు నామ సంవత్సర డైరీనీ సీఎం చేతుల మీదుగా ఆవిష్కరించారు. డైరీలో తిథి వార నక్షత్ర యోగాలు గృహ స్థితిలోలు అనుసరించి రూపొందించి అదే విధంగా చిత్రకారుడైన కాండూరి కృష్ణమాచారి తన స్వయంగా చిత్రీకరించిన సీఎం చిత్రపటాన్ని సీఎంకు అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం దేవాలయాల ప్రసాదాలు అందజేశారు. దేవాదాయ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకి పరీక్షలు ఉత్తీర్ణత లేకున్నా వారు 45 సంవత్సరాలు నుండి(ఈవో) కార్య నిర్వహణ అధికారి పదోన్నతుల కొరకు, కారుణ్య నియామకాల వారిని గ్రాండ్ ఇన్ ఎయిడ్‌లో చేర్చే విధంగా, 577 జీవోలో రెగ్యులరైజ్ చేయబడక మిగిలిన అర్హత ఉన్నటువంటి వారిని కూడా చేర్చ వాల్సినదిగా సీఎం కోరారు. 2017 జీఓ విడుదలైన నాటికి ఉన్నటువంటి అర్చక ఉద్యోగులు అందర్నీ కూడా చేర్చి రెగ్యులర్ చేయాలని కోరారు. పెన్షన్ గ్రాడ్యుటీ హెల్త్ ఇన్సూరెన్స వెంటనే వెల్ఫేర్ బోర్డు మీటింగ్ నిర్వహించాలని దానివల్ల అర్చకుల సంక్షేమం జరుగుతుందని జేఏసీ చైర్మెన్ గంగు ఉపేంద్ర శర్మ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో మంత్రి శ్రీధర్ బాబుతో చర్చించి సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.



అఫ్జల్ గంజ్ రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ డాక్టర్ రియాజ్, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్, ముఖ్య గ్రంథా పాలకులు పీజీవీ రాణి, గెజిటెడ్ గ్రంథ పాలకులు సి అపర్ణ, టీఎన్జీవో నాయకులు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

సంతోషకరమైన జీవితం కోసం...

సంతోషకరమైన జీవితం ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహారం, ఒత్తిడి లేని జీవన శైలిని అలవరుచుకోవాలి. దీనిపై పెద్దవాళ్ళు, అనుభవజ్ఞులు, ఆయుర్వేద వైద్యనిపుణులు స్పష్టమైన ఆరోగ్యసూత్రాలను ఎప్పుడో చెప్పారు. వాటిని పాటించడం వల్ల మానసిక దృఢత్వం కలుగుతుంది.

ఉండవలసిన దినచర్య :

- ఏడెనిమిది గంటలకు తగ్గకుండా మంచి నిద్ర
- తొందరగా నిద్ర లేవడం
- జాగింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్, వాకింగ్, డాన్సింగ్ వంటి ఏరోబిక్ వంటివి ఏదో ఒకటి దినచర్యగా పెట్టుకోవాలి.
- కుటుంబంతో ఉల్లాసంగా గడపడం.
- రీడింగ్, సింగింగ్, గార్డెనింగ్, పేయింటింగ్, మ్యూజిక్ వినడం వంటి అలవాట్లతో ఒత్తిడిని దూరం చేసుకోవడం.

చేయకూడనివి :

- ఆలస్యంగా నిద్ర పోవడం, ఆలస్యంగా లేవడం, అసలు నిద్ర పోకుండా ఉండడం
- అధికంగా ఒత్తిడి కలిగి ఉండడం
- అతిగా ఆలోచించడం, ఏవో పాత సంఘటనలను తలచుకుని నిరంతరం బాధపడుతుండడం, ఆందోళన పడటం.
- టీవీ, మొబైల్ చూడటం.. దీనివల్ల సెన్స్ ఆర్గాన్స్‌పై ఒత్తిడి పడుతుంది.
- కోపం, భావోద్వేగాలపై నియంత్రణ లేకపోవడం

మంచును బద్దలు కొడుతూ.. అడ్డంకులను ఛీల్చుకుంటూ..

ఐస్ హాకీ... ఒకప్పుడు ఇది కేవలం పురుషులు ఆడే ఆట. కానీ ఇప్పుడు భారతీయ అమ్మాయిలు కూడా ధైర్యంగా అడుగుపెట్టారు. ఇందుకోసం మంచు గడ్డలనే కాదు సామాజిక అడ్డంకులను సైతం బద్దలు కొడుతున్నారు. భవిష్యత్‌లో మరింత మంది ఈ క్రీడలోకి ప్రవేశించేందుకు ఓ మార్గాన్ని వేశారు. ఒలింపిక్‌లో ఆడి దేశ ప్రతిష్టను నిలబెట్టాలని తపించే వారి పట్టుదల ముందు సవాళ్లన్నీ మంచులా కరిగిపోతున్నాయి. ఏ ఆట కూడా అమ్మాయిలకు దూరం కాదు అని నిరూపిస్తున్నారు. రాబోయే వింటర్ ఒలింపిక్స్‌లో చోటు దక్కించుకోవాలనే పట్టుదలతో ఉన్న అలాంటి నలుగురు అమ్మాయిల స్ఫూర్తిదాయక పరిచయం ఈ రోజు తెలుసుకుందాం...

గడ్డకట్టే మంచు ప్రాంతమైన లడఖ్, స్పితి లోయలోని యువతులు కొన్నేండ్ల కిందటి వరకు పురుషులకే పరిమితమైన క్రీడలోకి ప్రవేశించారు. అందుకోసం అడ్డంకులను బద్దలు కొడుతున్నారు. 1970లలో భారత సైన్యం, ప్రధానంగా లడఖ్ కేంద్రంగా ఐస్ హాకీని భారతదేశానికి పరిచయం చేసింది. అయితే ఈ క్రీడా మొదట్లో పురుషుల ప్రపంచంగా ఉండేది. 2000ల ప్రారంభంలో యువతుల బృందం సామాజిక నిబంధనలను ధిక్కరించి ఆడే హక్కును ఉపయోగించుకున్నారు. వారి దృఢ సంకల్పం 2016లో భారతదేశపు మొట్టమొదటి జాతీయ మహిళా ఐస్ హాకీ జట్టు ఏర్పడటానికి దారితీసింది. ఇది పెరిగిన మహిళా భాగస్వామ్యం, గుర్తింపుకు వేదికగా నిలిచింది. డిసెంబర్ నుండి ఫిబ్రవరి వరకు శీతాకాల నెలలలో ఆడే ఈ ఐస్ హాకీలో మహిళలకు ఈ ఏడాది మరిన్ని అవకాశాలు పెరుగుతున్నాయి. మహిళల పట్టుదల, స్థానిక చొరవలు, సంస్థాగత మద్దతు దీనికి ప్రధాన కారణాలు.



స్పీడ్ స్కేటింగ్ టు ఐస్ హాకీ

లేహ్‌లోని స్పుటిక్ గ్రామానికి చెందిన పద్మ చోరోల్ పదేండ్ల వయసులో స్పీడ్ స్కేటర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అన్నయ్య ప్రేరణతో ఆమె మంచుపై ప్రేమను పెంచుకుంది. కానీ ఐస్ హాకీలో ప్రమాదాలకు భయపడిన ఆమె తల్లి కాస్త కంగారుపడింది. తల్లి వ్యతిరేకించినా ఉన్నప్పటికీ ఆమె పట్టుదలతో ఉంది. 'నేను స్కేటింగ్ చేయడానికి దొంగచాటుగా వెళ్లేదాన్ని. ఒకసారి నేను గడ్డకట్టిన చెరువులో కూడా పడిపోయాను. ఎవరో నన్ను రక్షించాల్సి వచ్చింది. కిందపడి నా తల పగిలిపోతుందేమో అని మా అమ్మ నన్ను వెళ్లనిచ్చేది కాదు' అని ఆమె గుర్తుచేసుకుంది. చోరోల్ మొదట్లో స్పీడ్ స్కేటింగ్‌లో శిక్షణ పొంది జాతీయ స్థాయిలో బంగారు పతకాన్ని కూడా గెలుచుకుంది. 2013లో ఐస్ హాకీలోకి మారిపోయింది. ఆసియా-ఓషియానియా కప్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన మొదటి జాతీయ మహిళా జట్టులో ఆమె కూడా భాగం. 'ఈ క్రీడ చాలా సవాలుతో కూడుకున్నది. ఎందుకంటే సహజ మంచు మీద ప్రాక్టీస్ చేసి, కృత్రిమ మంచు రింక్‌లో ఆడవలసి వచ్చింది. మా దగ్గర సరైన పరికరాలు కూడా లేవు. పురుషుల జట్టు నుండి పరికరాలు అప్పు తీసుకున్నాము' అని ఆమె గుర్తు చేసుకుంది. అప్పటి నుండి ఈ క్రీడ చాలా ముందుకు వచ్చింది. రాయల్ ఎన్‌ఫీల్డ్ లీగ్ కోసం చోరోల్ చాలా సంతోషంగా ఉంది.

నేడు ఆమె ఓ క్రీడాకారిణితో పాటు కోచ్ కూడా. మారుమూల గ్రామాలలోని యువతులకు మార్గదర్శకత్వం వహిస్తున్నారు. 'చనిపోయే ముందు మహిళల జట్టు ఒలింపిక్స్‌లో పాల్గొనడాన్ని నేను చూడాలనుకుంటున్నాను. ఎన్ని అడ్డంకులను ఎదుర్కొన్నా, ఎప్పుడూ మీ కలను వదులుకోవద్దు. కొనసాగించండి' అంటూ ఆమె యువతులకు సూచిస్తుంది.

క్రీడాకారిణి.. కోచ్.. న్యాయవాది

లడఖ్‌లోని చాంగ్‌థాంగ్‌లోని లాలోక్‌కు చెందిన డిస్కి ఆంగ్మో 2004లో తన 12 ఏండ్ల వయసులో ఫిగర్ స్కేటింగ్ అనే వినోద క్రీడను ప్రారంభించింది. ఆమె తండ్రి లడఖ్ వింటర్ స్పోర్ట్స్ క్లబ్ సభ్యులలో ఒకరు. పురుషుల ఐస్ హాకీ విరామంలో ఆమె ఫిగర్ స్కేటింగ్ చేసేది. అలా ఈ క్రీడ పట్ల ఆసక్తి ఏర్పడింది. అయితే మహిళలు కూడా ఐస్ హాకీ ఆడగలరని ఆమెకు అప్పట్లో తెలియదు. 'ఇండో-కెనడియన్ ఫ్రెండ్‌షిప్ కప్ సమయంలో పురుషులతో పాటు ఒక మహిళ జట్టులో ఆడటం నేను చూశాను. అది నన్ను ప్రేరేపించింది' అని ఆమె గుర్తుచేసుకుంది. ఆంగ్మో జాతీయ జట్టు ప్రారంభం నుండి అనేక సవాళ్లతో నిండిన ప్రయాణంలో భాగంగా ఉంది.

'ఒక జట్టును ఏర్పాటు చేయడం కష్టం. మేము 20 మంది అమ్మాయిలం. మాలో చాలామంది ఐస్ రింక్‌ను చూడలేదు. పరికరాలు ఖరీదైనవి. ఏడాదిలో మూడు నెలలు మాత్రమే శిక్షణ పొందగలిగాం. సహజ చెరువులలో ప్రాక్టీస్ చేసాము' అని ఆమె వివరిస్తోంది. గతంలో మహిళలకు ఏడాదికి రెండు ఛాంపియన్‌షిప్‌లు మాత్రమే ఉండేవి. కానీ ఇప్పుడు అవకాశాలు పెరుగుతున్నాయి. ఆమె మొదటి అంతర్జాతీయ పోటీ చైనీస్ తైపీలో జరిగింది. ఇది లడఖ్‌లోని మహిళల ఐస్ హాకీపై భారీ ప్రభావాన్ని చూపింది. ఆంగ్మోతో సహా సీనియర్ క్రీడాకారులు లడఖ్ ఉమెన్స్ ఐస్ హాకీ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇది అమ్మాయిలు ఈ క్రీడను చేపట్టమని ప్రోత్సహించడానికి సుదూర గ్రామాలకు వెళుతుంది. 'మాలో చాలా మంది యువతరానికి శిక్షణ ఇవ్వడానికి కొంత సమయాన్ని కేటాయిస్తారు. గత మూడు, నాలుగేండ్లలో క్రీడలో మహిళల సంఖ్య బాగా పెరిగింది. రాయల్ ఎన్‌ఫీల్డ్ క్రీడ వృద్ధి చెందడంలో కూడా చాలా సహాయపడింది" అని ఆమె చెప్పింది.

పెద్ద లీగ్‌కు సిద్ధంగా ఉంది

కేవలం 17 ఏండ్ల వయసులో వాంగ్మో భారతదేశ ఐస్ హాకీ రంగంలో అతి పిన్న వయస్కురాలైన, అత్యంత చురుకైన క్రీడాకారిణులలో ఒకరు. ఆమె ఎనిమిదేండ్ల వయసులో, జాతీయ జట్టు క్రీడాకారిణిగా ఉన్న తన బంధువు అడుగుజాడలను అనుసరించి క్రీడలో చేరింది. 'భారత జెర్సీ ధరించి ఒలింపిక్స్‌లో ఆడాలనేది నా కల' అని ఆమె చెబుతోంది. చదువులు, హాకీని సమతుల్యం చేసుకుంటూ వాంగ్మో ప్రస్తుతం తన బోర్డు పరీక్షలు రాస్తోంది. లడఖ్ ఉమెన్స్ ఐస్ హాకీ ఫౌండేషన్ హాస్టల్‌లో శిక్షణ పొందుతోంది. కఠినమైన శిక్షణ పూర్తి చేసి వాంగ్మో 18 ఏళ్ల వచ్చేసరికి జాతీయ జట్టులోకి ప్రవేశించాలని నిశ్చయించుకుంది.

అప్పుడే సవాళ్లకు ప్రతిఫలం

కార్గిల్‌లోని బారూకు చెందిన 15 ఏండ్ల సమీనా ఖాతున్ తన సోదరుడి రోలర్ స్కేట్‌లను ఉపయోగించి స్కేటింగ్ చేసేది. 2020లో ఐస్ హాకీ ఆడటం ప్రారంభించింది. ఆటల్లో ముందస్తు అనుభవం లేకపోయినా దృఢ సంకల్పంతో ఆటను కొనసాగించింది. 'నా తల్లిదండ్రులు నన్ను ఎప్పుడూ ఆపలేదు. వారు ఎల్లప్పుడూ నాకు మద్దతు ఇచ్చారు' అని ఆమె పంచుకున్నారు. స్వయంగా తండ్రి ఆమెను శిక్షణకు తీసుకెళ్లేవాడని ఆనందంగా చెబుతోంది. ఖేలో ఇండియా వింటర్ గేమ్స్‌లో యుటి లడఖ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి స్వర్ణం గెలుచుకున్నప్పుడు ఆమె ఆనందానికి అవధులు లేవు. 'ఐటీబీపీతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గోల్ చేయడం నాకు గర్వకారణం' అంటోంది. సమీనా కూడా క్రీడను, చదువులను బ్యాలెన్స్ చేస్తోంది. క్రీడలో ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తోంది. 'ఐస్ హాకీ నా జీవితంలో భాగంగా ఉంటుంది. నా జట్టుతో కలిసి బంగారు పతకం గెలిచినప్పుడు నేను ఎదుర్కొన్న సవాళ్లకు ప్రతిఫలం లభించినట్టు' అంటూ ఆమె పంచుకుంది. ■

11 రోజుల సభలో ప్రశ్నోత్తరాలు రెండు రోజులే

సభలో ఏడు ప్రశ్నలకే పరిమితం

మిగతావన్నీ రాతపూర్వక రూపంలో సభ్యులకు అందజేత

సభా నిర్వహణపై అభ్యంతరం తెలిపిన అక్బరుద్దీన్, హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్చనీ యాంశ వేదిక అసెంబ్లీ. ఆ సమస్యలు ఎక్కువగా శాసనసభలో చర్చకొచ్చేది ప్రశ్నోత్తరాలు, జీరో అవర్‌లోనే. ప్రశ్నోత్తరాల్లో మంత్రుల సమాధానా లతో సభ్యులకు కాస్త వివరాలు ఎక్కువ వచ్చే అవకాశముంటుంది. సభలో ప్రశ్నోత్తరాలు ఎన్ని ఎక్కువ రోజులు జరిగితే అన్ని ప్రజా సమస్యలు చర్చకొస్తాయి. సాధారణంగా శాసనసభ ప్రారంభం కాగానే ప్రతి రోజూ గంట సమయం పాటు ప్రశ్నోత్తరాలను నిర్వహించే సాంప్రదాయముంది. సభ్యులు ముందస్తుగానే ఇచ్చిన ప్రశ్నలను ప్రధానమైన వాటిని క్రోడీకరించి కనీసం పది ప్రశ్నలపై ప్రతిరోజూ చర్చ జరిగేలా పొందుపరుస్తారు. అంశం, విషయ తీవ్రతను బట్టి చాలా సందర్భాల్లో ప్రశ్నోత్తరాలు గంటన్నర, రెండు గంటల పాటు జరిగినవే ఎక్కువ ఉంటాయి. దాంతో పాటు చర్చ సందర్భంగా మంత్రుల నుంచి వచ్చిన సమాధానాలను రాతపూర్వక రూపంలో కూడా ఇస్తారు. సభలో ప్రశ్నోత్తరాలకు అంతటి ప్రాధాన్యత ఉంది. ఎంత ఎక్కువ సమయమిస్తే అంత అర్థవంతంగా చర్చ జరిగే సందర్భాలే ఎక్కువ. కానీ, ఈ బడ్జెట్ సమావేశాల్లో శాసనసభ 11 రోజుల పాటు జరిగితే ప్రశ్నోత్తరాలను కేవలం రెండు రోజులకే పరిమితం చేశారు. అందులోనూ 20 ప్రశ్నలకుగానూ కేవలం ఏడింటికే మంత్రుల నుంచి సమాధానాలు వచ్చాయి. మిగతా వాటిని సభ్యులకు రాతపూర్వకంగా సమాధానాలు అందజేస్తామని స్పీకర్ ఆ రెండు రోజులూ ప్రకటించారు. మార్చి 17న జరిగిన ప్రశ్నోత్తరాల్లో ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ ఒకింత ఆగ్రహాన్ని గురయ్యారు. 'ఇది గాంధీ భవన్ కాదు..అసెంబ్లీ. సభను సభలా నడపండి. సభా నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. అందుకే సభ నుంచి వాకౌట్ చేస్తున్నాం...' అంటూ ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, ఆ పార్టీ ఎమ్మెల్యేలు సభ నుంచి వెళ్లిపోయారు. ఆ రోజు ప్రశ్నోత్తరాలకు గంటే సమయమున్నప్పటికీ ప్రాధాన్యతారీత్యా గంటన్నర పాటు నిర్వహించామనీ, ఇక పొడిగించలేమని స్పీకర్ ప్రసాద్‌కుమార్ చెప్పారు. దీంతో అక్బరుద్దీన్ లేచి స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై ఒకింత అసహనానికి గురయ్యారు. తమ పార్టీ సభ్యులతో కలిసి బయటకు వెళ్లిపోయారు. ప్రతిరోజూ సభ ప్రారంభం కాగానే..'అధ్యక్షా..ప్రశ్నోత్తరాలు పెట్టండి..మూడు రోజుల నుంచి పెట్టడం లేదు. సభ చివరిరోజు కూడా ప్రశ్నోత్తరాలను పెట్టరా?' అంటూ ప్రశ్నించారు.

ప్రశ్నోత్తరాలు కచ్చితంగా ఉండాలి : హరీశ్‌రావు

శాసనసభలో గురువారం జీరో అవర్‌లో ప్రశ్నోత్తరాల నిర్వహణపై బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు లేవనెత్తారు. బడ్జెట్ స్పీచ్, ముఖ్యమైన అంశాలున్న సమయంలో తప్ప మిగతా రోజుల్లో ప్రశ్నోత్తరాలను కచ్చితంగా నిర్వహించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరారు. ఈ సమావేశాల్లో ఒక్కరోజే ప్రశ్నోత్తరాలు పెట్టారని విమర్శించారు. ప్రశ్నోత్తరాలుంటే మంత్రుల నుంచి సమాధానాలు క్లారిటీగా వస్తాయన్నారు. జీవో అవర్‌ను ప్రతి రోజూ నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే, జీరో అవర్‌ను 'నోట్ చేసుకున్నాం' అంటూ ప్రవహసనంగా మార్చొద్దనీ, రాతపూర్వక సమాధానాలు కచ్చితంగా సభ్యులకు పంపాలని విన్నవించారు. కానీ, జీరో అవర్‌కు సంబంధించి ఒక్క సమాధానం కూడా సభ్యులకు రావడం లేదని ఎత్తిచూపారు.

సభాసమయం వృథా కావొద్దనే ఇలా చేశాం: మంత్రి శ్రీధర్‌బాబు

సభా సమయం వృథా కావొద్దనే ఇలా చేశామని శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. కొందరు కావాలనే తమ ప్రసంగాలతో సభా సమయాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు. జీరో అవర్‌లో ప్రతి సభ్యునికి కూడా అవకాశం ఇస్తున్నామని గుర్తుచేశారు. జీరో అవర్‌లో మంత్రులు నోట్ చేసుకున్న అంశాలకు సంబంధిత శాఖల అధికారుల నుంచి తప్పనిసరిగా రాతపూర్వక సమాధానాలు అందుతాయని తెలిపారు.

15 రోజుల్లో సమాధానాలను సభ్యులకివ్వాలని సీఎస్‌ను ఆదేశించాం : స్పీకర్


రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర అధికారులను పిలిచి సమావేశం పెట్టామనీ, జీరో అవర్‌కు సంబంధించిన సమాధానాలను 15 రోజుల్లో అందజేయాలని ఆదేశించామని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సభ్యులకు హామీనిచ్చారు.

ఆరోగ్యబీమా లేదు

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. ఇక 28.4 శాతం మంది మాత్రమే ఆరోగ్య బీమా కోసం దరఖాస్తు చేసుకున్నామని చెప్పారు. వీరిలో 46.8 శాతం మంది మాత్రమే ఆరోగ్య బీమా పాలసీని పొందగలిగారు. 53.2 శాతం మంది తమ దరఖాస్తులు తిరస్కరణ గురైనందును ఇన్సూరెన్స్ పాలసీని పొందలేక పోయినట్టు చెప్పారు.

బీమా కవరేజ్ ఉన్నవారిలో 53 శాతం కంటే ఎక్కువ మంది పీఎంజేఏవై పథకాన్ని ఎంచుకున్నారు. తర్వాత ప్రయివేటు పథకాలు (27 శాతం), ప్రభుత్వ పథకాలు (9 శాతం) ఉన్నాయి. ఈసర్వేలో బీమా చేయించుకున్న మహిళలు ప్రధానంగా తలసేమియా వర్గం (46.6 శాఆతం) వారు ఉన్నారు. ఆ తర్వాతి స్థానంలో లోకోమోటర్ వైకల్యాలు (16.4 శాతం), సికిల్‌సెల్ వ్యాధి (14.5 శాతం) ఉన్నారు. హిమో



ఫిలియా, మరుగుజ్జుత్వం, బహుళ వైకల్యాలు, ప్రసంగం మరియు భాషా వైకల్యం ఉన్న పీడబ్ల్యూడీ మహిళలకు తక్కువ బీమా కవరేజ్ లభించింది.

ఆరోగ్య బీమా పాలసీకి అర్హత సాధించినప్పటికీ.. పీడబ్ల్యూడీ యాక్సెసిబిలిటీ అడ్డంకులను ఎదుర్కొంటున్నారని సర్వే తెలిపింది. తలసేమియా, లోకోమోటర్ వైకల్యాలతో బాధపడుతున్నవారిలో తిరస్కరణ రేట్లు ఎక్కువగా ఉన్నాయి. దరఖాస్తులు తిరస్కరించబడిన 53.2 శాతం మందిలో, దాదాపు 60 శాతం మందికి తిరస్కరణకు గల కారణాల గురించి తెలియజేయబడలేదు.

'వికలాంగులందరినీ ఆయుష్మాన్ కింద చేర్చాలి'

ఎన్‌సీపీఈడీపీ నేతృత్వంలోని వికలాంగులకు ప్రాతినిధ్యం వహించే సంస్థల కూటమి అయిన జాతీయ వికలాంగుల నెట్‌వర్క్ (ఎన్‌డీఎన్).. ఎలాంటి ఆదాయ లేదా వయసు ప్రమాణాలు లేకుండా వికలాంగులను ఆయుష్మాన్ భారత్ కింద చేర్చాలని నిరంతరం వాదించిందని అలీ అన్నారు. అధిక ఆరోగ్య సంరక్షణ ఖర్చులు, ద్రవ్యోల్బణం, అందుబాటులో లేని బీమా సేవలు వికలాంగులను తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టివేస్తున్నందున, బేషరతుగా కవరేజీని విస్తరించాలని ఈ బృందం కేంద్రాన్ని కోరింది.

భారీగా యూఎస్ వీసా అపాయింట్‌మెంట్లు రద్దు

భారత్‌లో రెండువేల వీసాలపై ప్రభావం

శ్వేతసౌధం: భారత్‌లోని అమెరికా దౌత్య కార్యా లయం 2,000 వీసా అపాయింట్‌మెంట్లను రద్దు చేసినట్టు బుధవారం ప్రకటించింది. మోసపూరిత కార్యకలాపాలతో సంబంధం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకొన్నట్టు చెప్పింది. అపాయింట్‌మెంట్ వ్యవస్థలో ఓ భారీ లోపాన్ని గుర్తించినట్టు దౌత్య కార్యా లయం వెల్లడించింది. ఇవి మొత్తం 'బాట్స్' ద్వారా వచ్చినట్టు గుర్తించామని పేర్కొంది. ఈ విషయాన్ని ఎక్స్ పోస్టులో పేర్కొంది.

"బాట్స్ చేసిన 2,000 వీసా అపాయింట్‌మెంట్స్ భారత్‌లో కాన్సులర్ బృందం రద్దు చేస్తోంది. మా షెడ్యూలింగ్ విధానాలను ప్రభావితం చేసే ఏజెంట్స్, ఫిక్సర్లను ఏమాత్రం సహించం. ఈ అపాయింట్‌మెంట్లను రద్దు చేయడంతో పాటు.. అనుబంధ ఖాతాలకు షెడ్యూలింగ్ అధికారాలను సస్పెండ్ చేస్తున్నాం. మోసాల నిర్మూలనకు మా ప్రయత్నాలు కొనసాగుతాయి. వాటిని ఏమాత్రం సహించం" అని ఆ పోస్టులో పేర్కొంది. అమెరికా బిజినెస్, విజిటర్స్, బీ1, బీ2, స్టూడెంట్ వీసాలకు అపాయింట్‌మెంట్ల కోసం సుదీర్ఘ సమయం వెయింటింగ్ ఉంటుందన్న విషయం తెలిసిందే. కానీ, ఏజెంట్లకు డబ్బులు చెల్లిస్తే మాత్రం కేవలం నెల రోజుల్లోనే అపాయింట్‌మెంట్లు దొర కడం పర్యటక రంగంలో సర్వసాధారణం. ఇందుకోసం ఒక్కో వీసా దరఖాస్తుదారుడి నుంచి రూ.30,000 నుంచి రూ.35,000 వరకు ఏజెంట్లు వసూలు చేస్తారు. తమ కుమారుడు అమెరికాలోని విశ్వవిద్యాలయం లో చేరడానికి సొంతంగా వీసా అపా యింట్‌మెంట్ కోసం ప్రయత్నించగా అది సాధ్యం కాలేదని, అదే ఏజెంటుకు రూ.30వేలు చెల్లిస్తే వెంటనే వచ్చిందని ఓ వ్యక్తి ఆంగ్ల వార్తా పత్రికకు వెల్లడించాడు.

సాధారణంగా వీసా దరఖాస్తుదారుడు సొంతంగా అప్లికేషన్ పంపిస్తే.. సమీప భవిష్యత్తులో అపాయింట్‌మెంట్ డేట్లు లభించవు. కానీ, ఏజెంట్లు కొన్నిరకాల ప్రత్యేకమైన బాట్స్‌ను



వినియోగించి స్లాట్లను బ్లాక్ చేస్తారు. 2023లో బీ1, బీ2 అపాయింట్‌మెంట్ల 999 రోజుల మార్కును చూపించింది. దీంతో భారతీయ దరఖాస్తు దారుల కోసం ఫ్రాంక్‌ఫర్ట్, బ్యాంకాక్, ఇతర ప్రదేశాల్లో అమెరికా అపాయింట్‌మెంట్లను తెరవాల్సి వచ్చింది.

దాదాపు మూడేండ్ల క్రితం వీసా వెయిట్ సమయం చాలా ఎక్కువగా ఉన్న విషయాన్ని భారత్ ప్రభుత్వం అమెరికా దృష్టికి తీసుకెళ్లింది. దీనిని సీరియస్‌గా తీసుకొన్న అమెరికా ప్రభుత్వం వెయిటింగ్ సమయాన్ని గణనీయంగా తగ్గించింది. తాజాగా ఇప్పుడు బాట్స్ వినియోగాన్ని అడ్డుకోవడంపై దృష్టిపెట్టింది.

ట్రంప్ దెబ్బకు..

(మొదటిపేజీ తరువాయి)

భారత్ మొగ్గుచూపుతోంది. ఈక్రమంలో రెండు దేశాల మధ్య మొదలైన ట్రేడ్ అండ్ టారిఫ్ చర్చల్లో భారత్ ధృఢవైఖరిని ప్రదర్శిస్తోంది. కొన్ని వస్తువులపై టారిఫ్ కోతలకు అంగీకరించినప్పటికీ.. దేశ ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తోంది. "సుంకాలు తగ్గించినంత మాత్రాన అమెరికా ఒత్తిడికి లొంగిపోయినట్టు కాదు" అని కేంద్ర ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారి జాతీయ మీడియాతో మాట్లాడారు. "వ్యవసాయ ఉత్పత్తులైన వాల్‌నట్స్, యాపిల్, బాదం వంటి వాటిపై తగ్గింపునకు సిద్ధంగా ఉన్నాం. కానీ భారత్‌లో వ్యవసాయరంగ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గోధుమ, మొక్కజొన్న వంటివాటిపై రాయితీకి అవకాశం లేదు" అని తెలిపారు.

అమెరికాకు దిగుమతయ్యే కార్లపై 25 శాతం సుంకం

విదేశాల్లో తయారై అమెరికాకు దిగుమతయ్యే కార్లపై 25 శాతం సుంకం విధిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించారు. వచ్చేవారం ఈ చర్యలు అమల్లోకి వస్తాయని స్పష్టంచేశారు. ఇది శాశ్వతమైన చర్యగా పేర్కొన్న ఆయన అమెరికాలో తయారయ్యే వాటిపై మాత్రం ఎలాంటి సుంకం ఉండదని పేర్కొన్నారు. "ట్రంప్ నిర్ణయం భారత ఆటోమొబైల్ పరిశ్రమపై గణనీయంగా ఉంటుంది. కానీ ద్విచక్రవాహనాలు, చిన్నపాటి కార్లపై కొన్ని సుంకాలు తగ్గించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని ఆ అధికారి వెల్లడించారు. ఇదిలాఉంటే.. ట్రంప్ నిర్ణయంతో ఆటోమొబైల్ షేర్లు భారీగా కుంగాయి. అమెరికా నుంచి మన దేశంలోకి వస్తున్న ఉత్పత్తులపై ఇక్కడ ఎంత సుంకం విధిస్తే, ఇక్కడినుంచి అమెరికాకు చేరుతున్న అదే తరహా ఉత్పత్తులపై సమాన సుంకాన్ని ఏప్రిల్ 2 నుంచి అమలుచేస్తామని అమెరికా అధ్యక్షుడు ప్రకటించారు. ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రకారం.. భారత ఉత్పత్తులపై అమెరికా సగటున 2.2 సఆత్ సుంకం విధిస్తుండగా.. అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకం సగటు 12 శాతంగా ఉంది.

'గోర్ బోలి' భాషను ఎనిమిదో షెడ్యూల్లో చేర్చాలి

అసెంబ్లీ తీర్మానం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

లంబాడాలకు చెందిన 'గోర్ బోలి' భాషను రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా పరిరక్షించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ భాషకు లిపి లేదనీ, ప్రజల్లో మాత్రం చెలామణి అవుతున్నదన్నారు. ఈమేరకు గురువారం అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోని 11 రాష్ట్రా ల్లో ఈ భాష ఉనికి ఉందన్నారు. రాజస్థాన్‌లో సంప్రదాయబద్ధంగా గోర్‌బోలి భాషను ఆదరిస్తున్నారని గుర్తుచేశారు. లంబాడాలు తీజ్ పండుగను గొప్పగా జరుపుకుంటారని అన్నారు. ఈ నేపథ్యంలోనే సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. మాజీ ప్రధాని నెహ్రూ చెప్పినట్టుగా భారతదేశం భిన్నత్వంలో ఏకత్వమన్నారు. అది ఆయా భాషల్లోనూ కనిపిస్తుందని చెప్పారు. విద్యాసంస్థల్లోనూ ప్రవేశపెట్టడం ద్వారా విస్తృత ప్రాచుర్యం కల్పించాలని అన్నారు. తెలంగాణ, ఏపీలో ప్రజలు గోర్‌బోలి భాషను మాట్లాడతారని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో లంబాడాలు, బంజారాలు దాదాపు 20 లక్షల మంది ఉంటారని చెప్పారు.

వక్ఫ్ చట్ట సవరణలతో మైనార్టీల హక్కులకు ముప్పు

- **కేంద్ర ప్రభుత్వ తీరుపై ఎంకె స్టాలిన్ విమర్శలు**
- **బిల్లును వ్యతిరేకిస్తూ తమిళనాడు శాసనసభ తీర్మానం**

చెన్నై : మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న వినాశకర విధానాలపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ మరోమారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. వక్ఫ్ చట్టానికి కేంద్రం ప్రతిపాదించిన సవరణలు మైనారిటీల హక్కులకు ముప్పుగా పరిణమిస్తాయని, వక్ఫ్ బోర్డు అధికారాలను హరిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ చట్ట సవరణల బిల్లును వ్యతిరేకిస్తూ తమిళనాడు శాసనసభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ స్టాలిన్ ప్రసంగించారు. ఇది మైనారిటీ వ్యతిరేక బిల్లు అని, వక్ఫ్ బోర్డు అధికారాలను బలహీనపరుస్తుందని, ముస్లిమేతర వక్ఫ్ విరాళాలపై వివక్ష చూపుతుందని ఆయన పేర్కొన్నారు. స్టాలిన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డును బలహీనపరచి వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో జోక్యం చేసుకునేందుకే కేంద్రం ఈ సవరణలు ప్రవేశపెట్టిందని విమర్శించారు. ఈ సవరణలు మత స్వేచ్ఛకు విరుద్ధంగా ఉన్నాయని, ముస్లింల మనోభావాలను గాయపరుస్తాయని చెప్పారు. 'ప్రభుత్వం గుర్తించిన ఏ వక్ఫ్ ఆస్తి అయినా వక్ఫ్ బోర్డు పరిధిలోకి రాదని సవరణలు చెబుతున్నాయి. ఇది అంగీకారయోగ్యం కాదు. ముస్లిమేతరులు ఏర్పాటు చేసిన వక్ఫ్‌లు చెల్లుబాటు కావని సవరణ బిల్లు అంటోంది. ఇది మరింత గందరగోళానికి, అపనమ్మకానికి దారితీస్తుంది. ఇది కేవలం న్యాయపరమైన అంశమే కాదు. మైనారిటీలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల పైన, వారి సంస్థల పైన జరుగుతున్న దాడి. దీనిని మేము వ్యతిరేకిస్తాం' అని స్టాలిన్ అన్నారు.

ప్రతిపాదిత మార్పులపై డీఎంకే, అనేక ప్రతిపక్షాలు ఇప్పటికే గట్టిగా అభ్యంతరాలు వ్యక్తం చేశాయని స్టాలిన్ గుర్తు చేశారు. దాని ఫలితంగానే బిల్లును జెఎసికి నివేదించారని చెప్పారు. ప్రతిపాదిత సవరణలు తమ సంస్థల అధికారాలను నీరుకార్చడానికి చేస్తున్న మరో ప్రయత్నంగా ముస్లింలు భావిస్తున్నారని అన్నారు. కాగా సవరణలను బీజేపీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ సమర్థించారు. వక్ఫ్ బోర్డులో మహిళలు ఉండాలని తాము కోరుకుంటున్నామని ఆమె చెప్ప గా ఈ ప్రతిపాదనను అన్నా డీఎంకే స్వాగతించింది.

యోగిపై ఆగ్రహం

తనపై విమర్శలు చేసిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై స్టాలిన్ ఎదురు దాడికి దిగారు. ప్రాంతం, మతం ఆధారంగా ఆయన ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ద్వి భాషా విధానం, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై తమిళనాడు వైఖరి స్పష్టంగా ఉన్నదని ఆయన అన్నారు. 'విద్వేషంపై మాకు ఉపన్యాసం ఇవ్వాలని యోగి అనుకుంటున్నారా? మమ్మల్ని వదిలేయండి. ఇది వ్యంగ్యం కాదు. సీరియస్‌గా తీసుకోవల్సిన విషయాలను తేలికగా చూడడం' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



రామ్‌చరణ్

'పెద్ది'గా రామ్‌చరణ్

కథానాయకుడు రామ్‌చరణ్ ఈసారి మరో వైవిధ్యమైన చిత్రంతో ప్రేక్షకులను అలరించేందుకు రెడీ అవుతున్నారు. దీనికి బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ బ్యానర్స్‌పై వెంకట సతీష్ కిలారు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు.

రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలను తెలియజేస్తూ మేకర్స్ సినిమా టైటిల్‌ను 'పెద్ది' అని అనౌన్స్ చేశారు. ఈ టైటిల్ రామ్ చరణ్ పాత్రలోని శక్తి, గాంభీర్యాన్ని సంపూర్ణంగా, గొప్పగా తెలియచేస్తోంది.

ఈ సినిమా కోసం రామ్ చరణ్ అందరూ ఆశ్చర్యపోయి చూసేలా తన లుక్‌ను రగ్డ్‌గా మార్చుకోవటం విశేషం. ఈ రా క్యారెక్టర్‌లో నటించటానికి ఆయన స్టార్ ఇమేజ్‌ను సైతం పక్కకు పెట్టి ఇంటెన్స్, రియల్‌గా కనిపించే ప్రయత్నం చేశారు. ఇది వరకు రామ్ చరణ్ కనిపించనటువంటి సరికొత్త లుక్ ఇది. మరో పోస్టర్‌ను గమనిస్తే పాత క్రికెట్ బ్యాట్‌ను పట్టుకుని ఫ్లడ్ లైట్ వెలుతురులో ఓ గ్రామంలోని స్టేడియంలో నిలుచుని ఉన్నాడు. ఈ రెండు పోస్టర్స్ సినిమాలో హీరో పాత్ర నేపథ్యాన్ని, కథ, కథనం.. గ్రామీణ వాతావరణంలోని తీవ్రత, నాటకీయత సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. రామ్ చరణ్ పాత్రను డైరెక్టర్ బుచ్చిబాబు సానా ఎంతో జాగ్రత్తగా రూపొందించినట్లు పోస్టర్స్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. తను చెప్పాలనుకున్న విషయాలను పోస్టర్స్ రూపంలో చూపెట్టారు. ఈ చిత్రం భారీ స్థాయిలో, భారీ బడ్జెట్‌తో, అత్యాధునిక సాంకేతికతతో, అద్భుతమైన దృశ్యంతో ప్రపంచ స్థాయి నిర్మాణ విలువలతో రూపొందుతోంది. ఇందులో శివ రాజ్‌కుమార్ కీలక పాత్రని పోషిస్తుండగా, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుంది. అలాగే జగపతిబాబు, దివ్యేందు శర్మ ఇతర ప్రముఖ పాత్రల్లో మెప్పించనున్నారు.



ఘనంగా 'మ్యాడ్ స్క్వేర్' ప్రీ రిలీజ్ వేడుక

బ్లాక్ బస్టర్ 'మ్యాడ్'కి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ సమర్పకులు. ఈ సినిమా నేడు (శుక్రవారం) విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను అన్నపూర్ణ స్టూడియోస్‌లో వైభవంగా నిర్వహించారు. హీరో అక్కినేని నాగచైతన్య ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుకలో దర్శకులు మారుతి, వెంకీ అట్లూరితో పాటు చిత్ర బృందం పాల్గొంది.

ఈ సందర్భంగా అక్కినేని నాగచైతన్య మాట్లాడుతూ, "మ్యాడ్ స్క్వేర్' ట్రైలర్ చూశాను. అది మ్యాడ్ స్క్వేర్ కాదు, మ్యాడ్ మ్యాక్స్. ట్రైలర్ చాలా బాగుంది. నేను మ్యాడ్ సినిమాలోని కామెడీ సీన్స్ చూస్తూ, ఒత్తిడిని దూరం చేసు కుంటూ ఉంటాను. ఇలాంటి సినిమాలు ఆరోగ్యానికి చాలా మంచిది. డల్‌గా ఉన్నప్పుడు 'మ్యాడ్' లాంటి సినిమా చూడమని డాక్టర్లు కూడా సూచించాలనేది నా అభిప్రాయం. ఇలాంటి సినిమాలు చూడటం వల్ల.. ఫ్రెండ్స్, ఫ్యామిలీతో కలిసి సరదాగా గడిపేలా చేస్తాయి. ఫ్రెండ్ షిప్‌ని స్ట్రాంగ్ చేస్తాయి. కొత్త ఫ్రెండ్స్‌ని పరిచయం చేస్తాయి. ఇలాంటి సినిమాలు రావడం సంతోషంగా ఉంది. 'మ్యాడ్' సినిమాతో ఈ ముగ్గురు హీరోలు స్టార్స్ అయిపోయారు. ప్రతి ఇంట్లో ఒక కుటుంబ సభ్యుడిలా వీళ్ళ పేర్లను గుర్తు పెట్టుకుంటారు. కామెడీ చేయడం అనేది చాలా కష్టం. నార్నె నితిన్, రామ్, సంగీత్‌లో ఆ టాలెంట్ ఉంది కాబట్టే ఇంత నవ్వించగలిగారు. ఒక స్టోరీ డిస్కషన్‌లో దర్శకుడు కళ్యాణ్‌తో కూర్చున్నప్పుడు ఆయన నేరేషన్‌కే పడిపడి నవ్వాను. ఇక ఈ సినిమా ఎలా ఉంటుందో ఊహించగలను. నా ఫేవరెట్ డీఓపీ శామ్‌దత్ ఈ సినిమాకి పనిచేశారు. నిర్మాతగా హారిక మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను. నాది, నాగవంశీ జర్నీ 'ప్రేమమ్'తో మొదలైంది. తన ధైర్యమే నాగ వంశీని ఇంతదూరం తీసుకొచ్చింది' అని తెలిపారు.



నవచిత్రం



ఆటలు

లక్నో కొట్టేసింది

- సొంతగడ్డపై సన్‌రైజర్స్ ఓటమి
- ఛేదనలో పూరన్, మార్ష్ దూకుడు

హైదరాబాద్ 190/9, లక్నో 201/5

సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు సొంతగడ్డపై చుక్కెదురైంది. పవర్‌ప్లేలో అభిషేక్ శర్మ (6), ఇషాన్ కిషన్ (0) నిరాశపరచటంతో తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ 190/9 పరుగులే చేసింది. బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై లక్నో సూపర్‌జెయింట్స్ అలవోక విజయం సాధించింది. ఛేదనలో నికోలస్ పూరన్ (70), మిచెల్ మార్ష్ (52) అర్థ సెంచరీలతో మెరువగా లక్నో 5 వికెట్ల తేడాతో గెలుపొందింది.

నవతెలంగాణ-హైదరాబాద్

నికోలస్ పూరన్ (70, 26 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సులు), మిచెల్ మార్ష్ (52, 31 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సులు) అర్థ సెంచరీలతో కదం తొక్కారు. టాప్ ఆర్డర్‌లో ఇద్దరు బ్యాటర్లు చెలరేగటంతో 191 పరుగుల లక్ష్యాన్ని లక్నో సూపర్‌జెయింట్స్ 16.1 ఓవర్లలోనే ఛేదించింది. మరో 23 బంతులు మిగిలి ఉండగానే 5 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఘన విజయం సాధించింది. ఐపీఎల్18లో సన్‌రైజర్స్‌కు తొలి పరాజయం కాగా.. సూపర్‌జెయింట్స్‌కు ఇది తొలి విజయం. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 190 పరుగులు చేసింది. ఓపెనర్ ట్రావిశ్ హెడ్ (47, 28 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులు), అనికెత్ వర్మ (36, 13 బంతుల్లో 5 సిక్సులు), నితీశ్ కుమార్ రెడ్డి (32, 28 బంతుల్లో 2 ఫోర్లు) సమిష్టిగా మెరిశారు.



లక్నో అలవోకగా..

సూపర్‌జెయింట్స్ ఆడుతూ పాడుతూ లక్ష్యాన్ని ఛేదించింది. ఎడెన్ మార్క్రమ్ (1) విఫలమైనా.. మిచెల్ మార్ష్ (52), నికోలస్ పూరన్ (70) రెండో వికెట్‌కు 116 పరుగులు జోడించారు. 18 బంతుల్లోనే అర్థ సెంచరీ బాదిన పూరన్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఆరు సిక్సర్లు, ఆరు ఫోర్లతో బౌండరీల రూపంలోనే 60 పరుగులు పిండుకున్నాడు. మిచెల్ మార్ష్ సైతం ఏడు ఫోర్లు, రెండు సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. రిషబ్ పంత్ (15), ఆయుశ్ బదాని (6) విఫలమైనా.. డెవిడ్ మిల్లర్ (13 నాటౌట్), అబ్దుల్ సమద్ (22 నాటౌట్) లాంఛనం ముగించారు. సన్‌రైజర్స్ బౌలర్లలో కమిన్స్ (2/29) రాణించాడు.

గురి తప్పింది

తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన సన్‌రైజర్స్‌ను శార్దుల్ ఠాకూర్ దెబ్బకొట్టాడు. వరుస బంతుల్లో అభిషేక్ శర్మ (6), ఇషాన్ కిషన్ (0)ను అవుట్ చేసి హైదరాబాద్ దూకుడుకు కళ్లెం వేశాడు. ట్రావిశ్ హెడ్ (47) ఓ ఎండ్‌లో మెరిసినా.. స్కోరు వేగం అంచనాలను అందుకోలేదు. పవర్‌ప్లేలో 62/2 పరుగులే చేసిన సన్‌రైజర్స్.. ఆ తర్వాత లయ తప్పింది. మిడిల్‌లో నితీశ్ కుమార్ రెడ్డి (32), హెన్రిచ్ క్లాసెన్ (26) నిరాశపరిచారు. అనికెత్ వర్మ (36), పాట్ కమిన్స్ (18) మెరుపులతో సన్‌రైజర్స్ 190 పరుగులు చేరుకుంది. లక్నో బౌలర్లలో శార్దుల్ ఠాకూర్ (4/34) నాలుగు వికెట్లతో ఆకట్టుకున్నాడు.

క్రీడలకు సీఎం పెద్దపీట!

- శాట్ చైర్మెన్ కే. శివసేనా రెడ్డి వెల్లడి
- జాతీయ కరాటే పోటీలు ఆరంభం



హైదరాబాద్ : ఒలింపిక్స్‌లో చిన్న దేశాలు పతకాల వేటలో మెరుస్తుంటే.. మెడల్స్ సాధనలో మన దేశం వెనుకంజ వేయటం బాధాకరమని, అందుకే భవిష్యత్‌లో తెలంగాణ నుంచి ఒలింపిక్ చాంపియన్లను తయారు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం, క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) పట్టుదలతో పని చేస్తున్నాయని శాట్ చైర్మెన్ కే. శివసేనారెడ్డి అన్నారు. క్రీడా రంగంలో అంచెలంచెలుగా ఎదుగుతూ.. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులను చాంపియన్లుగా నిలపాలనే ఆశయంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడలకు పెద్ద పీట వేస్తున్నారని ఆయన తెలిపారు. 4వ జాతీయ కెఐఓ కరాటే చాంపియన్‌షిప్ పోటీలను గురువారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆరంభించిన శివసేనారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'తెలంగాణ గ్రామాల్లోనూ కనిపించే క్రీడ కరాటే. ఆత్మ రక్షణ, స్వీయ నియంత్రణతో పాటు యువతలో క్రమశిక్షణకు కరాటే దోహదం చేస్తుంది. జాతీయ స్థాయి ఈవెంట్‌లో పోటీపడుతున్న క్రీడాకారులు పతక వేటలో కసితో పాటు క్రీడాస్ఫూర్తిని చాటాలని' అన్నారు. జాతీయ స్థాయి కరాటే పోటీల్లో 29 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి సుమారు 1500 మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు.

నేడు ముఖ్యమంత్రి రాక :

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు కరాటే పోటీలకు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. తెలంగాణ కరాటే డూ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ సహా పలువురు శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు పలువురు ముఖ్యమంత్రితో పాటు గచ్చిబౌలి స్టేడియానికి రానున్నారు. ఈ మేరకు శాట్ చైర్మెన్ శివసేనారెడ్డి వెల్లడించారు.

మోయలేని భారంగా అప్పులు

- వడ్డీలు కట్టేందుకే తిరిగి అప్పులు చేయాల్సిన పరిస్థితి
- 2023-24 బడ్జెట్ అంచనా రూ.2,77,690 కోట్లు
- చేసిన వ్యయం రూ.2,19,307 కోట్లు
- 145 సార్లు ఓవర్ డ్రాఫ్ట్‌కు వెళ్లిన సర్కార్
- కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)నివేదిక వెల్లడి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళన కరంగా ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక పేర్కొన్నది. ఆర్థిక క్రమ శిక్షణ పాటించకుండా ఇష్టారీతిన అప్పులు చేయడంతో రాష్ట్రంపై పెను ప్రభావం పడిందని వివరించింది. అప్పుల వడ్డీల కోసం తిరిగి అప్పులు చేయడంతో అవి మోయలేని భారంగా మారాయని పేర్కొన్నది. అప్పుల ద్వారానే లోటును భర్తీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించింది. 2023-24 ఏడాది కాలంతో కలిపి గత ఐదేండ్లలో రూ.4,03,664 కోట్ల అప్పులు చేసినట్టు కాగ్ పేర్కొన్నది. 2023-24 బడ్జెట్ అంచనా రూ.2,77,690 కోట్లు కాగా, చేసిన వ్యయం రూ.2,19,307 కోట్లుగా వివరించింది. పబ్లిక్ మార్కెట్ నుంచి రూ. 49,618 కోట్ల అప్పులు తీసుకున్నట్టు కాగ్ పేర్కొన్నది. గడిచిన ఏడాది ఎఫ్ఆర్‌బీఎం పరిధి కన్నా అధికంగా అప్పులు చేసినట్టు వివరించింది. పలు కార్పొరేషన్ల ద్వారా సుమారు రూ. 2.20 లక్షల కోట్ల అప్పు తీసుకున్నట్టు కాగ్ పేర్కొన్నది. వేతనాల కోసం రూ.26,981 కోట్లు, స్థానిక సంస్థలతో పాటు ఇతర సంస్థలకు రూ.76,776 కోట్ల చెల్లింపులు జరిగాయని, స్థానిక సంస్థలకు 11 శాతం నిధులు పెంచినట్టు వివరించింది. ఇక 2022-24లో ప్రభుత్వం సుమారు రూ. 53,144 కోట్లు అప్పు చేసినట్టు కాగ్ పేర్కొన్నది. బడ్జెట్ అంచనాలో సుమారు 79 శాతం వ్యయం అయిందని వివరించింది. ప్రభుత్వ ఖజానాకు పన్నుల ద్వారా 61.89 శాతం నిధులు వస్తున్నాయని స్పష్టం చేసింది. 2023-24లో కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు రూ.9,934 కోట్లని కాగ్ పేర్కొన్నది. రెవెన్యూ రాబడుల్లో 45 శాతం సర్కారీ ఉద్యోగుల వేతనాలు, అప్పుల వడీలు, పెన్షన్లకు ఖర్చవుతోందని కాగ్ నివేదిక వివరించింది. 2023-24లో రెవెన్యూ మిగులు రూ.779 కోట్లని, లోటు రూ49,977 కోట్లుని పేర్కొన్నది. 145 సార్లు రూ.35,992 కోట్లు ఓవర్‌డ్రాఫ్ట్(ఓడీ)కు వెళ్లినట్టు వివరించింది. అత్యధికంగా 2023 మేలో 20 సార్లు, అక్టోబర్‌లో 21 ఓడీకి సర్కార్ వెళ్లింది.

2023-24 కాగ్ నివేదిక ముఖ్యాంశాలు

- వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ ద్వారా రూ.10,156 కోట్లు
- రూ.35,425 కోట్ల ఓవర్‌డ్రాఫ్ట్‌ను 145 రోజుల పాటు వాడుకుంది
- 2023-24లో వడ్డీల చెల్లింపుల కోసం రూ.24,347 కోట్ల వ్యయం
- వేతనాలకు రూ.26,981 కోట్లు ఖర్చు
- ఖజానాకు పన్ను ఆదాయం నుంచే 61.83 శాతం నిధులు
- 2023-24లో కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు మొత్తం రూ.9,934 కోట్లు
- రెవెన్యూ రాబడుల్లో 45 శాతం వేతనాలు, వడ్డీ చెల్లింపులు, పింఛన్లకే ఖర్చు
- రెవెన్యూ మిగులు రూ.779 కోట్లు
- రెవెన్యూ లోటు రూ.49,977 కోట్లు, జీఎస్డీపీలో రెవెన్యూ లోటు 3.33 శాతం
- రుణాల మొత్తం 4,03,664 కోట్లు
- జీఎస్డీపీలో అప్పులు 27 శాతం
- ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీల మొత్తం రూ.2,20,607 కోట్లు
- మూలధనం కింద రూ.43,918 కోట్ల ఖర్చు
- స్థానిక సంస్థలు, ఇతర సంస్థలకు ప్రభుత్వం ఇచ్చిన నిధులు రూ.76,773 కోట్లు

కేంద్రం విధానం దక్షిణాదికి పూర్తి వ్యతిరేకం

- రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



బాగా పనిచేస్తున్న రాష్ట్రాలకు ఏమీ ఇవ్వకుండా, వాటిని పూర్తిగా నాశనం చేయడమే కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానమని సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ అన్నారు. "కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానం కేరళ, దక్షిణ భారతదేశానికి పూర్తిగా వ్యతిరేకంగా ఉంది. ఆర్థిక మంత్రి తమిళనాడుకు చెందినవారు అయినప్పటికీ, ఆర్థిక అంశాలపై దక్షిణాది పట్ల తీవ్ర వివక్ష చూపడం దురదృష్టకరం" అని ఆర్థిక బిల్లుపై చర్చలో ఆయన విమర్శించారు. గురువారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ మొత్తం జీడీపీలో 31 శాతం వాటా కలిగిన దక్షిణ భారతదేశానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిఫలంగా ఏమీ ఇవ్వడం లేదని జాన్ బ్రిట్టాస్ ఎత్తి చూపారు. 2023-2024లో దక్షిణ భారత రాష్ట్రాలకు స్థూల ఆదాయంలో 15.7 శాతం కేంద్రం కేటాయించింది. అయితే, ఉత్తరప్రదేశ్‌కు 18 శాతం మాత్రమే కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సందేశం పంపుతోంది. 'మీరు మెరుగ్గా పనిచేస్తే, కథ ముగిసినట్లే'. కేరళ ఆరోగ్య రంగంలో మెరుగైన స్థితిలో ఉన్నందునే ఎయిమ్స్ ఇవ్వలేదని ఆరోగ్య మంత్రి సభలో చేసిన ప్రకటన దీనికి నిదర్శనం. ముందున్న వారికి ఎవరూ ఏమీ ఇవ్వరని చెప్పడం సిగ్గుచేటు. ప్రణాళికా సంఘాన్ని మూసివేసి, రాష్ట్రాలకు నిధుల పంపిణీ చేసే మొత్తం అధికారాన్ని ఆర్థిక మంత్రిత్వ శాఖకు బదిలీ చేసిన ఫలితంగా ఇది జరిగింది. జనాభాను విజయవంతంగా నియంత్రించడం పేరుతో కేరళ వాటాను తగ్గించడం ఆమోదయోగ్యం కాదు. కేంద్ర ప్రాయోజిత పథకం పేరుతో ఎన్డీఏ ప్రభుత్వం మోసానికి పాల్పడుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్' అని పేరు పెడితేనే నిధులు కేటాయిస్తామని చెబుతున్నారు. రాష్ట్ర నిధులను తగ్గించడం, నిలిపివేయడం వల్ల ప్రతిపక్ష పార్టీలు పాలించే రాష్ట్రాల పాలనను సాధ్యమైనంతవరకు అంతరాయం కలిగించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బ్రిట్టాస్ ధ్వజమెత్తారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్



మణిపాల్ సిగ్నాలో

ఎల్ఐసీ వాటాల కొనుగోలు..!

తద్వారా వైద్య బీమా రంగంలోకి ప్రవేశం

న్యూఢిల్లీ : వైద్య బీమా రంగంలోకి ప్రవేశించడానికి ప్రభుత్వ జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ చేస్తోన్న ప్రయత్నాలు చివరి దశకు చేరుకున్నాయని తెలుస్తోంది. ఇందుకోసం మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్‌లో మైనారిటీ వాటా కొనుగోలుకు తుది కసరత్తు చేస్తోందని ఆంగ్ల మీడియాలో రిపోర్టులు వస్తోన్నాయి. మణిపాల్ సిగ్నాలో 40- 49 శాతం వాటాను కొనుగోలు చేయనుందని సంబంధిత అధికారులు వెల్లడించారు. దీని విలువ రూ.3,500-3,750 కోట్లుగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. వైద్య బీమాలోకి ప్రవేశించనున్నట్టు ఇటీవలే ఎల్ఐసీ చైర్మెన్ సిద్ధార్థ మోహంతి వెల్లడించారు. ఈ నెలాఖరు కల్లా స్పష్టత ఇవ్వనున్నామని చెప్పారు. మణిపాల్ సిగ్నాలో మైనారిటీ వాటా కొనుగోలుకు ఎల్ఐసీ ఇప్పటికే సూత్రప్రాయంగా బోర్డు ఆమోదం పొందిందని తెలుస్తోంది. ఎల్ఐసీ విలువ, బోర్డు నిర్ణయాలు ఇతరత్రా అవకాశాల్ని పరిగణనలోకి తీసుకొని వైద్య బీమా సంస్థలో వాటా కొనుగోలు ఉంటుందని మోహంతి తెలిపారు. బీమా రంగంలోకి ప్రవేశించడం ద్వారా తన ఉనికిని మరింత విస్తరించుకోవాలని ఎల్ఐసి లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఎల్ఐసీ నికర లాభాలు 17 శాతం పెరిగి రూ.11,056 కోట్లకు చేరాయి. గురువారం బీఎస్ఈలో ఎల్ఐసీ షేర్ విలువ 1.79 శాతం పెరిగి రూ.800.65 వద్ద ముగిసింది.

మొబిల్‌వేర్ టెక్నాలజీస్‌లో జాగల్‌కు వాటా

హైదరాబాద్ : పేమెంట్ సొల్యూషన్స్ ప్రొవైడర్ మొబిల్‌వేర్ టెక్నాలజీస్‌లో 38 శాతం వాటాను స్వాధీనం చేసుకున్నట్టు జాగల్ ప్రీ పెయిడ్ సొల్యూషన్స్ వెల్లడించింది. ఈ వాటాను రూ.22.85 కోట్లతో కొనుగోలు చేసినట్టు వెల్లడించింది. పోస్ట్ ఇష్యూ ద్వారా 26 శాతం వాటాను రూ.15.60 కోట్లతో, మరో 12.34 శాతం వాటాను ప్రమోటర్ల నుంచి రూ.7.25 కోట్లతో స్వాధీనం చేసుకున్నట్టు జాగల్ ఎండీ, సీఈఓ అవినాష్ గొడ్‌ఖింది తెలిపారు.

భారత వాయుసేనతో

బంధన్ బ్యాంక్ ఒప్పందం

న్యూఢిల్లీ : ప్రయివేటు రంగంలోని బంధన్ బ్యాంక్ భారత వాయు సేనతో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ రంగంలో పని చేసే రక్షణ సిబ్బంది వేతనాల ఖాతాలను 'బంధన్ బ్యాంక్ శౌర్య సాలరీ ఎకౌంట్' పేరుతో నిర్వహించడానికి భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఆ బ్యాంక్ పేర్కొంది. జీరో బ్యాలెన్స్ సేవింగ్స్ ఎకౌంట్ సహా సిబ్బంది, వారి కుటుంబానికి భద్రత, ఆకర్షణీయ వడ్డీ రేట్లను అందించనున్నట్లు బంధన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజిందర్ బబ్బర్ తెలిపారు. ఈ సంస్థకు ప్రస్తుతం 6,300 శాఖలున్నాయి.

ఇన్ఫోసిస్‌లో

మరోమారు ట్రైనీల తొలగింపు..!

బెంగళూరు : దేశంలోనే రెండో అతిపెద్ద ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ మరోమారు తమ ట్రైనీ ఉద్యోగులపై వేటు వేసిందని సమాచారం. తుది ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రోగ్రాంలో విఫలమైన కారణంగా 40-45 మంది ట్రైనీలను తొలగిస్తూ ఈమెయిల్స్ పంపినట్టు రిపోర్టులు వస్తోన్నాయి. ఫైనల్ అసెస్‌మెంట్‌లో రాణించలేకపోయినందున ఫౌండేషన్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కింద అర్హతను సాధించలేకపోయారని ఆ సంస్థ ట్రైనీలకు పంపిన మెయిల్‌లో పేర్కొంది. లేఆఫ్ ఎదుర్కొన్న ట్రైనీలకు రిలీవింగ్ లెటర్‌తో పాటూ ఒక నెల ఎక్స్‌గ్రేషియో ఇవ్వనుంది. కాగా.. ఈ విషయాన్ని ఆ కంపెనీ ధ్రువీకరించలేదు. గత నెలలోనూ మైసూరు క్యాంపస్‌లో దాదాపు 400 మంది ట్రైనీ ఉద్యోగులను బలవంతంగా బయటికి పంపించి తీవ్ర విమర్శలను ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈ విషయమై ట్రైనీలు ఏకంగా ప్రధాన మంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేశారు.

ఐపీఆర్ ఉల్లంఘనలపై

మెట్రో బ్రాండ్స్ చర్యలు

హైదరాబాద్ : తన రిజిస్టర్డ్ ట్రేడ్‌మార్క్ ఉల్లంఘన (ఐపీఆర్)లను చట్టవిరుద్ధంగా ఉపయోగించడంపై ఇటీవల చర్యలను ప్రారంభించినట్టు ప్రముఖ పాదరక్షల రిటైలర్లలో ఒకటైన మెట్రో బ్రాండ్స్ లిమిటెడ్ పేర్కొంది. దీనిలో భాగంగా హైదరాబాద్‌లోని మెట్రో మిరాకిల్‌పై స్థానిక అధికారులతో కలిసి సోదాలు నిర్వహించి మెట్రో బ్రాండ్స్ ట్రేడ్‌మార్క్‌లను కలిగి ఉన్న ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపింది. నకిలీ వస్తువుల నుంచి తమ వినియోగదారులను రక్షించడానికి శ్రమిస్తున్నామని మెట్రో బ్రాండ్స్ వైస్ ప్రెసిడెంట్ లీగల్ అండ్ కంపెనీ సెక్రెటరీ దీపా సూద్ పేర్కొన్నారు.

విరామ మహిళ ఉద్యోగులకు

క్వాలిజీల్ మద్దతు

హైదరాబాద్ : మహిళ నిపుణులు కేరీర్ విరామం తర్వాత మళ్లీ ఉద్యోగాల్లో చేరటానికి అవకాశాలు కల్పిస్తున్నట్టు ఇంజినీరింగ్ సంస్థ క్వాలిజీల్ తెలిపింది. రీస్టార్ట్ విత్ క్వాలిజీల్‌తో మహిళలకు మద్దతును అందిస్తున్నట్టు ఆ సంస్థ ఇండియా హెడ్ మధుమూర్తి పేర్కొన్నారు. 43 శాతం మహిళా ఉద్యోగులతో వైవిధ్యం, సమానత్వం, సమ్మిళిత వృద్ధిని పెంపొందించడానికి క్వాలిజీల్ కట్టుబడి ఉందన్నారు.

కెనన్ నుంచి కొత్త ఈఓఎస్ ఆర్50వి

న్యూఢిల్లీ : ప్రముఖ కెమెరా ఉత్పత్తుల కంపెనీ కెనన్ కొత్తగా ఈఓఎస్ ఆర్ 50 వి మోడల్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఇఒఎస్ ఆర్50 మిర్రర్‌లెస్ కెమెరా కలిగిన దీని ధరను రూ.79,995గా నిర్ణయించింది. ఇది ఫిల్మ్‌మేకర్లు, డిజిటల్ స్టోరీ టెల్లర్స్ అవసరాలను తీర్చనుందని ఆ కంపెనీ పేర్కొంది. 4కె 30పి రికార్డింగ్, ఫుల్ హెచ్‌డీ 120పి స్లో మోషన్ క్యాప్చర్ ఫీచర్లను కలిగి ఉందని తెలిపింది.

పని ఒత్తిడిపై 40 శాతం మంది ఆందోళన

ఎల్‌జీ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ : పని ఒత్తిడి అధికంగా ఉందని 40 శాతం మంది ఆందోళన వ్యక్తం చేసినట్టు ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ సర్వేలో వెల్లడయ్యింది. నిల్సన్ ఐక్యూ భాగస్వామ్యంతో 1313 మందిపై 'లైఫ్ ఈజ్ గుడ్' పేరుతో అధ్యయనం చేసినట్టు ఎల్‌జీ తెలిపింది. గడిచిన ఐదేండ్లుగా పని, జీవితం మెరుగుపడిందని 24 శాతం వర్కింగ్ ప్రొఫెషన్స్ పేర్కొన్నారు. వ్యక్తిగత లక్ష్యాలపై 38 శాతం ఆశావాదాన్ని వ్యక్తం చేశారు. కుటుంబ బంధాల ద్వారా సంతృప్తికరమైన జీవితాన్ని గడుపుతున్నామని 51 శాతం పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో మురిగిన నిధులు

రూ.50 వేల కోట్ల సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు చేయలేదు • రూ.40 వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టారు

ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరతాం :
ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ,మైనారిటీ, స్త్రీ శిశు సంక్షేమం కోసం 70,474 కోట్లు కేటాయించి ఖర్చు చేయలేదని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో చెప్పారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ.50 వేల కోట్లు ఖర్చు పెడతామని చెప్పి, ఆ తర్వాత వ్యయం చేయకుండా వదిలేశారని విమర్శించారు. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా గురువారం శాసనసభలో బీఆర్ఎస్ సభ్యులు తన్నీరు హరీశ్‌రావు, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వరరెడ్డి, సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు తదితరులు లేవనెత్తిన వివిధ అంశాలకు డిప్యూటీ సీఎం సుదీర్ఘంగా సమాధానమిచ్చారు. తాను యాదృచ్ఛికంగా రాజకీయ నాయకుడిని కాలేదని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. సమసమాజ స్థాపనతోనే అభివృద్ధి సాధ్యమని, అది చట్టసభల ద్వారానే సాధ్యమనే భావనతోనే రాజకీయాల్లోకి వచ్చానని వివరించారు. అంతేతప్ప వ్యక్తిగత స్వార్థం కోసం రాలేదన్నారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన ఆర్థిక విధ్వంసం మొత్తాన్ని తవ్వితీస్తానని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. వాస్తవాలన్నింటినీ ప్రజలకు వివరిస్తానని అన్నారు.

సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని తెలిపారు. తాము అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ సర్వేను నిర్వహించామని గుర్తు చేశారు. తెలంగాణలో 86 శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన నిధులను ఖర్చు చేయలేదనే విషయం ఆ సర్వే ద్వారా తేలిందన్నారు. ఈ నేపథ్యంలో వారి సంక్షేమానికి అధిక మొత్తంలో నిధులు కేటాయించామని తెలిపారు. రాబోయే ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన మొత్తం రూ.3.04 లక్షల కోట్ల బడ్జెట్‌లో ఆ రంగానికి రూ.1,44,156 కోట్లను కేటాయించామని వివరించారు. వాస్తవ రాబడిని దృష్టిలో ఉంచుకునే ఆ మేరకు నిధులు కేటాయించామని తెలిపారు.బీఆర్ఎస్ హయాంలో రూ.40 వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో ఉంచారని విమర్శించారు.

ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలకు ఇవి అదనమని తెలిపారు. రూ.1,59,940 కోట్ల పనులను శాంక్షన్ చేసి, సంబంధింత బిల్లులను కూడా పెండింగ్‌లో పెట్టి పోయారని వాపోయారు. ఉద్యోగులు రిటైర్ అయితే వారికివ్వాల్సిన గ్రాడ్యుటీ తదితర భారాలు ప్రభుత్వంపై పడతాయని భావించి, వారి ఉద్యోగ విరమణ వయస్సును మూడు సంవత్సరాలు పెంచారని గుర్తు చేశారు. ఈ క్రమంలో మొత్తం ఉద్యోగుల బకాయిలు రూ.20వేల కోట్లు ఉండగా, అందులో తమ ప్రభుత్వం రూ.16 వేల కోట్లను క్లియర్ చేసిందని తెలిపారు. పాలనలో భాగస్వాములైన ఉద్యోగులను పిలిచి ఈ వివరాలన్నింటినీ తెలిపామని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లాగా తాము ప్రతీయేటా బడ్జెట్‌లో 20 శాతం అంచనాలను పెంచుకుంటూ పోలేదని ఆయన ఎద్దేవా చేశారు. లక్ష మంది అధికారులతో గతంలో ఎన్నడూ లేని విధంగా కుల గణన చేయించామని తెలిపారు. దాని ఆధారంగా రాష్ట్రంలోని వనరులను జనాభా దామాషా ప్రకారం పంపిణీ చేస్తామన్నారు. దశాబ్దాలపాటు అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణను చేపట్టామని తెలిపారు. ఆరు గ్యారెంటీల అమలుకు బడ్జెట్‌లో రూ.56,084 కోట్లు కేటాయించామని గుర్తు చేశారు. వాటిని కచ్చితంగా అమలు చేసి తీరతామని స్పష్టం చేశారు.

సర్కారు బడుల్లో ఏఐ వినియోగం

- పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాకు ఐదు పాఠశాలల్లో అమలు
- ఒకటి నుంచి ఐదో తరగతి వరకు స్కూళ్ల ఎంపిక
- కలెక్టర్లకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ని వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు అమలు చేయనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు జిల్లాల కలెక్టర్లకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా గురువారం లేఖ రాశారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ పరిజ్ఞానాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఏఐ ఆధారిత వినియోగం పెరుగుతున్నదని వివరించారు. దీంతో సంప్రదాయ ఉద్యోగాలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. ఏఐ వినియోగించడం వల్ల 41 శాతం ఉద్యోగాలు పోతాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రకటించిందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా నైపుణ్యం ఉన్న యువతకు ఉద్యోగావకాశాలు దక్కుతాయని తెలిపారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యం పెంచేందుకు ఏఐలో శిక్షణ ఇచ్చేందుకు, కోడింగ్, డిజిటల్ పరిజ్ఞానం పెంచేందుకు సమస్యలను పరిష్కరించే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. భవిష్యత్తు ఏఐదే అయినందున దానిపై విద్యార్థులకు పరిజ్ఞానం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజన్‌తో ముందుకెళున్నారని పేర్కొన్నా రు. ఏఐ వినియోగం, డిజిటల్ పరిజ్ఞానంపై విద్యార్థు లకు నైపుణ్యం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. నాణ్యమైన శిక్షణను ఆవిష్కరణతో కూడిన విద్యను ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని వివరించారు. అందులో భాగంగానే ప్రాథమిక పాఠశాలల్లో ఏఐని వినియోగి స్తున్నామని పేర్కొన్నారు. 21వ శతాబ్దంలో ఉన్నామ నీ, అందుకు అవసరమైన నైపుణ్యాన్ని విద్యార్థులకు అందించడమే లక్ష్యమని తెలిపారు. రాబోయే కాలంలో విద్యార్థులు రాణించేలా అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తామని పేర్కొన్నారు. దీన్ని అమలు చేయడం కోసం ఉపాధ్యాయులు, హెడ్మాస్టర్లు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఎంఈవోలు, డీఈవోలకు శిక్షణ ఇస్తామని వివరించారు. జిల్లాలో డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అందుబాటులో ఉన్న (కనీసం రెండు కంప్యూటర్లు/ట్యాబ్‌లు) ఐదు ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేయాలని కలెక్టర్లకు ఆమె సూచించారు. పటిష్టంగా దీన్ని అమలు చేయాలని కోరారు. శనివారంలోగా ఎంపిక చేసిన పాఠశాలల వివరాలను పంపించాలని ఆదేశించారు. ఎంఈవోలు, ఒక సీఆర్పీ, ప్రతి పాఠశాల నుంచి ఒక టీచర్‌ను ఎంపిక చేయాలని కోరారు. వచ్చేనెల రెండున వర్చువల్ పద్ధతిలో శిక్షణ ఉంటుందనీ, మూడున భౌతిక శిక్షణను నిర్వహిస్తామని వివరించారు. శిక్షణ ఎక్కడ నిర్వహిస్తామనే సమాచారాన్ని తర్వాత తెలియజేస్తామని పేర్కొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ

ఎమ్మెల్యే వివేకానంద



నవతెలంగాణ-సిటీబ్యూరో

బీజేపీ, కాంగ్రెస్ గల్లీలో కుస్తీలా.. ఢిల్లీలో దోస్తీలా వ్యవహరిస్తున్నాయని హైదరాబాద్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ లోపాయికారీ ఒప్పందం అసెంబ్లీ వేదికగా బయట పడిందన్నారు. తమ ప్రశ్నలకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమాధానం చెప్పలేక బీజేపీ సభ్యులతో బీఆర్ఎస్ పార్టీపై దాడి చేయిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ రాసిచ్చిన స్క్రిప్ట్‌నే బీజేపీ సభ్యులు అసెంబ్లీలో చదువుతున్నారని, వీళ్ల మైత్రి బంధం ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరాన్ని కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వమే అన్ని అనుమతులూ ఇచ్చిందన్నారు. బీజేపీ నేతలు కాంగ్రెస్ సభ్యుల్లా ప్రవర్తిస్తున్నారని, అలాంటి వారు ఆ పార్టీలో ఉండటం ఎందుకుని, కాంగ్రెస్‌లో విలీనం చేస్తే సరిపోతుందని ఎద్దేవా చేశారు.

అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, గడిచిన 16 నెలలుగా ఉద్యోగస్తులను అవమానిస్తూ వస్తోందని అన్నారు. పెండింగ్ డీఏ, పీఆర్సీ, పెండింగ్ బిల్లులను అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ఇస్తామని కాంగ్రెస్ హామీనిచ్చిందని గుర్తు చేశారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రిని పొగడ్తలతో ముంచెత్తుతున్న బీజేపీ: ఎమ్మెల్యే సంజయ్

కాంగ్రెస్‌ను కాపాడండి.. బీజేపీని ముంచండి అనే విధంగా రాష్ట్రంలో బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. పొద్దున లేస్తే బీజేపీ నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో డీలింగ్‌లు పెట్టుకుంటున్నారని, సీఎంను పొగడ్తలతో ముంచెత్తుతున్నారని విమర్శించారు. అహంకారపూరితంగా కేటీఆర్‌ని బెదిరిస్తూ మాట్లాడుతున్నారన్నారు. ఇది సబబు కాదన్నారు. కాంగ్రెస్ శాసన సభ్యులే 30శాతం కమీషన్ ప్రభుత్వం అన్నారని.. అదే మాట్లాడితే కేటీఆర్‌ను బెదిరిస్తూ మాట్లాడాతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతారహితంగా, దిగజారి మాట్లాడుతున్నారన్నారు.

తమ పార్టీ బీఫామ్‌పై గెలిచిన వారిని నిలదీస్తాం.. : ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



తనను అరెస్టు చేయడానికి సంక్రాంతి పండుగ రోజు పోలీసులను పంపారని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియాపాయింట్ వద్ద అయన మాట్లాడుతూ.. పోలీసులకు పండుగలు ఉండవా అని ప్రశ్నించారు. తనను అరెస్టు చేయడానికి పోలీసులను ఇబ్బంది పెట్టారన్నారు. తమ పార్టీ బీఫామ్ మీద గెలిచిన వారిని నిలదీస్తామన్నారు. తనను హత్య చేయడానికి వచ్చిన వారిని ఇప్పటివరకు అరెస్టు చేయలేదన్నారు. ఉప ఎన్నికలు రావని, ఏ ఎమ్మెల్యే కూడా డిస్క్వాలిఫై కారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని, ఏప్రిల్ 2న కేసు సుప్రీం కోర్టులో బెంచ్ పైకి వస్తుందని, ఆ వీడియోలను అప్పుడు జడ్జి ముందు పెడ్తామని చెప్పారు.

పార్టీ మారినవాళ్లు డిస్క్వాలీఫై కాక తప్పదని, ఉప ఎన్నిక రాక తప్పదని అన్నారు. తన నియోజకవర్గంలో నీళ్లు రావడం లేదంటూ అడుగుతుంటే అసెంబ్లీలో మైక్ కాట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తన మీద కోపం ఉంటే తీర్చుకోండి కానీ, తన నియోజకవర్గ రైతులపై వద్దన్నారు. రాఘవా కన్‌స్ట్రక్షన్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. తన నియోజకవర్గంలో కొండూరు ప్రాజెక్టును ఏడు సంవత్సరాలు గడుస్తున్నా పూర్తి చేయలేదన్నారు. సుంకిశాల కూలడానికి మేఘా కన్‌స్ట్రక్షనే కారణమన్నారు. రాఘవా కన్‌స్ట్రక్షన్, మేఘా కన్‌స్ట్రక్షన్ రెండింటినీ బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టకుండా వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. ప్రెస్ మిత్రులకు తమ ప్రభుత్వ హయాంలో ఇండ్ల పట్టాలు ఇచ్చామని, వారికి వెంటనే ఆపకుండా మంజూరు చేయాలని కోరారు. అసెంబ్లీలో ప్రెస్ మిత్రులకు నీళ్ళు, భోజనాలు సరిగ్గా పెట్టడం లేదన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో శాంతి భద్రతలు క్షీణించే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి? : ఎమ్మెల్యే పాయల్ శంకర్

రాష్ట్రంలో సమస్యలు ఏవీ లేనట్టు నియోజకవర్గాల పునర్విభజనపై చర్చ పెట్టారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల అమలు ఏమైందని ప్రశ్నించారు. బీజేపీ దక్షణాది రాష్ట్రాలకు ఏదో అన్యాయం చేస్తున్నట్టు మాట్లాడుతున్నారని, కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ కలిసే ఉన్నాయని, అందుకే తమిళనాడులో స్టాలిన్ మీటింగ్ పెడితే కలిసి వెళ్లారని అన్నారు. ప్రజల్లో స్టాలిన్‌పై వ్యతిరేకత ఉందని, వచ్చే సంవత్సరం ఎన్నికలు ఉన్నాయని ఏదో చర్చ పెట్టారన్నారు.

ప్రధాని, హెూంమంత్రి, కేంద్ర మంత్రులు నియోజకవర్గాల పునర్విభజనపై ఎటువంటి చర్చా చేయలేదన్నారు. స్టాలిన్‌పై వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి నియోజకవర్గాల పునర్విభజనపై చర్చలు పెట్టారన్నారు. జమ్మూ కశ్మీర్ ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విభజన జరిగిందన్నారు. బీజేపీకి అన్ని రాష్ట్రాలూ సమానమేనన్నారు. ప్రతి సమస్యపైనా చర్చ పెట్టాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. నియోజవర్గాల పునర్విభజనపై బిల్లు పెట్టి మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్నారు. తమిళనాడులో స్టాలిన్‌పై వ్యతిరేకత మొదలైందని, అందుకే బీజేపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీలో నియోజకవర్గాల పునర్విభజనపై చర్చ లేకుండా ముగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

బీహార్ ఎన్నికల కోసమే

- 'సౌగత్-ఎ-మోడీ' స్కీమ్‌పై ఉద్ధవ్ విసుర్లు
- బీజేపీది 'కపట నాటకం' : కాంగ్రెస్
- రాజకీయ ప్రయోజనాల కోసమే : బీఎస్పీ



ముంబయి : బీజేపీ కొత్తగా ప్రారంభించిన 'సౌగత్-ఎ-మోడీ' పథకంపై శివసేన(యూబీటీ) చీఫ్ విమర్శలు చేశారు. ఆ పార్టీ తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. బీజేపీ హిందూత్వాన్ని వదిలిపెట్టి.. 'సత్తా జిహాద్ (పవర్ జిహాద్)'ని ఆశ్రయించిందని ఆరోపించారు. బీజేపీ పథకాన్ని థాక్రే.. 'సౌగత్-ఎ-సత్తా(అధికార బహుమతి)'గా అభివర్ణించారు. బీహార్‌లో ఎన్నికల ప్రయోజనం కోసం బీజేపీ బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. బీజేపీ హిందూత్వాన్ని వదిలిపెట్టినట్టు ప్రకటించాలన్నారు. బుల్డోజర్ల ద్వారా ఇండ్లు కూల్చేసినవారికి, మత అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన చాలా మందికి వారు అధికారం కోసం బహుమతులు పంచుతున్నారనీ, ఇది బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసమేననీ, బీజేపీ సత్తా జిహాద్‌ను ఆశ్రయించిందని థాక్రే అన్నారు. రంజాన్‌కు ముందు ఆర్థికంగా వెనుకబడిన ముస్లిం కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని బీజేపీ మంగళవారం దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ముస్లింలకు ప్రత్యేక పండుగ కిట్‌లను పంపిణీ చేస్తున్నది. బీజేపీ చీఫ్ జె.పి నడ్డా నేతృత్వంలో ఢిల్లీలోని నిజాముద్దీన్‌లో ఈ పథకం ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా దాదాపు 32 లక్షల మందికి దీనితో ప్రయోజనం చేకూరనున్నది. ఈద్ కిట్లలో డ్రైఫ్రూట్స్, శనిగపిండి, రవ్వ, వెర్మిసెల్లి, చక్కెర వంటి ఆహార పదర్థాలున్నాయి. పురుషుల కోసం కుర్తా పైజామా, మహిళల డ్రెస్ కోసం మెటీరియల్ అందిస్తున్నారు. ఈ ఏడాది చివరల్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా బీజేపీ ఇప్పుడు రంజాన్ మాసంలో ముస్లింలకు ప్రత్యేక కిట్‌లను పంచుతుండటం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమవుతున్నది.

'గతంలో ముస్లింలే టార్గెట్‌గా ప్రచారాలు.. ఇప్పుడు కిట్లు పంచటమా!?'

కాంగ్రెస్, బీఎస్పీ వంటి పార్టీలు సైతం బీజేపీ చేస్తున్న ప్రచారంపై ఆశ్చర్యం వ్యక్తం చేశాయి. గతంలో ముస్లింలను టార్గెట్‌గా చేసుకుంటూ ప్రచారాలు చేసి, వారి ఇండ్లు కూలదోసి.. ఇప్పుడు 'సౌగత్-ఎ-మోడీ' కిట్లు పంచటాన్ని ఒక కపట డ్రామాగా కాంగ్రెస్ అధికార ప్రతినిధి షామా మహ్మద్ ఆరోపించారు. ఇది ఒక రాజకీయ చర్య అని బీఎస్పీ అధినేత్రి మాయావతి అభివర్ణించారు. బీజేపీ చర్యను 'జోక్ ఆఫ్ ది డే'గా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ కీర్తీ ఆజాద్ పేర్కొన్నారు.

పోలవరం @ 2027 డిసెంబర్

- 2026 జూన్‌కు పునరావాసం పూర్తిచేస్తాం : పరిశీలనలో సిఎం చంద్రబాబు



అమరావతి : పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికి పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ప్రాజెక్టు పనులను ఆయన గురువారం పరిశీలించారు. అంతకుముందు నిర్వాసితులతో మాట్లాడారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ తరువాత జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2027 డిసెంబరు నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సాంకేతిక సమస్యలు ఏమీ లేకపోతే ఆరు నెలల ముందే జూన్ నాటికే ప్రాజెక్టును పూర్తి చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. 2026 జూన్ నాటికి పూనారావాస ప్రక్రియను పూర్తి చేసి, గ్రావిటీపై నీటిని విడుదల చేస్తామని చెప్పారు. పునరావాస ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టే అంశాన్ని పరిశీలిస్తామని అన్నారు. ఎంఎస్ఎంఇలు పెట్టుకుంటే ప్రభుత్వం తరపున ప్రోత్సాహకం కల్పిస్తామని చెప్పారు. అదనంగా ఇంకా ఏమీ చేయగలుగుతామో ఆలోచిస్తామని అన్నారు. 2019కి ముందు పోలవరంలో మొదటి, రెండవ దశలు లేవని, గత పాలకుల నిర్వాకమే ఇందుకు కారణమన్నారు. మళ్లీ వెనక్కి వెళితే ప్రాజెక్టు ఉనికికే ప్రమాదం ఉన్నందున తొలుత మొదటి దశ పూర్తి చేసిన అనంతరం రెండవ దశ పనులు మొదలు పెడతామన్నారు. కేంద్రం, ప్రాజెక్టు అథారిటీ వారించినా వినకుండా ఇష్టం వచ్చినట్లు గత పాలకులు ప్రవర్తించడంతో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.2,782 కోట్లు అదనపు వ్యయం అవుతుందన్నారు. కాపర్ డ్యామ్ నిర్మాణం పూర్తి చేయకపోవడం వల్ల మరో మారు డయాఫ్రం వాల్ నిర్మించాల్సి వస్తుందని, ఇందుకు రూ.990 కోట్లు ఖర్చువుతుందన్నారు. పునరావాసానికి కూడా ఖర్చు పెరిగిందని తెలిపారు. ఈ ఏడాది 4 వేల టిఎంసిలు నీరు సముద్రంలో కలిసిందని, వీటిలో కనీసం 400 టిఎంసిల నీటిని వినియోగించుకుంటే రాష్ట్రంలో కరువు లేకుండా చేయవచ్చన్నారు. 2019 నాటికి 73 శాతం పనులు పూర్తి చేశామని చెప్పారు. 414 రోజుల్లో 1,397 మీటర్ల డయాఫ్రం వాల్ నిర్మించినట్లు తెలిపారు. తాను 28 సార్లు ప్రాజెక్టును సందర్శించానని, 82 సార్లు వర్చువల్‌గా సమీక్షలు నిర్వహించానని తెలిపారు. కొత్త డయాఫ్రం వాల్‌ను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేస్తామన్నారు. అదే ఏడాది జూన్ నాటికి ఎడమ కాల్వ పూర్తవుతుందన్నారు. పోలవరం వద్ద ఉన్న ఐదు కొండలపై హోటళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పుష్కరాల సమయానికి వీటిని పూర్తి చేస్తామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును తానే ప్రారంభించే అవకాశం రావడం సంతోషనిస్తుందన్నారు. సిఎం పర్యటనలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

'వసుధైక కుటుంబం' అంటాం.. సొంతవారితోనే కలిసి ఉండలేకపోతున్నాం



- కుటుంబం అనే భావన దెబ్బతింటోంది : సుప్రీం కోర్టు ఆందోళన

న్యూఢిల్లీ: కుటుంబ వ్యవస్థ విషయంలో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారతీయులు 'వసుధైక కుటుంబం' అనే సూత్రాన్ని విశ్వసిస్తారని, కానీ.. సొంతవారితోనే కలిసి ఉండలేకపోతున్నారని పేర్కొంది. కుటుంబం అనే భావన దెబ్బతింటోందని, ఇది కాస్త 'ఒక వ్యక్తి– ఒక కుటుంబం' అనే వ్యవస్థకు దారితీస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. తన పెద్ద కుమారుడిని ఇంటి నుంచి బయటకు పంపించాలని కోరుతూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ జిల్లాకు చెందిన కల్లూ మాల్, సంతోలా దేవీ దంపతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కుమారులకు, తల్లిదండ్రులకు మధ్య సత్సంబంధాల్లేవు. తమ కుమారుల నుంచి జీవనభృతి ఇప్పించాలంటూ 2017లో స్థానిక ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించగా.. తల్లిదండ్రులకు నెలకు రూ.8వేలు చెల్లించాలంటూ ఆదేశించింది. ఈ క్రమంలోనే పెద్ద కుమారుడికి, తల్లిదండ్రులకు మధ్య ఆస్తి వివాదం చెలరేగింది. ఇది కొనసాగుతుండగానే.. కల్లూ మాల్ మృతి చెందారు. తదనంతర పరిణామాల నేపథ్యంలో తన పెద్ద కుమారుడిని ఇంటి నుంచి బయటకు పంపించాలని తల్లి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం దీన్ని విచారించింది. కుమారుడు తన తల్లిదండ్రులను, ముఖ్యంగా తల్లిని అవమానించాడని, ఆమె జీవితంలో జోక్యం చేసుకున్నాడని చెప్పేందుకు ఎటువంటి ఫిర్యాదులు, ఆధారాల్లేవని తెలిపింది. ఆస్తికి తండ్రే యజమాని అని చెప్పలేమని, కుమారుడికీ అందులో వాటా ఉంటుందని పేర్కొంది. కొడుకును ఇంటి నుంచి పంపించేంత తీవ్రమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఈ క్రమంలోనే కుటుంబ వ్యవస్థపై కీలక వ్యాఖ్యలు చేసింది.

"మనమంతా 'వసుధైక కుటుంబం' అనే భావనను విశ్వసిస్తాం. అయితే, నేడు కుటుంబ ఐక్యతనే కాపాడుకోలేకపోతున్నాం. అలాంటిది.. 'ప్రపంచమంతా ఒకే కుటుంబం (వసుదైవ కుటుంబం)' గురించి ఇంకేం మాట్లాడగలం? 'కుటుంబం' అనే భావనే తుడిచిపెట్టుకుపోతోంది. 'వన్ పర్సన్, వన్ ఫ్యామిలీ' (ఒక వ్యక్తి.. ఒకే కుటుంబం) అనే వ్యవస్థకు చేరువలో ఉన్నాం" అని సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంది.

ఆరుగురి కోసం 'ఆపరేషన్'

- నిమిషానికి 3500 లీటర్ల ఊట నీరు బయటకు..



నవతెలంగాణ – మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న మరో ఆరుగురు కార్మికుల కోసం సహాయక చర్యలు వేగంగా కొనసాగుతున్నాయి. సొరంగంలో ఉబికి వస్తున్న ఊట నీటిని బయటకు పంపడానికి ప్రతి రెండున్నర కిలోమీటర్ల దగ్గర ఒక 150 హెచ్‌పీ మోటర్‌ను ఏర్పాటు చేసి నిమిషానికి 3500 లీటర్ల నీటిని బయటకు పంపుతున్నారు. అయినా ఉబికి వస్తున్న నీరు, పై నుంచి పడుతున్న మట్టి సహాయక చర్యలకు ఆటంకం కలిగిస్తున్నాయి. ఇప్పటికి ఇద్దరు ఇంజినీర్ల మృతదేహాలు బయటపడగా, మిగతా ఆరుగురు కార్మికుల ఆచూకీ కోసం రెస్క్యూ టీమ్‌లు అహర్నిశలూ సొరంగంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని సహాయక చర్యలు చేపడుతున్నాయి. అయితే, మనోజ్ కుమార్ మృతదేహం లభించిన చోటనే దుర్వాసన వస్తోందని గుర్తించారు. అక్కడే తవ్వకాలు మొదలుపెట్టారు. 4 హిటాచీలతోపాటు 11 శాఖలకు సంబంధించిన టీమ్‌లు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. త్వరలో కార్మికుల ఆచూకీ లభించే అవకాశాలున్నాయని కలెక్టర్ సంతోష్ తెలిపారు.

ప్రభుత్వ ఆధీనంలోనే విద్య ఉండాలి

- కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలి : టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో విద్యారంగం ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రయివేటు విద్యావ్యవస్థను రద్దు చేయాలని కోరారు. కామన్ స్కూల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. రాష్ట్రంలో విద్యారంగ పరిస్థితులపై బుధవారం శాసనమండలిలో చర్చ జరగడం సంతోషకరమని తెలిపారు. విద్యా నాణ్యతలో వెనుకబడి ఉన్నామనీ, విద్యారంగం సంక్షోభంలో ఉందంటూ ఒకవైపు మాట్లాడుతూనే మరోవైపు విద్యారంగానికి నిధులను కేటాయించడంలో పాలకులు మొండిచేయి చూపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం విద్యారంగానికి 15 శాతం నిధులను బడ్జెట్‌లో కేటాయించకుండా కేవలం 7.57 శాతం నిధులతో సరిపెట్టిందని తెలిపారు. విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నదని పేర్కొన్నారు. అనివార్యంగా ప్రయివేటు పాఠశాలలవైపు ప్రజలను మళ్లించడమే అవుతున్నదని తెలిపారు. ప్రభుత్వ ఆధీనంలో వివిధ యాజమాన్యాల కింద కొనసాగుతున్న వివిధ రకాల పాఠశాలలను ఒకే గొడుగు కిందకు తేవాలని సూచించారు. కామన్ స్కూల్ విధానం ద్వారా ఉపాధ్యాయుల పిల్లలే కాకుండా ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులప్రజలందరి పిల్లలు ఒకే దగ్గర చదువుకునే వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.

జమ్ముకాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

- ముగ్గురు పోలీసులు, ఇద్దరు సాయుధులు మృతి
- మరో ముగ్గురికి గాయాలు



శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని కథువా జిల్లాలో గురువారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు పోలీసులు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరు సాయుధులు కూడా మృతి చెందినట్లు పేర్కొన్నారు. కాగా మరో ఇద్దరు పోలీసులు, ఆర్మీ జవాన్ ఒకరు గాయపడినట్లు తెలిపారు. గత నాలుగు రోజులుగా ఈప్రాంతంలో పోలీసుల ప్రత్యేక ఆపరేషన్ గ్రూప్ (ఎస్ఓజి) ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ చేపడుతున్నారని అన్నారు. హీరానగర్ సెక్టార్‌లో ఆదివారం ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుండి సుమారు 30 కి.మీ దూరంలో ఉన్న రాజీబాగ్‌లోని ఘాటి జుతానా ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఇరువైపుల నుండి కాల్పులు కొనసాగుతున్నాయని అన్నారు

భారత్‌లో పర్యటించనున్న పుతిన్

మాస్కో : భారత్‌లో పర్యటించాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ప్రధాని మోడీ పంపిన ఆహ్వానాన్ని పుతిన్ ఆమోదించారని, అందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్ గురువారం చెప్పారు. "రష్యా అండ్ ఇండియా : టూవర్డ్ ఎ న్యూ బైలేటరల్ ఎజెండా " శీర్షికతో రష్యా అంతర్జాతీయ వ్యవహారాల మండలి (ఆర్ఐఎసి) నిర్వహించిన సమావేశంలో లావ్‌రోవ్ వీడియా ప్రసంగం చేశారు. భారతదేశంలో పుతిన్ పర్యటన కోసం ప్రస్తుతం సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రధాని మోడీ గతేడాది తిరిగి ఎన్నికైన వెంటనే మొదటిసారిగా రష్యాలో పర్యటించారని, ఇప్పుడు తమ వంతు వచ్చిందని లావ్‌రోవ్ వ్యాఖ్యానించారు. అయితే ఏ తేదీల్లో పర్యటిస్తున్నారో ఆయన వెల్లడించలేదు. భారత్‌లో వ్యూహాత్మక భాగస్వామ్య సంబంధాలను రష్యా వృద్ధి చేసుకుంటోందని లావ్‌రోవ్ ఈ నెల 24న వ్యాఖ్యానించారు. చైనా, భారత్, ఇరాన్, ఉత్తర కొరియా, కామన్వెల్త్ దేశాలతో రష్యా తన సంబంధాలను విస్తరించుకోవాలని భావిస్తోందన్నారు.

ప్యారానగర్ డంపింగ్ యార్డును రద్దు చేయాల్సిందే



- ప్రజా ప్రభుత్వం అంటూనే ప్రజల గోడు వినరా?
- చెత్త పోసేందుకు ప్రత్యామ్నాయాలు వెతకండి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు
- ప్యారానగర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాటానికి మద్దతుగా సీపీఐ(ఎం) సామూహిక నిరాహార దీక్ష

నవతెలంగాణ–మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రజా వ్యతిరేకమైన ప్యారానగర్ డంపింగ్ యార్డును రద్దు చేయాల్సిందేనని, రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజా ప్రభుత్వం అంటూనే ప్రజల గోడు వినకుండా నిర్బంధాన్ని అమలు చేస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డి జిల్లా ప్యారానగర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాటానికి మద్దతుగా గురువారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సామూహిక నిరహార దీక్షలను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమాలను నిర్బంధాలతో అణిచివేయాలని చూస్తే ప్రజలు మరింత తిరగబడతారన్నారు. స్థానిక ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా ఏకపక్షంగా డంపింగ్ యార్డు పెట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం సరైంది కాదన్నారు. గుమ్మడిదల ప్రాంతమంతా పచ్చటి పాడి పంటలతో కళకళలాడుతుందని, నిత్యం కూరగాయలు, ఇతర పంటలు హైదరాబాద్‌కు సరఫరా అవుతాయని తెలిపారు. ప్యారానగర్‌కు ఒక పక్క పచ్చటి అడవులు, మరో పక్క ఎయిర్‌ఫోర్స్ ఉన్నాయనే విషయాల్ని సైతం అధికారులు విస్మరించి గుడ్డిగా చెత్త డంపింగ్ యార్డు పెట్టాలని నిర్ణయం తీసుకోవడం అనాలోచిత చర్య అని అన్నారు. ప్రజలంతా రోడ్డెక్కి వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా అటు ప్రభుత్వం కానీ, జిల్లా అధికారులు కానీ స్పందించకపోవడం దారుణమన్నారు. డంపింగ్ యార్డును రద్దు చేయాలని కోరుతూ ప్రజలు పోరాడుతున్నందున వాస్తవ పరిస్థితుల్ని గమనించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్‌పై ఉన్నదని తెలిపారు. పట్నంలో పోగయ్యే లక్షలాది మెట్రిక్ టన్నుల చెత్తను పోసేందుకు పచ్చటి అడవులు, పాడి పంటలు పండే పొలాలు, ప్రజలు జీవించే గ్రామాల మధ్య, జనజీవనముండే ప్రాంతాల్లో కాకుండా దూరపు కొండల్లో డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్యారానగర్–నల్లవల్లిలో డంపింగ్ యార్డ్ పెడితే ఆ ప్రాంతమంతా కాలుష్య కోరల్లో చిక్కి ప్రజలు జీవించే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. ఇప్పటికే పరిశ్రమలు వెదజల్లే కాలుష్యం వల్ల జిన్నారం, బొంతపల్లి, పటాన్‌చెరు ప్రాంతమంతా పర్యావరణం దెబ్బతినడం వల్ల అక్కడ ప్రజలు జీవించలేకపోతున్నారన్నారు. డంపింగ్ యార్డ్ పెట్టి పచ్చగా ఉన్న గుమ్మడిదల ప్రాంతాన్ని చెత్తకుంపటి చేయొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేశం, కె.రాజయ్య, అతిమేల మాణిక్, జి.సాయిలు, ఎం.నర్సింహులు, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వర్, ప్రవీణ్‌కుమార్, యాదగిరి, కృష్ణ, నాయకులు అశోక్, వీరస్వామి, ఖయ్యూం, రమేష్ గౌడ్, నాగభూషణం, పద్మ, బాబురావు,జయరాం తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం

- సూపర్‌వైజర్ ఒత్తిడి భరించలేక ఫినాయిల్ తాగిన టీచర్
- సూపర్‌వైజర్‌ను సస్పెండ్ చేయాలి : సీఐటీయూ నేత ఖలీల్

నవతెలంగాణ–కామారెడ్డి డెస్క్

సూపర్‌వైజర్ ఒత్తిడి భరించలేక అంగన్వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలంలో జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామంలో సువర్ణ అనే మహిళ అంగన్వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తుంది. అంగన్వాడీ సూపర్‌వైజర్ వాణి ప్రతి చిన్న విషయానికి సువర్ణను వేధిస్తోంది. పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఆమెపై చర్యలు తీసుకోలేదు. సూపర్‌వైజర్ వాణి తన ఇంటి వద్ద వెట్టి చాకిరి పనిచేస్తే సమర్థిస్తుంది. లేకపోతే కక్ష సాధింపు చర్యలు చేపట్టి మెమో జారీ చేస్తుంది. ఆయాలు వాళ్ళ ఇంటి వద్ద బట్టలు ఉతకడం, భోజనం పాత్రలు శుభ్రం చేయకపోతే వేధిస్తుంది. ఆమె వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు బాధితురాలు తెలిపింది.



సూపర్‌వైజర్‌ను సస్పెండ్ చేయాలి : సీఐటీయూ నేత ఖలీల్

అంగన్వాడీ వర్కర్ సువర్ణను వేధింపులకు గురిచేసిన నసురుల్లాబాద్ సెక్టార్ సూపర్‌వైజర్ వాణిని వెంటనే సస్పెండ్ చేయాలని సీఐటీయూ నేత ఖలీల్ డిమాండ్ చేశారు. ఇంటి వద్ద వెట్టిచాకిరీ చేయని టీచర్లపైన కక్ష సాధింపు చర్యలు చేపడుతూ భయభ్రాంతులకు గురి చేయడం దారుణమన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌పై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చిల్లిగవ్వ కూడా కేంద్రం విదల్చలేదు

ఇచ్చిందల్లా రుణంగానే : కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్

వాయనాడ్ విపత్తు బాధితుల కోసం టౌన్‌షిప్‌కు శంకుస్థాపన



వాయనాడ్: కేరళలోని వయనాడ్ జిల్లాలో గతేడాది కొండ చరియలు విరిగిపడి భారీగా ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లిన ఘటన పెను విషాదం నింపిన విషయం తెలిసిందే. ఈ విపత్తు బాధితులను ఆదుకునేందుకు ప్రపంచ నలుమూలల నుంచి ప్రజలు వివిధ రూపాల్లో సాయం అందించగా..కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు చిల్లిగవ్వ సాయం కూడా అందించింది లేదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. బాధిత కుటుంబాల పునరావాసం కోసం ఎల్‌స్టోన్ టీ ఎస్టేట్ వద్ద నిర్మించనున్న మోడల్ టౌన్‌షిప్‌నకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి కె రాజన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయన్ మాట్లాడుతూ.. వయనాడ్ కొండచరియలు విరిగి పడిన ఘటనలో బాధితులకు పునరావాసం కోసం కేంద్రం నుంచి ఇప్పటివరకు ఆర్థిక సాయం అందలేదని వెల్లడించారు. పునరావాస పనులకు కేవలం రుణం మాత్రం అందిందని.. అదీ తగినంతగా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పునరావాసం కోసం కేంద్రం తన మూలధన పెట్టుబడి పథకం నుంచి దాదాపు రూ.529.50 కోట్ల రుణం మంజూరు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా విజయన్ ప్రస్తావించారు. కేంద్రంతో తమకు ఉన్న గత అనుభవాల నుంచి ఇంకేమీ ఆశించలేమని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మహా విపత్తులో బాధితులైన వారి కోసం పెద్ద ఎత్తున కొనసాగుతున్న పునరావస పనులు కేరళ ప్రజల ఐక్యతకు గొప్ప ఉదాహరణ అని తెలిపారు. ప్రజా చైతన్య స్ఫూర్తిని ఏ ప్రకృతి విపత్తూ ఓడించజాలదని ఆయన అన్నారు. 'ప్రజలు మనతో ఉంటే అసాధ్యమంటూ ఏదీ ఉండదు. మనం మనుగడ సాగించగలం. ఇక్కడ కొనసాగుతున్న పునరావస పనులు ఇచ్చే సందేశమిదే' అని విజయన్ అన్నారు. వరదలు, కోవిడ్ ఇలా ఒకదాని వెంబడి ఒకటి వరుసగా ఇబ్బందులు రావడంతో ఆర్థిక సంక్షోభాన్ని అధిగమిచ్చేందుకు రాష్ట్రం పోరాడుతున్న సమయంలో ఈ ప్రకృతి విపత్తు సంభవించిందని, అయితే ఎన్ని కడగండ్లు ఎదురైనా ప్రజలంతా ఐక్యంగా నిలబడటంతో రాష్ట్రం ధీరోదాత్తంగా నిలబడిందని ఆయన పేర్కొన్నారు. వరుస కష్టాలతో తల్లడిల్లుతున్న రాష్ట్రంలో మరో విపత్తు సంభవిస్తే ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం తిరిగి చెల్లించే రుణం మినహా చిలిగవ్వ కూడా సాయం అందించలేకపోయిందని ఆయన విమర్శించారు. 'గత అనుభవాలు చూస్తే కేంద్రం నుంచి ఇంతకు మించి ఆశించలేం. ఇన్నీ రకాల ఇబ్బందుల్లోనూ పునరావస చర్యలు నిరాటకంగా కొనసాగిస్తున్నాం' అని ఆయన చెప్పారు. కాగా ఈ సందర్భంగా పునరావ పనుల్లో సహాయ సహకారాలు అందించేందుకు వీలుగా ఒక స్పాన్సర్‌షిప్ పోర్టల్‌ను https://wayanadtownship.kerala.gov.in కూడా ఆయన ప్రారంభించారు. పునరావాస బాధితుల కోసం 100 ఇళ నిర్మాణానికి గాను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య రూ.20 కోట్లు, అలాగే భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) మరో 100 ఇళ్ల నిర్మాణానికి అవసరమ్యే నిధులను అందజేసినట్లు విజయన్ ప్రకటించారు. నేషనల్ సర్వీస్ స్కీమ్ కింద పాఠశాల, కళాశాల విద్యార్థులు సేకరించిన రూ.10 కోట్ల మొత్తాన్ని కూడా పునరావస నిధికి అందజేసినట్లు వెల్లడించారు.

ఆంక్షలు ఎత్తివేస్తేనే నల్ల సముద్రంపై ఒప్పందం


అమెరికాకు రష్యా స్పష్టీకరణ

తాత్కాలికంగా కాల్పుల విరమణకు ఓకే

మాస్కో : నల్ల సముద్ర ప్రాంతంలో తాత్కాలికంగా కాల్పుల విరమణ పాటించేందుకు రష్యా, ఉక్రెయిన్ అంగీకరించాయి. అయితే ఈ విషయంలో జరిగిన ఒప్పందంపై ముందుకెళ్లాలంటే నల్ల సముద్ర జలాల విషయంలోనూ, వివిధ రంగాల్లో రష్యాపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని అమెరికాకు రష్యా స్పష్టం చేసింది. అమెరికా మధ్యవర్తిత్వంతో బ్లాక్ సీ ఒప్పందానికి రష్యా, ఉక్రెయిన్‌లు అంగీకరించాయి. కానీ కీవ్‌తో కాల్పుల విరమణ ప్రారంభం కావడానికి ముందుగానే తమపై ఆంక్షలను ఎత్తివేయాలని క్రెమ్లిన్ షరతు విధించింది. నల్ల సముద్ర ప్రాంతంలో తాత్కాలిక కాల్పుల విరమణతో పాటు ఆహార ధాన్యాల రవాణాకు వీలుగా ఇరు దేశాలు ఒప్పందానికి అంగీకరించారని అమెరికా ప్రకటించింది. అయితే ఈ రెండు ఒప్పందాలు ఎప్పటి నుండి అమలవుతాయనేది వెల్లడించలేదు. కాగా, కొద్ది గంటల వ్యవధిలోనే రష్యా నుండి మరో ప్రకటన వెలువడింది. రష్యా బ్యాంకులపై విధించిన ఆంక్షలను ఎత్తివేస్తేనే దాడులు ఆపుతామని షరతు విధించింది. దీనిపై ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్స్కీ స్పందిస్తూ, తాము ప్రకటించిన వెంటనే నల్ల సముద్ర జలాల్లో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వస్తుందని అమెరికా పక్షం తెలియచేసిందని, కానీ ఈలోగా క్రెమ్లిన్ షరతు విధించిందని పేర్కొన్నారు.

నేటి నుంచి ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సమ్మె

స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతో చర్చలు విఫలం



ఉక్కునగరం : ఉక్కు యాజమాన్యం, అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నడుమ చర్చలు విఫలమయ్యాయి. 'ఎట్టి పరిస్థితిల్లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపు తప్పదు' అని ఉక్కు యాజమాన్యం చెప్పడంతో తుదకు శుక్రవారం నుంచి కార్మికులు సమ్మెకు దిగక తప్పలేదు. అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు గురువారం రాత్రి 9:30 వరకూ చర్చలు జరిపినప్పటికీ ఎలాంటి ప్రయోజనమూ లేకపోవడంతో కార్మికులు 'సమ్మె' నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల తొలగించిన 248 మంది కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, మెడికల్ టెస్ట్‌ల పేరిట తొలగింపులు ఆపాలని కార్మికులు కోరుతున్నారు. అదే విషయాన్ని లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలని కోరడంతో యాజమాన్యం తొలుత సమయం కోరింది. చివరకు పై నుంచి ఒత్తిడి మేరకు రాసి ఇవ్వలేమని చెప్పడంతో చర్చలు విఫలమయ్యాయి. 30 శాతం, 20 శాతం కాంట్రాక్టు లేబర్ తొలగింపును ఆపాలని కోరినప్పటికీ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నెల 11న రీజనల్ లేబర్ కమిషనర్‌తో జరిగిన చర్చలను సైతం యాజమాన్యం తుంగలో తొక్కింది. తమ డిమాండ్స్‌కు ఒప్పుకుంటే సమ్మెను విరమించుకుంటామన్న మాటలను సైతం యాజమాన్యం పట్టించుకోలేదు. దీంతో శుక్రవారం నుంచి సమ్మెకు దిగుతున్నామని, ప్రతి కార్మికుడూ పాల్గొనాలని కార్మిక సంఘాల నేతలు కోరారు. సమ్మెలో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్టీల్ హెచ్ఓడి కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని, అనంతరం పాదయాత్రగా ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌కు చేరుకుంటామన్నారు. చర్చల్లో స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాస్, కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు మంత్రి రవి, ఉమ్మడి అప్పారావు పాల్గొన్నారు.

బహుళపక్షవాదమే మిన్న!

బీజింగ్‌లో ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి పర్యటన

ఉక్రెయిన్, వాణిజ్య అంశాలపై చర్చలు

బీజింగ్ : ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జేన్ నోయల్ బారట్ గురువారం నుండి రెండు రోజుల పాటు చైనాలో పర్యటిస్తున్నారు. చైనా, యూరప్‌ల మధ్య దీర్ఘకాలంగా నెలకొన్న వాణిజ్య వివాదాల పరిష్కారంపై, అలాగే ఉక్రెయిన్‌పై చైనా విదేశాంగ మంత్రితో ఆయన చర్చలు జరిపారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యితో భేటీ అనంతరం పత్రికా సమావేశంలో పాల్గొన్నారు. ఏకపక్షవాదం కన్నా బహుళపక్షవాదాన్ని ఇరు దేశాలు ఎంపిక చేసుకుని, ఆ పంథాను అనుసరించాలని భావిస్తున్నట్లు నేతలు చెప్పారు. పరస్పర ప్రయోజనాలు, సమాన అవకాశాలు గల మార్గాన సాగాలని నిర్ణయించారు. అనంతరం బారట్ ప్రధాని లి కియాంగ్‌తో కూడా భేటీ అయ్యారు. ప్రస్తుతం ప్రపంచం ప్రశాంతంగా లేదని, అస్థిరత, అనిశ్చితులు రోజు రోజుకు పెరుగుతున్నాయని ప్రధాని కియాంగ్ ఆందోళన వ్యక్తం చేశారు.

రెండు స్వతంత్ర, బాధ్యతాయుతమైన ప్రధాన దేశాలుగా చైనా, ఫ్రాన్స్‌లు సహకారాన్ని బలపరుచుకోవాల న్నారు. మన సహకారం ద్వారా ద్వైపాక్షిక సంబంధాల్లో, ప్రపంచ సంబంధాల్లో మరింత ధృఢత్వాన్ని మనం పాదుకొల్పాలన్నారు. ప్రస్తుత తరుణంలో బహుళపక్షవాదానికి సంబంధించి అనేక ప్రధాన సూత్రాలు, సిద్ధాంతాలు దారుణంగా దెబ్బతింటున్నాయని బారట్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం బారట్ షాంఘై వెళ్ళి స్థానిక అధికారులతో, వ్యాపార నేతలతో వరుస సమావేశాలు నిర్వహించను న్నారు. ఉక్రెయిన్‌కు బలమైన మద్దతుదారుగా ఫ్రాన్స్ వుండగా, రష్యాకు దౌత్యపరమైన తోడ్పాటును చైనా అందిస్తోంది. ఇటీవల రష్యాను ట్రంప్ సమర్థిస్తుండడం పెరుగుతుండడంతో ఉక్రెయిన్‌కు మద్దతును సమకూర్చడంపై అమెరికా, యూరప్‌ల మధ్య విభేదాలు ఉధృతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో చైనాలో చర్చలు జరుగుతున్నాయి. చర్చల్లో ఏం మాట్లాడుకున్నారన్నది వెంటనే తెలియరాలేదు కానీ సంబంధాల పట్ల ఇరు దేశాలు సానుకూలంగానే వున్నాయి.

ఒకాయన సాయం చేయరు... మరొకాయన నిస్సహాయుడు...

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ అనే పదమే లేదని ఆవేదన

రాష్ట్రానికి మోడీ సర్కారు చేస్తున్న అన్యాయంపై సీం, మంత్రులు ఎందుకు మాట్లాడరు?

విభజన హామీల్లో ఒక్కదాన్నైనా అమలు చేశారా?

కుంభమేళాకేమో రూ.2100 కోట్లు...రాష్ట్రానికి 21 పైసలు కూడా ఇవ్వరా?

అక్కడ ప్రధాని, ఇక్కడ సీఎం ప్రజలకు ఈస్ట్‌మన్ కలర్ సినిమా చూపిస్తున్నారు

మేం అప్పులు చేశాం..సంపద సృష్టించాం

రాష్ట్రం దివాళా తీసిదంటూ దుష్ప్రచారం చేయడం సరైందికాదు

ప్రతీకార రాజకీయాలు తగదు : ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చలో మాజీ మంత్రి కేటీఆర్

కేంద్ర మంత్రులపై కేటీఆర్ సెటైర్లు



నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నా...రాష్ట్రానికి ఒకాయన సాయం చేయరు...మరొకాయన నిస్సహాయుడు...అని మాజీ మంత్రి కేటీఆర్ సెటైర్ వేశారు. ధర్మంతో రాజకీయాలు చేయాలే తప్ప ఆ ధర్మాన్ని రాజకీయాల్లోకి లాగొద్దని హితవు పలికారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అన్ని అడ్డంకులు దాటుకుని మెరుపు వేగంతో అభివృద్ధి చేశామని చెప్పారు. అయినా కేంద్ర ప్రభుత్వ సాయం సున్నా అని ఎద్దేవా చేశారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి ఎంతో ఇస్తున్నాం...అయితే అక్కడి నుంచి రాష్ట్రానికి వస్తున్నది మాత్రం చాలా తక్కువ అని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అనేక సార్లు అడిగినా కేంద్రం పెడచెవిన పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం శాసనసభలో ద్రవ్యవినిమయ బిల్లు–2025పై జరిగిన చర్చలో కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం అడగాల్సినుందనీ సూచించారు. కేంద్ర బడ్జెట్‌లో అనే పదమే లేదని విమర్శించారు. కేంద్రానికి తెలంగాణ అంటే అంత వివక్ష ఎందుకని ప్రశ్నించారు. తల్లిని చంపి, బిడ్డను బతికించారంటూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై మోడీ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాష్ట్రాలు పన్నులు చెల్లిస్తేనే కేంద్రం ఉందనీ, అందుకే మాజీ సీఎం ఎన్టీ రామారావు కేంద్రం మిథ్య అని అన్నారని గుర్తు చేశారు. రాష్ట్రాలు లేకుంటే కేంద్రంలేదన్నారు. డబుల్ ఇంజన్ సర్కారు అంటూ కేంద్రం రాష్ట్రాలను బెదిరిస్తున్నదని విమర్శించారు. తాము చెప్పినట్టు వింటేనే నిధులు ఇస్తామంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రసంగంలో కనీసం నిరసన కూడా తెలపలేదన్నారు. ఒకరకంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను బ్లాక్‌మెయిల్ చేస్తున్నదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంపై ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. కేంద్రంతో సఖ్యత ఉండాలనే లక్ష్యంతో మిషన్ భగీరథ పథకం ప్రారంభానికి మోడీని ఆహ్వానించామనీ, అయినా సరే చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథకు నిధులు ఇవ్వాలంటూ నిటిఅయోగ్ సూచించినా పట్టించుకునే నాథుడే లేడని విమర్శించారు. అప్పర్ భద్ర, పోలవరం ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇచ్చిన కేంద్రం...తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టుకో, పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికో ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఒక కలం పోటుతో లోయర్ సిలేరు, ఐదు మండలాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కలిపిందన్నారు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ నిర్మించాలంటే, ఆ ఇనుము బాగాలేదంటూ సాకులు చెబుతున్నదని విమర్శించారు. బత్తీస్‌దిల్లా ఐరన్‌ఓర్ సాయంతో (1800 కి.మీ. దూరంలో) గుజరాత్‌లో స్టీల్ ఫ్యాక్టరీ నడుపుతున్నారనీ, 180 కి.మీ దూరంలో ఉన్న బయ్యారంలో ఎందుకు నడపరని ప్రశ్నించారు. తెలంగాణకు తలమానికమైన ఐటీఐఆర్‌ను కేంద్రం రద్దు చేసిందని విమర్శించారు. ఇతర రాష్ట్రాల్లో కారిడార్ ఏర్పాటు చేసిన కేంద్రం...రాష్ట్రానికి గుండు సున్న ఇచ్చిందని చెప్పారు. ఐఐఎం, ఐఐఐటీ. నవోదయ పాఠశాలలు, ఆదిలాబాద్‌లో ఉన్న సీసీఐ ఫ్యాక్టరీ తెరిపిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఉదయ్‌స్కీమ్‌లో చేరి మోటార్లకు మీటర్లు బిగించాలంటూ కేంద్రం తమపై ఒత్తిడి తీసుకొచ్చినా...రైతుల కోసం తలొగ్గలేదని గుర్తు చేశారు. మహకుంభమేళాకు రూ.2100 కోట్లు ఇచ్చిన కేంద్రం...సమ్మక్క, సారలమ్మ జాతరకు రూ. 21 పైసలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. అటు మోడీ, ఇటు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రైతులకు ఈస్ట్‌మన్ కలర్ సినిమా చూపిస్తున్నారని ఎద్దేవా చేవారు. సత్యం, ధర్మం అంటూ ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఒక అబద్ధాన్ని సీఎం వెయ్యి చెప్పి అదే నిజమంటూ కిందిస్థాయికి తీసుకెళ్లారని విమర్శించారు. గతంలో తాము ల్యాండ్ క్రూయిజర్ కార్లు కొని విజయవాడలో దాచి పెట్టామంటూ సీఎం ప్రచారం చేశారనీ, ఇప్పుడు ఆ కార్లను వాళ్లే ఉపయోగిస్తున్నారని తెలిపారు. ప్రగతి భవన్‌లో 100 గదులున్నాయనీ, ఆర్థిక స్థితిగతులు బాగాలేవనీ, అప్పులతో రాష్ట్రం దివాళా తీసిదంటూ విపరీత దోరణితో ప్రచారం చేశారని విమర్శించారు. అప్పులతో తాము సంపదను సృష్టించామని చెప్పారు. అభివృద్ధి కోసమే అప్పులు చేశామనీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అప్పులు చేస్తున్నదని గుర్తు చేశారు. రాష్ట్రంలో 218 టీఎంసీల నిల్వ సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులను నిర్మించామని గుర్తు చేశారు. దీంతో అన్ని పంటల దిగుబడి కూడా పెరిగిందని తెలిపారు. 2019 కరోనా పరిస్థితుల్లో కొన్నింటిని ఆపి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించామని చెప్పారు. ఈ కాలంలో ఉద్యోగులకు వేతనాలు కూడా అందలేదని తెలిపారు.తమ ప్రభుత్వం దిగిపోయే ముందు రూ. 5,944 కోట్ల సర్‌ప్లస్ రెవెన్యూ ఉందని కేటీఆర్ వివరించారు.